పేజీలు :12
వెల :5/-

# మీడియా టుడే

జాతీయ తెలుగు దినపత్రిక www.mediatodaydaily.com

CHAIRMAN : K.KOTESWAR RAO(KKR) మన మీడియా - మన సమాజం

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Rajamandri, Chittur, Visakhapatnam prakasham

సంపుటి : 01 సంచిక : 125 CHAIRMAN : K.KOTESWAR RAO(KKR) గురువారం 06-8-2026 పేజీలు 12 వెల 5/-

# అధికారుల బదిలీ.. సీఎం విచక్షణాధికారం

## చట్టానికి లోబడే డీసీపీ బదిలీ జరిగింది..

**పనిలేని నాయకులే విమర్శలు చేస్తున్నారు**
**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు**
**తుమ్మిడిహెట్టి ఎత్తు పెంపునకు అనుమతులు ఇప్పించండి..**
**పెంపుతో మహారాష్ట్రలో ముంపు ప్రభావం పెద్దగా ఉండదు**
**మహారాష్ట్రతో సమావేశం ఏర్పాటు చేయండి**
**జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం వినతి**
**పాలమూరు, సీతమ్మసాగర్, డిండికి పర్యావరణ అనుమతులివ్వండి**
**కేంద్ర మంత్రి భూపేందర్‌కు రేవంత్ విజ్ఞప్తి**



**న్యూఢిల్లీ, ఆగస్టు 5 మీడియా టుడే**
ప్రధాని నరేంద్రమోదీని, ఆయన తల్లిని సోషల్ మీడియాలో అసభ్యకరంగా దూషించిన ఘటనలపై బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఒక్క కేసైనా నమోదు చేశారా? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. కానీ, తెలంగాణలో తాము కేసు పెట్టామని తెలిపారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను ఆయన కార్యాలయంలో కలిసి బయటికి వస్తుండగా.. మీడియా అడిగిన ప్రశ్నలకు రేవంత్‌రెడ్డి బదులిచ్చారు. ప్రధాని నరేంద్రమోదీపై అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో తెలంగాణలో కేసు నమోదు చేసిన డీసీపీని బదిలీ చేయడంపై స్పందిస్తూ.. తమ ప్రభుత్వం చట్టానికి లోబడే ముందుకెళుతోందని చెప్పారు. వచ్చిన ఫిర్యాదు ఆధారంగానే పోలీసులు కేసు నమోదు చేసి చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. అధికారులను బదిలీ చేయడమనేది ముఖ్యమంత్రికి ఉన్న విచక్షణాధికారమని, అది రాజ్యాంగం కల్పించిన బాధ్యతల్లో ఒకటని అన్నారు. అయితే, ఈ కేసు వ్యవహారంలో ఒక డీఎస్పీ బదిలీపై ఢిల్లీలో ఉన్న కొందరు పనీపాటా లేని నాయకులు విమర్శలు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. విద్యార్థులను, ఇతర పార్టీల నాయకులను బీజేపీ నేతలు అత్యంత అసభ్యకరమైన, పరుష పదజాలంతో దూషిస్తున్నారని తప్పుబట్టారు. మరోవైపు ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్ర నుంచి అనుమతులు ఇప్పించాలని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ ఎత్తు పెంపుతో మహారాష్ట్రలో ముంపు ప్రభావం పెద్దగా ఉండదని తెలిపారు. బుధవారం కేంద్రమంత్రితో ఆయన కార్యాలయంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి రేవంత్ సమావేశమయ్యారు.ఈ సందర్భంగా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యం, ప్రాజెక్టుకు అనుమతులు కోరుతూ ప్రధానమంత్రికి తాను రాసిన లేఖ, దానికి ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి జలశక్తికి పంపిన లేఖ విషయాన్ని సీఎం ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి గతంలోనే తెలంగాణ, మహారాష్ట్ర మధ్య ఒప్పందం కుదిరిన విషయాన్ని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. 148 మీటర్ల నుంచి 152 మీటర్ల వరకు ఎత్తుతో బ్యారేజీ నిర్మించే అంశంపై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్(సీడబ్ల్యూపీఆర్ఎస్) అధ్యయనం చేసిందని తెలిపారు. ఈ అధ్యయనం ప్రకారం.. 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించినా, 152 మీటర్ల ఎత్తులో నిర్మించినా ముంపులో పెద్దగా తేడా ఉండదని స్పష్టమైనట్లు వివరించారు. పైగా, ముంపులోనూ 50 శాతం నదీ గర్భం (రివర్ బెడ్)లోనే ఉంటుందన్నారు. 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేపడితే.. గ్రావిటీ ద్వారా కావాల్సినంత నీరు సరఫరా చేయలేమని, అందుకే 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కేంద్రమంత్రిని కోరారు.

# తమిళనాడులో జెన్‌జీకి ప్రత్యేక పథకాలు



**చెన్నై, ఆగస్టు 5 మీడియా టుడే**
దేశంలోనే తొలి ఏఐ సిటీని, ఏఐ యూనివ ర్సిటీని ఏర్పాటు చేస్తామని తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది. టీవీకే ప్రభుత్వం తొలి బడ్జెట్‌ను రాష్ట్ర ఆర్థికమంత్రి మరియా విల్సన్ బుధవారం ఉదయం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. జెన్‌జీ కోసం పలు ప్రత్యేక పథకాలు ప్రకటించారు. అంతర్జాతీయ నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని, ప్రయోగశాలను, ఐఏ క్వాంటమ్ సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు గల సాధ్యాసాధ్యాలపై పరిశీలనకు రూ.5 కోట్లు కేటాయించారు. 11వ తరగతి విద్యార్థులకు ఉచిత సైకిళ్లతో పాటు హెల్మెట్లు, వాటర్ బాటిళ్లను కూడా అందిస్తామన్నారు. కళాశాలలో చదివే విద్యార్థులకు ల్యాప్‌ట్ష?పలు పంపిణీ చేస్తామన్నారు. రూ.90 కోట్ల వ్యయంతో 5 పారిశ్రామిక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. వెట్రి నైపుణ్యాభివృద్ధి పథకం ద్వారా 12 లక్షల మంది కాలేజీ విద్యార్థులు, లక్షమంది నిరుద్యోగులకు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందిస్తామన్నారు. 2031లోగా ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీలలో చదివే 5 లక్షల మంది యువకులకు ఏఐపై శిక్షణ అందిస్తామన్నారు. విద్యుత్ వాహనాల మరమ్మతు పనుల కోసం వచ్చే ఐదేళ్లలో 12,500 మంది యువకులకు మెకానిక్ శిక్షణ ఇస్తామని చెప్పారు.

# తప్పుదోవ పట్టించారు

**కావాలనే విద్యార్థుల భావోద్వేగాలను రెచ్చగొట్టారు**
**బంగ్లాదేశ్‌లో విద్యార్థుల తిరుగుబాటుపై షేక్ హసీనా**



**న్యూఢిల్లీ, ఆగస్టు 5: మీడియా టుడే**
బంగ్లాదేశ్‌లో 2024లో జరిగిన విద్యార్థుల తిరుగుబాటు వెనుక పెద్ద కుట్ర ఉందని ఆ దేశ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా ఆరోపించారు. కొన్ని వ్యవస్థీకృత ముఠాలు విద్యార్థులను భావోద్వేగంగా రెచ్చగొట్టి.. వారి ఉద్యమాన్ని రాజకీయ తిరుగుబాటుగా మార్చేశాయన్నారు. ఏదేమైనా తన దేశ ప్రజల కోసం తాను డిసెంబరులో స్వదేశానికి తిరిగి వెళ్తానని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వం కూలిపోయి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఫారిన్ కరస్పాండెంట్స్ క్లబ్(ఎ?ఫసీసీ) ఆఫ్ సౌత్ ఏషియా ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని ఎఫ్‌సీసీలో బుధవారం ఓ కార్యక్రమం జరిగింది. ఇందులో షేక్ హసీనా వర్చువల్‌గా విలేకరులతో మాట్లాడారు. బంగ్లాదేశ్‌ను వీడిన తర్వాత హసీనా మాట్లాడిన తొలి విలేకరుల సమావేశం ఇదే.

# హరీశ్.. కాళేశ్వరం ముడుపుల్లో నీ వాటా ఎంతో చెప్పు

**కట్టుకథలతో బట్ట కాల్చి మీద వేయడం మానేయ్..**
**ఏపీ ప్రాజెక్టులకు పరోక్ష మద్దతు ఇచ్చిందే మీరు : మంత్రి ఉత్తమ్**



**హైదరాబాద్, ఢిల్లీ, ఆగస్టు 5మీడియా టుడే**
కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఏపీ కాంట్రాక్టర్ల నుంచి అందుకున్న రూ.1,400 కోట్ల ముడుపుల్లో తన వాటా ఎంతో హరీశ్‌రావు బయటపెట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇకనైన కట్టు కథలతో బట్ట కాల్చి మీద వేయడం మానెయ్యాలని హరీశ్‌రావుకు ఒక ప్రకటనలో హితవు పలికారు. రూ.లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును నిండా ముంచి సిగ్గు లేకుండా రాజకీయాలు చేస్తావా? అంటూ మండిపడ్డారు. తొమ్మిదిన్నరేళ్ల అధికారంలో ఉండి తెలంగాణ ప్రాజెక్టుల ప్రయోజనాలను ఏనాడూ పట్టించుకోని బీఆర్ఎస్ నేతలు, అధికారం కోల్పోగానే కడుపు మంటతో మొసలి కన్నీరు కారుస్తున్నారని ధ్వజమెత్తారు. గత 12 ఏళ్లుగా ప్రతి బోర్డు సమావేశంలో ఏపీ ప్రభుత్వం తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూనే ఉందని, అందులో కొత్త విషయం ఏమీ లేదన్నారు. బీఆర్ఎస్ నేతలు ఏపీ ప్రాజెక్టులకు పరోక్షంగా మద్దతు ఇచ్చి, ఇప్పుడు తమపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తొమ్మిదిన్నరేళ్లు పాలించిన బీఆర్ఎస్ ఏనాడూ తెలంగాణ ప్రయోజనాలు కాపాడలేదని విమర్శించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం, పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు పనులు, పట్టిసీమ పూర్తయింది బీఆర్ఎస్ హయాంలో కాదా? అని ప్రశ్నించారు. "తెలంగాణలో మళ్లీ అధికారంలోకి రాలేమని తెలిసి, ఏపీతో కుమ్మక్కయి నాగార్జున సాగర్ ప్రాజెక్టును వివాదం చేసింది మీరు కాదా?" అని నిలదీశారు. ఈ నెల 18నగోదావరి బోర్డు అజెండాలో ఉంచిన అంశాలు కొత్తవేమీ కాదన్నారు.

# 6 అర్బన్ అథారిటీల్లో అద్భుత ప్రగతి జరగాలి

**సీఎం చంద్రబాబు**
**సూక్ష్మ ప్రణాళికలకు రూపకల్పన**
**సీఆర్‌జెడ్‌కు అనుగుణంగా ప్రాజెక్టు పూర్తి**
**విశాఖ బే సిటీది కీలక పాత్ర**
**పట్టణాభివృద్ధి పనులు పెద్దఎత్తున జరగాలి**
**ఈస్ట్-వెస్ట్ కనెక్టివిటీపై ప్రత్యేక దృష్టి**
**కాకినాడ, విశాఖలతో పశ్చిమ భారత ప్రాంతాలను అనుసంధానించాలి: సీఎం**



**అమరావతి, ఆగస్టు 5: మీడియా టుడే**
ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్) సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దీని పరిధిలోని అన్ని ప్రాంతాలను, అన్ని రంగాలను పరిగణనలోకి తీసుకుంటూ పూర్తిస్థాయి అభివృద్ధికి సూక్ష్మ ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ ప్రణాళికల్లో విద్యాసంస్థలను, విశ్వవిద్యాలయాలను కూడా కలుపుకొని ముందుకెళ్లాలని.. ఆంధ్ర యూనివర్సిటీ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. విశాఖ రీజియన్ పరిధిలో కొత్త ప్రాజెక్టులు.. సీఆర్‌జడ్ రీ-క్లాసిఫికేషన్, వైజాగ్ బే సిటీ, బే-సిటీ అథారిటీ ఏర్పాటు తదితర అభివృద్ధి ప్రణాళికలపై బుధవారం ఆయన ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. ఈస్ట్ టూ వెస్ట్ కనెక్టివిటీపై ఇప్పుడు జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోందని.. ఇటీవల ప్రధాని మోదీ కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించారని గుర్తుచేశారు. వీఈఆర్ పరిధిలో రూ.9.50 లక్షల కోట్ల పెట్టుబడులు రావడానికి అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రైవేటు రంగం నుంచి 5.3 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నట్లు చెప్పారు. అయితే రూ.3.50 నుంచి రూ.4 లక్షల కోట్ల వరకు ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం ఖర్చుచేయాల్సి వస్తుందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే గూగుల్ ఏఐ డేటా సెంటర్, ఆర్సెలార్ మిత్తల్-నిప్పన్ స్టీల్ ప్లాంట్ తదితర భారీ పరిశ్రమలు విశాఖ వచ్చాయని ప్రస్తావించారు. విశాఖలో ఐటీ, డేటా సెంటర్లు సహా వివిధ రంగాలకు చెందిన ఎకో సిస్టం ఏర్పాటైందని, దీనికనుగుణంగా వీఈఆర్ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

**వైజాగ్ బే సిటీది కీలక పాత్ర**
వీఈఆర్ ప్రాజెక్టులో వైజాగ్ బే సిటీది కీలక పాత్ర అని ముఖ్యమంత్రి చెప్పారు. దీని ద్వారా పెద్దఎత్తున పట్టణాభివృద్ధి పనులు జరగాలని, ఇందుకోసం వివిధ పథకాల నిధులను కన్వెర్జన్స్ చేసి ఈ ప్రాజెక్టు కోసం వినియోగించాలని దిశానిర్దేశం చేశారు. కేంద్ర నిధులను మరింతగా రాబట్టడంపైనా దృష్టి సారించాలన్నారు. వీఈఆర్ పరిధిలో ఉన్న 6 అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల్లో అద్భుతమైన అభివృద్ధి జరగాలని సీఎం సూచించారు. 'శ్రీకాకుళం జిల్లాలోని మూలపేట పోర్టు మొదలుకుని రాజమహేంద్రవరంలోని అఖండ గోదావరి ప్రాజెక్టు వరకు ప్రతి టూరిజం స్పాట్‌తో సహా ప్రతి రంగాన్నీ అభివృద్ధి చేసేలా.. పెట్టుబడులు వచ్చేలా చేయడంతోపాటు అవసరమైన మేరకు ఎక్స్‌పీరియన్స్ జోన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. వివిధ ప్రాజెక్టులను అనుసంధానిస్తూ వీఈఆర్ ప్రగతి కొనసాగాలి. పెట్టుబడుల సాధన ద్వారా వివిధ రంగాల్లో ఉద్యోగాలను కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలి. స్థానిక యువతలో స్కిల్స్ పెంపొందించాలి. ఇందులో భాగంగా పీపీపీ ప్రాజెక్టులను అమల్లోకి తేవడంతోపాటు.. వాటికి వయబిలిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) స్కీం అమలును పరిశీలించాలి.

# ఢిల్లీ డేంజర్.. కుట్రల్లో చిక్కుకోవద్దు

**ఎన్‌డీఏ ఎంపీలకు ప్రధాని మోదీ జాగ్రత్తలు**



**న్యూఢిల్లీ, ఆగస్టు 5: మీడియా టుడే**
దేశ రాజధాని గురించి ఎన్‌డీఏ రాజ్యసభ ఎంపీలకు ప్రధాని మోదీ జాగ్రత్తలు చెప్పారు. ఢిల్లీ ప్రమాదకర ప్రదేశమన్నారు. లూటియన్స్ జోన్‌లో అప్రమత్తంగా ఉండాలని.. కుతంత్రాల వలలో చిక్కుకోవద్దని సూచించారు. ఎవరిని కలుస్తున్నారో, ఎక్కడ కలుస్తున్నారో మెలకువతో వ్యవహరించాలన్నారు. బుధ వారం ఉదయం 37 మంది ఎన్‌డీఏ రాజ్యసభ ఎంపీలతో ఆయన అల్పాహార విందు సమావేశం ఏర్పాటుచేశారు. గంట పాటు భేటీ సాగింది. ఎంపీ లెటర్‌హెడ్ దుర్వినియోగం కాకుండా చూసుకోవాలని ప్రధాని వారికి సూచించారు. ఈ సందర్భంగా ఢిల్లీ రాజకీయాలపై కొన్ని టిప్స్ ఇచ్చారు. ఎవరితోనైనా ఫోన్లో గౌరవంగా మాట్లాడాలని అన్నారు. ఈ ఎంపీల్లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, ఆప్ నుంచి బీజేపీలోకి వచ్చిన ఎంపీలు కూడా ఉన్నారు. పార్లమెంటుకు తప్పనిసరిగా హాజరు కావాలని.. నూరు శాతం హాజరు ఉండేలా చూసుకోవాలని.. ప్రతి రోజూ పార్లమెంటు గ్రంథాలయంలో కనీసం ఒకట్రెండు గంటలు గడపాలని సూచించారు. యువతతో మమేకం కావాలని.. ఎంపీ లాడ్స్ నిధులను నియోజక వర్గాల్లో యువజనులు, క్రీడా కార్యకలాపాలకు ఉపయోగించాలన్నారు.

# డ్రోన్లతో 'ఎమర్జెన్సీ' అంచనా!

**పోలీసులు వెళ్లేలోపే ఘటనా స్థలానికి డ్రోన్లు**
**అక్కడ ఎలాంటి సేవలు అవసరమనే దృశ్యాలను స్థానిక పోలీసులు, కంట్రోల్ రూమ్‌కు చేరవేస్తాయ్**
**నాలుగు కమిషనరేట్లలో డ్రోన్ సేవల పైలట్ ప్రాజెక్టు**
**ఘటనకు దగ్గర్లోని పెట్రోలింగ్ వాహనానికి ఆటోమేటిక్ అలర్ట్**
**అత్యవసర సేవలన్నింటికీ ఒకే నంబరు 'డయల్ 112'ను ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్**




**హైదరాబాద్, ఆగస్టు 5 మీడియా టుడే**
రాష్ట్రంలో పోలీసు శాఖ అత్యవసర సేవలు ఇకపై మరింత వేగంగా అందనున్నాయి. భవిష్యత్తులో అత్యవసర పరిస్థితులను తెలుసుకునేందుకు డ్రోన్లను 'ఏరియల్ ఫస్ట్ రెస్పాండర్లు'గా వినియోగించే వ్యవస్థను తీసుకొస్తున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. కృత్రిమ మేధ ఆధారంగా తదుపరి తరం డయల్-112 అత్యవసర సేవల వేదికను బుధవారం ఆయన ప్రారంభించారు. పోలీసు, అగ్నిమాపక, అంబులెన్స్, మహిళా భద్రత, విపత్తు నిర్వహణ, విద్యుత్ వంటి అన్ని అత్యవసర సేవలను ఒకే జాతీయ నంబరు 112తో అనుసంధానించారు. ఇప్పటి వరకు అత్యవసర సేవలకు వేర్వేరుగా నంబర్లు ఉన్నాయని, వాటన్నింటినీ డయల్ 112 కిందకు తీసుకొచ్చామని డీజీపీ ప్రకటించారు. డయల్ 112 పనితీరును ఆయన స్వయంగా పరిశీలించారు. అదే సమయంలో బంజారాహిల్స్‌లో రోడ్ ప్రమాదం జరిగిందని ఒక మహిళ ఫోన్ చేయడంతో వెంటనే స్పందించిన డయల్ 112 సిబ్బంది స్థానిక పోలీసులను అప్రమత్తం చేస్తూ ఆ ప్రాంతానికి డ్రోన్‌ను పంపడాన్ని డీజీపీ గమనించారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లేలోపే డ్రోన్ ద్వారా ఘటనా స్థలంలోని పరిస్థితులు, ఎలాంటి సేవలు అవసరమనే దృశ్యాలను స్థానిక పోలీసులు, ఇటు కంట్రోల్‌రూంలోని సిబ్బంది గమనించి తగు సూచనలు ఇవ్వడాన్ని సీవీ ఆనంద్‌తో పాటు పోలీసు ఉన్నతాధికారులు ఆసక్తిగా తిలకించారు.

# హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ సహకారంతో 28 వేల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహారం, అందించేందుకు కృషి

## వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి.



**సూర్యాపేట జిల్లా మీడియా టుడే, స్టాఫ్ రిపోర్టర్: ఆగస్టు 05.**
సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులతో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు ద్వారా నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 28 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన ఉదయం అల్పాహారం అందించే కార్యక్రమంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఈ ఫౌండేషన్ సహకారంతో అత్యున్నత ప్రమాణాలతో సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేసి, ప్రతి విద్యార్థికి పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని అతి త్వరలోనే ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుని, సంబంధిత అంశాలపై ఫౌండేషన్ ప్రతినిధులతో సానుకూలంగా చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సంక్షేమంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు కుట్టు మిషన్ల పంపిణీ

## ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**బాలాపూర్ (మీడియాటుడే రిపోర్టర్ ), ఆగస్టు 5 (న్యూస్):**
మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ సర్కిల్ ప్రజాభవన్‌లో డాక్టర్ స్వర్ణలత సహోదరి ఫౌండేషన్ మరియు మెప్మ (వీజూహీూ) ఆధ్వర్యంలో నిర్వహించిన యూనిఫామ్ టైలరింగ్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న మహిళా అభ్యర్థులకు మాజీ మంత్రివర్యులు, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి పి. సబితా ఇంద్రారెడ్డి సర్టిఫికెట్లు, కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ స్వర్ణలత సహోదరి ఫౌండేషన్ చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం మహిళలను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహిస్తూ ఆర్థిక స్వావలంబన సాధించేందుకు దోహదపడుతుందని అభినందించారు. శిక్షణ పొందిన మహిళలు తమ నైపుణ్యాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడంతో పాటు కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. మహేశ్వరం నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, డివిజన్లలో ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను విస్తరించి మరింత మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, డాక్టర్ స్వర్ణలత సహోదరి ఫౌండేషన్ మరియు మెప్మ ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళా అభ్యర్థులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ చైతన్య స్టార్ కిడ్స్ పాఠశాలలో ఇన్వెస్టిచర్ కార్యక్రమం



**కోదాడ, ఆగస్టు 05 (మీడియా టుడే)–:**
కోదాడ పట్టణంలో స్థానిక గణేష్ నగర్ శ్రీ చైతన్య స్టార్ కిడ్స్ పాఠశాలలో బ్రాంచ్‌లో నిర్వహించిన ఇన్వెస్టిచర్ కార్యక్రమం ఎంతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏజీయమ్ మురళీకృష్ణ, ఆర్ఐ దండా వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని వారు మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. పాఠశాలలో నిర్వహించిన ఇన్వెస్టిచర్ కార్యక్రమం ఎంతో ప్రత్యేకమైనది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థి నాయకులు, హౌస్ కెప్టెన్లు మరియు ఇతర బాధ్యతలను స్వీకరించిన విద్యార్థులు తమ నాయకత్వ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నారు. పదవి అనేది కేవలం ఒక బ్యాడ్జ్ లేదా హోదా మాత్రమే కాదు. అది ఒక గొప్ప బాధ్యత. ఒక మంచి నాయకుడు ముందు తాను క్రమశిక్షణ పాటించి, తన ప్రవర్తన ద్వారా ఇతరులకు ఆదర్శంగా నిలవాలి. ప్రియమైన విద్యార్థి నాయకులారా, మీపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం మీ బాధ్యత. ప్రతి విద్యార్థిని గౌరవించండి, వారి సమస్యలను అర్థం చేసుకోండి, ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుంటూ పాఠశాల అభివృద్ధికి కృషి చేయండి. నాయకత్వం అంటే ఆదేశాలు ఇవ్వడం కాదు. సేవ చేయడం, సహకరించడం, బాధ్యతగా వ్యవహరించడం మరియు సరైన నిర్ణయాలు తీసుకోవడం. పాఠశాల విలువలను కాపాడుతూ, క్రమశిక్షణ, నిజాయితీ, సమయపాలన మరియు సేవాభావంతో ముందుకు సాగితే, మీరు మంచి నాయకులుగానే కాకుండా, మంచి పౌరులుగా కూడా ఎదుగుతారు. ఈ బాధ్యతలను స్వీకరించిన ప్రతి విద్యార్థికి నా హృదయపూర్వక అభినందనలు. మీ నాయకత్వం ద్వారా పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీరారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఝాన్సీ, డీన్ గౌతమ్, ప్రైమరీ ఇన్‌చార్జ్ సుధారాణి, జోనల్ పిఈటి సైదేశ్వరరావు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జీవితాన్ని మార్చే శక్తి చదువుకే ఉంది

## KLR'కేశంపేట కస్తూర్బా గాంధీ పాఠశాలలో నైపుణ్య శిక్షణ ముగింపు కార్యక్రమంవిద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

**బాలాపూర్ (మీడియా టుడే రిపోర్టర్ ) ఆగస్టు 05 న్యూస్**
రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం పాటిగడ్డ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (ఖ+దీఎ) మరియు జూనియర్ కళాశాలలో ఖూ= ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన నైపుణ్య శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి లీడ్ ఇండియా అధినేత, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (ఖూ=) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన ఖూ=, నేటి తరానికి నైపుణ్య శిక్షణతో పాటు విలువలతో కూడిన విద్య అత్యంత అవసరమని అన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ బోధించిన పాఠాలను అదే రోజు పునశ్చరణ చేసుకోవాలని, ఉపాధ్యాయుల సూచనలను క్రమశిక్షణతో పాటించాలని సూచించారు. యువత బంగారు భవిష్యత్తు చదువుపైనే ఆధారపడి ఉంటుందని పేర్కొన్న ఆయన, జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లే శక్తి ఒక్క విద్యకే ఉందన్నారు.



సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యసాధన దిశగా కృషి చేస్తే ప్రతి విద్యార్థి విజయాన్ని అందుకోవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ఆత్మీయంగా మమేకమై, వారి చదువు, భవిష్యత్తు లక్ష్యాల గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, ఖూ= ట్రస్ట్ ప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# బెంగాల్ పనివారిలో రాజకీయ చైతన్యం

## గీతం ఆతిథ్య ఉపన్యాసంలో పేర్కొన్న కేంబ్రిడ్జ్ చరిత్రకారిణి ప్రొఫెసర్ సమీతా సేన్



**పటాన్ చెరు ప్రతినిధి, మీడియా టుడే, ఆగస్ట్ 5 :**
పశ్చిమ బెంగాల్ లోని గృహ కార్మికులలో రాజకీయ చైతన్యం అభివృద్ధి చెందుతోందని, గుర్తింపు, గౌరవం, న్యాయపరమైన వేతనాలు, చట్టపరమైన రక్షణ వంటి డిమాండ్లతో సమీకృతమవుతున్నట్టు కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం లోని చరిత్ర ఉపన్యాసకురాలు సమీతా సేన్ పేర్కొన్నారు. హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, సెంటర్ ఫర్ ఏషియన్ స్టడీస్ ఆధ్వర్యంలో పట్టణీకరణ, లింగం, శ్రమ (యూజీఎల్) విభాగం క్లస్టర్ ప్రారంభోపన్యాసాన్ని బుధవారం నిర్వహించింది. 'ఉద్యమిస్తున్న పనిమనుషులు: పశ్చిమ బెంగాల్ లో గృహ కార్మికుల రాజకీయాలు' అనే అంశంపై ఆమె ఆన్ లైన్ లో ఆతిథ్య ఉపన్యాసం చేశారు. పట్టణీకరణ, శ్రమ, లింగం వంటి అంశాలపై పనిచేస్తున్న స్కాలర్లను ఒకచోట చేర్చి, వివిధ రంగాల మధ్య అర్థవంతమైన సంభాషణలను ప్రోత్సహించే ఒక వేదికగా యూజీఎల్ డైలాగ్ ను రూపొందించారు. గృహాలలో పనిచేయడం అనేది లింగం, వర్గం, వలసలు, పట్టణీకరణ సమస్యలతో ముడిపడి ఉందని, ఇది అంతర్ విభాగ పరిశోధనకు ఒక ముఖ్యమైన రంగంగా నిలుస్తుందని డాక్టర్ సమీతా సేన్ అభిప్రాయపడ్డారు. అస్థిరమైన ఉపాధి, సామాజిక భద్రత లేకపోవడం, పరిమిత చట్టపరమైన రక్షణలతో సహా గృహ కార్మికులు ఎదుర్కొంటున్న సవాళ్లపై ప్రొఫెసర్ సేన్ చర్చించారు. గృహ కార్మికుల సంఘాలు, సమూహాలు పెరగడం వారి సమస్యలను ప్రజా చర్చలు, విధానపరమైన సంప్రదింపులలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిందని ఆమె పేర్కొన్నారు. కార్మికుల జీవన అనుభవాలను నమోదు చేయవలసిన ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, సమకాలీన భారతదేశంలో కార్మిక, లింగ, పట్టణ పరివర్తనలను మరింత బాగా అర్థం చేసుకోవడానికి స్కాలర్లు అంతర్ విషయ విధానాలను అవలంబించాలని ఆమె ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. కార్మిక హక్కులు, మహిళా ఉద్యమాలు, పట్టణ భారతదేశంలో గృహ కార్మికుల మారుతున్న స్వభావంపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని ఆంగ్ల, ఇతర భాషల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, యూజీఎల్ క్లస్టర్ సమన్వయకర్త డాక్టర్ దేబద్రిత చక్రవర్తి సమన్వయం చేశారు.

**వక్త గురించి:**
ప్రొఫెసర్ సమీతా సేన్ కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఇంపీరియల్, నావల్ హిస్టరీకి సంబంధించిన వేర్ హార్న్స్‌వర్త్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు. ఆమె గతంలో డైమండ్ హార్బర్ మహిళా విశ్వవిద్యాలయానికి తొలి ఉపకులపతిగా పనిచేశారు. కలకత్తా, జాదవ్ పూర్ విశ్వవిద్యాలయాలలో బోధించారు. జాదవ్ పూర్ వర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఉమెన్స్ స్టడీస్ డైరెక్టర్ గా, అంతర్ విభాగం అధ్యయనం డీన్ గా కూడా సేవలందించారు. కామన్వెల్త్ చరిత్రలో ట్రెవర్ రీస్ బహుమతి గ్రహీత అయిన ఆమె, కార్మిక చరిత్ర, లింగ అధ్యయనాలు, వలస భారతదేశంలో విస్తృతంగా ప్రచురించారు. 1982 నుంచి 'సచేతన' అనే సంస్థ ద్వారా మహిళా ఉద్యమంలో కూడా చురుకైన సభ్యురాలిగా ఆమె ఉన్నారు.

# వెంకటాద్రి నివాస్ కాలనీలో పోచమ్మ--మైసమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవంలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాత నర్సింహారెడ్డి

**బాలాపూర్ (మీడియాటుడే రిపోర్టర్ ), ఆగస్టు 5 (న్యూస్):**



మహేశ్వరం నియోజకవర్గంలోని జీహెచ్ఎంసీ పరిధి బడంగ్‌పేట్ డివిజన్‌లోని వెంకటాద్రి నివాస్ కాలనీలో నిర్వహించిన శ్రీ పోచమ్మ, మైసమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవ మహోత్సవంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ కమిటీ సభ్యులు మరియు కాలనీ ప్రజలకు వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు బంగారి అశోక్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భగత్ సింగ్ నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని తరలించవద్దని కాంగ్రెస్ నాయకుల వినతి

**బాలాపూర్, ఆగస్టు 5 (మీడియా టుడే రిపోర్టర్ ) న్యూస్**



మహేశ్వరం నియోజకవర్గంలోని డాక్టర్స్ కాలనీ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఇతర ప్రాంతానికి మార్చవద్దని కోరుతూ డాక్టర్స్ కాలనీ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు జణూూ రేణుక గారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత 20 సంవత్సరాలుగా భగత్ సింగ్ నగర్‌లో అంగన్‌వాడీ కేంద్రం విజయవంతంగా నిర్వహించబడుతోందని, ప్రస్తుతం 28 మంది చిన్నారులు ఇక్కడ సేవలు పొందుతున్నారని తెలిపారు. కేంద్రాన్ని ఇదే ప్రాంతంలో కొనసాగించాలని వారు కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జణూూ రేణుక గారు సమస్యపై వెంటనే స్పందించి, పై అధికారులతో చర్చించి తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ కాలనీ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్, సీనియర్ నాయకులు జిల్లెల కృష్ణ, షఫీ భాయ్, నహీం భాయ్, ఇమ్రాన్ అలీ, కొయడ జనార్ధన్ గౌడ్, కండటి జంగారెడ్డి, మొగిళ్ల మల్లేష్, కడియల గోపాల్, కుర్మతి లక్ష్మయ్య, మాదాసు వెంకటేష్, మహబూబ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# దాసిరెడ్డి మాధవ రెడ్డి గారి జయంతిని పురస్కరించుకొని పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే జయవీర్ రెడ్డిగారు



**పెద్దవూర మండలం నల్లగొండ జిల్లా మీడియా టుడే రిపోర్టర్**
బుధవారం రోజున నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని,పెద్దవూర మండలంలో, వెల్మగూడెం గ్రామం నందు క్రీ శే శ్రీ దాచిరెడ్డి మాధవ రెడ్డి గారి 84 వ జయంతిని పురస్కరించుకొని,వారి సమాధికి పూలమాలలు వేసి,ఘన నివాళులర్పించి,వారి జ్ఞాపకార్థం గ్రామ అభివృద్ధి కొరకు,వారి ముగ్గురు కుమారులు భూదానం చేసిన భూమి నందు "నూతన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం,నూతన మహిళా సంఘ భవనం (వెలుగు కార్యాలయం) మరియు కమ్యూనిటీ హాల్"శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జయ వీర్ రెడ్డి గారు గ్రామ ప్రజలు,అధిక సంఖ్యలో మహిళలు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,అభిమానులు,గ్రామ వార్డ్ మెంబర్లు,గ్రామ ఉపసర్పంచ్,గ్రామసర్పంచ్,మాజీ ప్రజాప్రతినిధులు,ప్రజాప్రతినిధులు,సోషల్ మీడియా సభ్యులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మరియు మండల నాయకులతో పాటు కలిసి హాజరై పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన స్థానిక శాసనసభ్యులు గౌరవ శ్రీ కుందూరు జయవీర్ రెడ్డి గారు.

# ఇందిరమ్మ ఇళ్ల పథకం లో భాగంగా గుడిసెలలో నివసించే కుటుంబాలను పరిశీలించిన ఎంపీడీవో : జలంధర్ రెడ్డి

**మీడియా టుడే వలిగొండ ఆగష్టు : 05**



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి వలిగొండ పట్టణ కేంద్రంలో బుధవారం రోజు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాల అర్హతలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజు, హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ కిరణ్‌లతో కలిసి గుడిసెవాసుల ఇళ్లను సందర్శించి వారి నివాస పరిస్థితులు, కుటుంబ వివరాలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన అర్హత ప్రమాణాల మేరకు లబ్ధిదారులను గుర్తించి, వారి వివరాలను నమోదుచేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిజమైన అర్హులైన నిరుపేద కుటుంబాలకు గృహ నిర్మాణ ప్రయోజనాలు అందేలా క్షేత్రస్థాయిలో పారదర్శకంగా అర్హత పరిశీలన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి. జలంధర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వలిగొండ పట్టణ కేంద్రంలో లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ : వెంకటేష్ గౌడ్

**మీడియా టుడే వలిగొండ ఆగష్టు : 05**




యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో బుధవారం రోజు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించిన చౌటుప్పల్ డివిజన్ ట్రాఫిక్ సిఐ వెంకటేష్ గౌడ్. వలిగొండ పట్టణ కేంద్రంలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు శోభన్ రావు, మురళి, జగన్, వాహనదారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు బోధన్ విద్యార్థులు



**మీడియా టుడే (ఆగస్టు. 5): నిజామాబాద్ జిల్లా: బోధన్ మండలం:**
బోధన్ కు చెందిన సాయి సామల చెస్ అకాడమీ విద్యార్థులు జిల్లా స్థాయి అండర్-13 చెస్ ఛాంపియన్‌షిప్--2026లో ప్రతిభ కనబర్చి తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. జిల్లా బాలుర విభాగంలో ఆచార్య స్కూల్ విద్యార్థి గౌరంగ అశోక్ జిల్లా ఛాంపియన్‌గా నిలవగా, జెడ్పీహెచ్ఎస్ గోవూర్ విద్యార్థి ఎం. హితేంద్ర, ప్రభుత్వ జూనియర్ కళాశాల పాఠశాల విద్యార్థి సుహాస్ కూడా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆగస్టు 6 నుంచి 8 వరకు హైదరాబాద్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో జరిగే తెలంగాణ రాష్ట్ర అండర్-13 చెస్ ఛాంపియన్‌షిప్‌లో వీరు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా అకాడమీ కోచ్ సాయిబాబా సామల మాట్లాడుతూ, బోధన్ నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులను తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ఆధునిక శిక్షణా విధానాలతో విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి బోధన్, నిజామాబాద్ జిల్లాలకు మంచి పేరు తీసుకురావాలని పలువురు క్రీడాభిమానులు, తల్లిదండ్రులు ఆకాంక్షించారు.

## ఎదిగే పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం: డాక్టర్ చింతపల్లి వనిత

**ఆగస్టు 5 ( న్యూస్ త్రిపురారం) మీడియా టుడే (నల్లగొండ జిల్లా బ్యూరో )**



త్రిపురారం మండలంలోని కంపసాగర్ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 14 సంవత్సరాలు నిండిన విద్యార్థినులకు బుధవారం టీకాలు వేశారు. అనంతరం త్రిపురారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ చింతపల్లి వనిత పాఠశాలలోని బాత్రూములు, వంటశాల, వంట సామగ్రి, భోజన నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎదిగే వయస్సులో ఉన్న పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాలలు, హాస్టళ్లలోనే కాకుండా ఇంటి వద్ద కూడా పిల్లల ఆరోగ్యంతో పాటు వారి మానసిక పరిస్థితిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు గమనించాలని అన్నారు. పిల్లలకు సమతుల్యమైన పౌష్టికాహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక వికాసం మెరుగుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఎస్ఓ విజయలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్ కమలమ్మ, ఏఎన్ఎం నూర్జహాన్, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## సోన్ మండలంలో రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్




**నిర్మల్ జిల్లా సోన్ మండలం:ఆగస్టు 05, 2026**
రీ సర్వే నిర్వహణ ద్వారా భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. బుధవారం సోన్ మండలం న్యూ వెల్మల్ గ్రామానికి చెందిన వ్యవసాయ భూముల్లో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను పరిశీలించారు. ముందుగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూముల రీ సర్వే ప్రక్రియ చేపట్టింది అన్నారు. సర్వే అధికారులకు రైతులు సహకరించాలని తెలిపారు. రీ సర్వే నిర్వహించే సమయంలో తప్పనిసరిగా రైతులు అందుబాటులో ఉండాలని చెప్పారు. రీ సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. సంబంధిత అధికారుల బృందం తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియకు సహకరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామానికి సంబంధించి భూముల వివరాలు, చేపట్టిన సర్వే వివరాలు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన రైతు భూమి రీ సర్వే ప్రక్రియను ఈ సందర్భంగా కలెక్టర్ పరిశీలించారు. ఎకరం భూమి సర్వే చేయడానికి సుమారు ఎంత సమయం అవసరం అవుతుంది అనే వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే ప్రక్రియను మొత్తం పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఏడి ల్యాండ్ సర్వే రికార్డ్ నరసింహమూర్తి, తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో రామకృష్ణ, సర్పంచ్ సాగర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానం- సర్పంచ్ సిరం సుష్మరెడ్డి




**భైంసా ఆగస్టు 05 మీడియా టుడే జిల్లా ప్రతినిధి**
బిడ్డ ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లి పాలు ఎంతో శ్రేయస్కరమని, పుట్టిన వెంటనే ముర్రు పాలు తప్పనిసరిగా పట్టించాలని భైంసా మండలం దేగాం గ్రామ సర్పంచ్ సిరం సుష్మరెడ్డి సూచించారు. బుధవారం దేగాం గ్రామంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గర్భిణీలు, బాలింతలు సరైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన శిశువులు జన్మిస్తారని తెలిపారు. తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నాయని పేర్కొన్నారు. పుట్టిన వెంటనే ముర్రు పాలు పట్టించడం, బిడ్డకు కనీసం ఆరు నెలల పాటు పూర్తిగా తల్లి పాలు మాత్రమే ఇవ్వడం వల్ల రోగనిరోధక శక్తి పెరిగి, శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడని వివరించారు. గర్భిణీలు, బాలింతలకు అవసరమైన పోషకాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సక్రమంగా అందించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ, సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చిట్కుల్‌లో ఆధ్యాత్మిక శోభ

### కన్నులపండుగగా ప్రారంభమైన దుర్గమ్మ జాతర, ఆషాఢ బోనాల మహోత్సవాలు..

### అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలి : నీలం మధు ముదిరాజ్



**పటాన్ చెరు ప్రతినిధి, మీడియా టుడే, ఆగస్ట్ 5 :**
మన సంస్కృతికి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల పండుగ ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ గ్రామంలో అత్యంత ఆధ్యాత్మిక వాతావరణంలో, వైభవంగా ప్రారంభమైంది. గ్రామ దేవతల అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని, ఊరంతా ఆయురారోగ్యాలతో,పాడిపంటలతోవర్ధిల్లాలని కోరుకుంటూ ప్రతి ఇల్లూ పసుపు, కుంకుమలు, తోరణాలతో శోభాయమానంగా మారింది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒక సారి నిర్వహించే దుర్గమ్మ జాతర మహోత్సవాలను పురస్కరించుకుని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి నీలం మధు ముదిరాజ్ భారీ ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ నాలుగు రోజుల ఆధ్యాత్మిక వేడుకల్లో భాగంగా మొదటిరోజు మంగళవారం గ్రామం భక్తి పారవశ్యంలో మునిగితేలింది. కట్టమైసమ్మ జాతరతో ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని, గ్రామ దేవత కట్టమైసమ్మ తల్లికి పవిత్ర జలాలతో అభిషేకాలు నిర్వహించి, మంగళహారతులు పట్టి తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు.రెండవ రోజైన బుధవారం దుర్గమ్మ జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, అలంకారాలు నిర్వహించి భక్తులకు అమ్మవారి దివ్య దర్శనం కల్పిస్తున్నారు. మూడవ రోజు గురువారం పోచమ్మ జాతర జరగనుంది. ఈ రోజున గ్రామప్రజలు, భక్తులు భక్తిశ్రద్ధలతో పోచమ్మ తల్లికి నైవేద్యాలు సమర్పించి, తమ కష్టాలను తీర్చి కుటుంబాలను చల్లగా చూడాలని ఆ వేడుకల ద్వారా అమ్మవారిని ప్రార్థించనున్నారు. ఉత్సవాల్లో నాల్గవ రోజు శుక్రవారం దుర్గమ్మ బోనాల పండుగ అత్యంత వైభవంగా జరగనుంది. గ్రామ ఆడపడుచులు ఆధ్యాత్మిక నిష్ఠతో, భక్తిప్రపత్తులతో బోనాలను శిరస్సున ధరించి, తొట్టెల ఊరేగింపులు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల నడుమ ఆలయానికి చేరుకోనున్నారు. బోనం సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందనున్నారు. ఈ ఆధ్యాత్మిక మహోత్సవానికి పటాన్‌చెరు నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల అనేక గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్వహించే ఈ ఉత్సవాలలో భక్తులందరూ విశేషంగా పాల్గొని, అమ్మవార్ల దివ్య ఆశీస్సులు పొంది, సుఖసంతోషాలతో విలసిల్లాలని ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్లు, ప్రమాదకర కూడళ్లను

## క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



**మిర్యాలగూడ, ఆగస్టు 5 (మీడియా టుడే):**
జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ బుధవారం జిల్లాలోని ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్స్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్.హెచ్ 02, ఎన్.హెచ్ 167లో గల తరచూ ప్రమాదాలు జరుగు బ్లాక్ స్పాట్స్ అయినా వెల్కమ్ టూ మిర్యాలగూడ జంక్షన్, నందిపాడు ఎక్స్ రోడ్డు, చిల్లాపురం క్రాస్ రోడ్డు, చింతపల్లి క్రాస్ రోడ్డు, జంకు తండా రోడ్డు, మిర్యాలగూడ అప్రోచ్ రోడ్డు ప్రాంతాలను సందర్శించి అక్కడ తరచూ ప్రమాదాలు జరగడానికి గల కారణాలను సంబంధిత అధికారులతో సమీక్షించారు. ప్రమాదాలు ఎక్కువగా జరగడానికి ప్రధాన కారణాలు అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, ప్రమాదకర ఓవర్ టేకింగ్, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, రహదారి కూడళ్ల వద్ద స్పష్టమైన హెచ్చరిక బోర్డులు లేకపోవడం, రోడ్ మార్కింగ్‌లు చెరిగిపోవడం, అక్రమ పార్కింగ్, రాత్రి వేళల్లో తగిన వెలుతురు లేకపోవడం, రహదారులపై అనధికారిక ప్రవేశాలు వంటి అంశాలని ఎస్పీ గుర్తించారు. పరిశీలన సందర్భంగా ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు ఎస్పీ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, జీబ్రా క్రాసింగ్‌లు, సెంటర్ లైన్లు, రోడ్ మార్కింగ్‌లకు రీ-పెయింటింగ్, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు, సీసీ కెమెరాల ఏర్పాటు, బారికేడింగ్, రిఫ్లెక్టివ్ హెచ్చరిక బోర్డులు, దిశా సూచికలు, క్యాట్ ఐస్ ఏర్పాటు వంటి పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే అన్ని జంక్షన్ల వద్ద అక్రమ పార్కింగ్ పూర్తిగా తొలగించి వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్, ట్రాఫిక్, పోలీసు, ఇతర సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రమాదకర ప్రాంతాల్లో ఉన్న లోపాలను వెంటనే గుర్తించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో అనవసర జంక్షన్లు, అనధికారిక కట్స్ సాధ్యమైనంత వరకు మూసివేయడం, అవసరమైన చోట మాత్రమే నియంత్రిత యూ-టర్న్‌లు కల్పించడం, ప్రమాదకర కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసు సిబ్బందిని అధిక సంఖ్యలో నియమించి వాహనాల రాకపోకలను నియంత్రించడం, ట్రాఫిక్ ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించడం, రద్దీ సమయాల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని, వాహనదారులు అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం, నిర్లక్ష్యంగా ఓవర్‌టేకింగ్ చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా అనేక ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీసు శాఖతో పాటు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి, ప్రమాదకర ప్రాంతాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను త్వరి తగతిన ఏర్పాటు చేసి ప్రజల ప్రాణ రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో మిర్యాలగూడ ఇంచార్జ్ డిఎస్పీ రవి, సీఐ లు పి.ఎన్.డి ప్రసాద్, సోమనర్సయ్య, నాగభూషణ్, నాగరాజు, ఎస్ఐ లక్ష్మయ్య, డిటిఆర్బి ఇంచార్జ్ రిటైర్డ్ సీఐ అంజయ్య, సంబంధిత రోడ్డు భద్రత అధికారులు ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ , ఎక్సైజ్, ట్రాన్స్ ఫోర్ట్ అధికారులు, స్థానిక ప్రజలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి




**పటాన్‌చెరు ప్రతినిధి, మీడియా టుడే, ఆగస్ట్ 5 :**
మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి యువతకు, విద్యార్థులకు పిలుపునిచ్చారు. బుధవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో నషా ముక్తి భారత్ అభియాన్, బ్రాహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఏర్పాటు చేసిన మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై.. పాఠశాల, కళాశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ..యువత దేశ భవిష్యత్తు అని, వారిని మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు, సామాజిక సంస్థలు, ప్రజలందరిపై ఉందని అన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజం, దేశ భవిష్యత్తు కూడా తీవ్రంగా దెబ్బతింటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వ్యసనం నేరాలు, హింస, ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు చేపడుతున్న నేపథ్యంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యువత చదువు, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల వైపు దృష్టి సారించి తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం, ప్రతి కాలనీ, ప్రతి విద్యాసంస్థ డ్రగ్స్ రహిత ప్రాంతంగా మారాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని ఎమ్మెల్యే తెలిపారు. సమాజంలో అవగాహన పెంపొందించడం ద్వారా మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యమవుతుందని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు విజయ్ కుమార్, బాల్ రెడ్డి, నర్రా బిక్షపతి, అశోక్, హనుమంత్ రెడ్డి, మైత్రి క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, పృథ్వీరాజ్, బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల్లో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

**భైంసా ఆగస్టు 05 మీడియా టుడే జిల్లా ప్రతినిధి**
ప్రజల్లో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన పెంపొందించేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే "సైబర్ జాగృతి దివస్" కార్యక్రమంలో భాగంగా భైంసా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ సైబర్ జాగృతి దివస్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు అత్యాధునిక పద్ధతులను ఉపయోగించి ప్రజలను మోసం చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని, తెలియని లింకులు, అనుమానాస్పద యాప్‌లు, నకిలీ వెబ్‌సైట్లకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. పోలీసు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత ఉద్యోగాల సాధనకు కృషి చేయాలని, వ్యక్తిగత అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, జూదం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండి జీవితాన్ని ఉన్నత లక్ష్యాల వైపు మలుచుకోవాలని పిలుపునిచ్చారు. ఇటీవల విడుదలైన ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ నియామక నోటిఫికేషన్ల నేపథ్యంలో ఆసక్తి కలిగిన యువతకు రన్నింగ్, శారీరక దారుఢ్య పరీక్షలు, పోటీ పరీక్షల కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. సైబర్ మోసానికి గురైనట్లు అనుమానం వచ్చిన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఐపీఎస్, ఇన్‌స్పెక్టర్లు రవీందర్ నాయక్, దీపక్, సాయి కుమార్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



## జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మున్సిపల్ అధికారులతో

# సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి




**మిర్యాలగూడ, ఆగస్టు 5 (మీడియా టుడే):** మిర్యాలగూడ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ అధ్యక్షతన మున్సిపాలిటీకి చెందిన అన్ని విభాగాల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాల నిర్వహణ, వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, ప్రజలకు అందుతున్న మున్సిపల్ సేవలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా, ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన పనుల పురోగతిని సమీక్షించి, అభివృద్ధి కార్యక్రమాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీజా రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, వివిధ శాఖల అధికారులు, ఇంజినీరింగ్, ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, టౌన్ ప్లానింగ్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

### అమ్మ పాలు అమృతంతో సమానం.-ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి అధికం

### సర్పంచి పాలకి సురేష్

**కోదాడ, ఆగస్టు 05 (మీడియా టుడే)–:** అమ్మ పాలు అమృతంతో సమానమని తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని ముర్రుపాల లోనే వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని అది బిడ్డకు శ్రీరామరక్ష అని సర్పంచి పాలకి సురేష్ అన్నారు. మండల పరిధిలోని దోరకుంట గ్రామంలో అంగనవాడి 1, 2,3,4 కేంద్రాలలో బుధవారంప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా అన్నప్రాసన, అక్షరాభ్యాసం, పుట్టిన రోజు వేడుక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచి పాలకి సురేష్, ఐసిడిపిఓ కిరణ్మయి, అంగన్వాడి సూపర్వైజర్ రమణ లు పాల్గొని మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు ఒకటో తేదీ నుండి ఏడో తేదీ వరకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు. బిడ్డ పుట్టిన గంట లోపు వచ్చే మురుపాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉండటం వల్ల బిడ్డ ను అనేక వ్యాధుల నుండి. రక్షిస్తాయని అన్నారు. కాన్పు జరిగిన గంటలోపే తప్పనిసరిగా తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఇతర పానీయాలు ఏవి పట్టవద్దు అని తెలిపారు. ఆరు నెలలు నిండినటువంటి పిల్లలకి సిబిఈ ఈవెంట్లో భాగంగా అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం అందించే అవకాశాలను తల్లులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు 1-3 సంవత్సరాల పిల్లలకు బాలామృతము ఎనిమిది గుడ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచి రమాదేవి, వార్డు నెంబర్లు జాను, గ్రామ కార్యదర్శి జి వెంకటేశ్వర్లు, అంగన్వాడి టీచర్లు ఆదిలక్ష్మి, కృష్ణవేణి, అరుణ,నాగమణి, ఆయాలు, ఆశాలు, గర్భవతులు, తల్లులు, గ్రామ పెద్దలు ప్రతిపాక వెంకటేశ్వర్లు, పత్తిపాక రామ్మూర్తి, నాగేంద్ర బాబు, లింగం సైదులు తదితరులు పాల్గొన్నారు.




## పాశమైలారం పారిశ్రామిక వాడ లోని కోహెన్స్ లైఫ్ సెన్స్ లిమిటెడ్

## యాజమాన్యం మొండి వైఖరికి నిరసనగా కోహెన్స్ యూనియన్, కార్మికులు నిరసన




**పటాన్ చెరు ప్రతినిధి, మీడియా టుడే, ఆగస్ట్ 5 :** పాశమైలారం పారిశ్రామిక వాడ లోని కోహెన్స్ లైఫ్ సెన్స్ లిమిటెడ్ యాజమాన్యం మొండి వైఖరికి నిరసనగా కోహెన్స్ యూనియన్ కార్మికులు బుధవారం తో 200 రోజులు పూర్తయిన సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎన్ రాజు ముదిరాజ్, ట్రెజరర్ పి సత్యనారాయణ రెడ్డి,ఏ మహిపాల్ రెడ్డి, ఏ దర్శన్, వెంకటేశం యాదవ్,ఆనందరావు లు ఒక్కరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎన్ రాజు ముదిరాజ్ మాట్లాడుతూ యూనియన్ అధ్యక్షులు డాక్టర్ జనక్ ప్రసాద్ ఆదేశాలతో ఉప కార్మిక కమిషనర్ సంగారెడ్డి కంపెనీలో సోదాలు చేసి, 144 మంది కార్మికుల్ని ఇన్స్పెక్షన్ చేసి పర్మిట్ చేయాలని అడ్వైజ్ ఇచ్చిన కానీ యాజమాన్యం చట్ట విరుద్ధంగా, మొండివైఖరి అవలంబిస్తుందన్నారు. 15 రోజుల్లో కార్మికుల సమస్య తీర్చకుంటే వర్క్ టూల్ డౌన్ చేసి మొత్తం పని స్తంభింప చేసి కార్మికులందరూ సమ్మెలో పాల్గొంటారని యాజమాన్యాన్ని హెచ్చరించారు. అలాగే కార్మికులందరూ ఎవరు అధర్య పడద్దని చట్టం మన వైపు ఉందని లేబర్ కోర్టులో విజయం సాధించబోతున్నామన్నారు. సంగారెడ్డిలోని అసిస్టెంట్ కమిషనర్ వద్ద సమాన పనికి, సమాన వేతనం కేసులు 50 లక్షల రూపాయలు కూడా మనం గెలవబోతున్నామని దిమా వ్యక్తం చేశారు. గతంలో ఉన్న హెచ్ఆర్ డిపార్ట్మెంట్, గతంలో ఉన్న యూనియన్ నాయకులు కుమ్మక్కై ఆలస్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనియన్ జనరల్ సెక్రెటరీ ఎన్ రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో కచ్చితంగా విజయం సాధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోహెన్స్ యూనియన్ నాయకులు, కార్మికులు, టీ.ఆర్.పి.యూ.ఎస్ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# అరుదైన బ్లాక్ బెంగాల్ జాతి సూడి మేక ఎముకకి శస్త్రచికిత్స

**కోదాడ, ఆగస్టు 05 (మీడియా టుడే)–:** నేరేడుచర్ల పట్టణానికి చెందిన నరేష్ అనే జంతు ప్రేమికుడు పట్టణ ప్రాంతీయ పశువైద్యశాల ఎదురుగానే నివాసం ఉంటూ అరుదైన బ్లాక్ బెంగాల్ జాతి మేకను పెంచుకుంటున్నారు. అది ఆడుతూ పాడుతూ ఇంట్లో నుండి బైటకు రాగానే అటుగా వెళ్తున్న బైక్ తగిలి గూడ ఎముక విరిగింది. అసలే అరుదైన ఔషధ గుణాలున్న పాలిచ్చే జాతి మేక, అందులోనూ రెండు మాసాల గర్భంతో ఉండడం తో దానిని ఎలాగైనా బ్రతికించు కోవాలనే తపనతో తెలిసిన వారిద్వారా ఎముకల శస్త్ర చికిత్స నిమిత్తం ఈరోజు కోదాడ ప్రాంతీయ పశు వైద్యశాలకు మేకను తీసుకువచ్చారు. విరిగిన మేక కాలు ఎముకను పరీక్షించిన అసిస్టెంట్ డైరెక్టర్ డా పి పెంటయ్య కడుపులో పిల్ల కి ప్రమాదం నివారించడానికి జనరల్ మత్తు బదులు స్థానిక మత్తు మాత్రమే ఇచ్చి శస్త్ర చికిత్స నిర్వహించారు. బైక్ గట్టిగా తగలడంతో విరిగిన ఎముకలు ఒకదానిపై ఒకటి చేరి లోనికి పొడుచుకుని పోవడంతో రెండు చివరలను జతచేయడానికి అతికష్టంతో మూడు గంటల పాటు శ్రమించి ప్లేట్ మరియు రాడ్ అమర్చి విజయవంతంగా ఎముకలను అతికించి శస్త్ర చికిత్స ముగించారు. శస్త్ర చికిత్సలో వెటరినరీ అసిస్టెంట్ సర్జన్ డా సిరిపురపు సురేంద్ర, సిబ్బంది శివ, చంద్రకళ, సాగర్ పాల్గొన్నారు



# విద్యానగర్‌లో ఘనంగా బోనాల జాతర

### మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు పాల్గొని ప్రత్యేక పూజలు




**మందమర్రి, ఆగస్టు 05,మీడియాటుడే.** మందమర్రి పట్టణంలో బుధవారం ఆషాడ మాస బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. విద్యానగర్ మేకల మండి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు హాజరయ్యారు. ఆయన బోనం ఎత్తుకొని శివసత్తులతో కలిసి ఊరేగింపులో ముందుకు నడిచారు. అనంతరం మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఓదెలు మాట్లాడుతూ, తెలంగాణలో అమ్మవార్లకు బోనాలు సమర్పించడం మన ఆనవాయితీ అని పేర్కొన్నారు. మైసమ్మ తల్లి దయవల్ల రాష్ట్ర ప్రజలు, పట్టణ ప్రజలు, సింగరేణి కార్మికులు, రైతులు అమ్మవారి దీవెనలతో సుభిక్షంగా జీవిస్తారని భక్తులు విశ్వసిస్తారని అన్నారు. ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే ఓదెలును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, స్థానిక సీనియర్ కాంగ్రెస్ నాయకులు సోతుకు సుదర్శన్ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శివసత్తులు, మహిళా భక్తులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతలను నిర్మిద్దాం

## - వర్షపు నీటిని సంరక్షించుకుందాం

### కడియాల పద్మ అప్పయ్య గానుగబండ గ్రామ సర్పంచ్

### వనజ ఎంపిడిఓ



**మీడియా టుడే గరిడేపల్లి ఆగస్టు 5:** రాష్ట్ర ప్రభుత్వం వర్షపు నీటిని సంరక్షించి భవిష్యత్తులో ముందు తరాల వారు కూడా నీటి కోసం ఇబ్బంది పడకూడదనే మంచి ఉద్దేశంతో ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ప్రభుత్వం నిర్మిస్తున్నదని,వీటిని మనందరం సద్వినియోగ పరచుకోవాలని గ్రామ సర్పంచ్ కడియాల పద్మ అప్పయ్య గరిడేపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి వనజ గ్రామ ప్రజలను కోరారు. ఈ రోజు గరిడేపల్లి మండలంలోని గానుగబండ గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణానికి శంకుస్థాపన చేసినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంకుడు గుంతలను నిర్మించుకునే వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందని ప్రభుత్వ అధికారుల సూచనల ప్రకారం గుంతల వైశాల్యం నిర్ధారించుకొని నిర్మించుకోవాలని వారు గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు ఎంపీ ఓ ఇబ్రహీం ఏపీవో సురేష్ పంచాయతీ కార్యదర్శి బాల సైదులు ఫీల్డ్ అసిస్టెంట్ సరిత తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డు కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి




**మిర్యాలగూడ, ఆగస్టు 5 (మీడియా టుడే):** మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డు కేంద్రాన్ని నల్గొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ఆసుపత్రిలోని యూడీఐడీ కేంద్రాన్ని పరిశీలించి, వైద్యాధికారులతో కేంద్రం పనితీరు, దివ్యాంగులకు అందించనున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. దివ్యాంగులకు ప్రభుత్వ సేవలు సులభంగా అందుబాటులోకి తీసుకురావడంలో యూడీఐడీ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని, అర్హులైన ప్రతి దివ్యాంగుడికి వేగవంతంగా గుర్తింపు కార్డులు జారీ చేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రమణారెడ్డి, మిర్యాలగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీష నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీజా రెడ్డి, డిఎంహెచ్వో, ఆసుపత్రి వైద్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విరాసత్ రద్దు చేయాలి

### భూ పంపకాలపై ఆర్డీవోకు ఫిర్యాదు

**జగిత్యాల మీడియా టుడే- ఆగస్టు 5**

భూ పంపకాల వ్యవహారంలో తనకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ సారంగాపూర్ మండలం మాడారం తండా--రేచపల్లి గ్రామానికి చెందిన భూక్యా గంగాధర్ బుధవారం జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కుటుంబానికి చెందిన భూముల విభజన సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా విరాసత్ నమోదు జరిగిందని, సంబంధిత రికార్డులను రద్దు చేసి పూర్తి స్థాయిలో పునఃపరిశీలన చేయాలని గంగాధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు .ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, కుటుంబ ఆస్తుల పంపకాల సమయంలో తన హక్కులకు భంగం కలిగేలా రెవెన్యూ రికార్డుల్లో మార్పులు జరిగాయని, దీనివల్ల తనకు చెందాల్సిన భూమి అందలేదని గంగాధర్ ఆరోపించారు. ఈ అంశంపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన న్యాయం జరగలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత గ్రామంలోని భూమిని అధికారిక సర్వేయర్ ద్వారా మరోసారి సమగ్రంగా కొలతలు వేయించి, భూ హద్దులు, రికార్డులు, వారసత్వ హక్కులను పరిశీలించాలని ఆర్డీవోను కోరారు. వాస్తవ పరిస్థితులను నిర్ధారించి నిబంధనల ప్రకారం తనకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.00

## అనారోగ్యంతో ఉన్న నమస్తే తెలంగాణ మహేశ్వరం ఇన్‌చార్జ్ బిరుదు చందర్‌ను పరామర్శించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



**బాలాపూర్ ,(మీడియాటుడే రిపోర్టర్ )ఆగస్టు 5 న్యూస్**

అనారోగ్యంతో బాధపడుతున్న నమస్తే తెలంగాణ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీ బిరుదు చందర్‌ను మాజీ మంత్రివర్యులు, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి పి. సబితా ఇంద్రారెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా పరామర్శించారు. ఈ సందర్భంగా బిరుదు చందర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న సబితా ఇంద్రారెడ్డి, మెరుగైన వైద్య చికిత్స తీసుకుని త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు రామిడి రాం రెడ్డి, పెద్దబావి ఆనంద్ రెడ్డి, పెద్దబావి శ్రీనివాస్ రెడ్డి, సంరెడ్డి వెంకట్ రెడ్డి, కర్రె బలవంత్, గట్టు మైపాల్, దిండు భూపేష్, శ్రీను నాయక్, మహేందర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, జర్నలిస్ట్ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి మర్రి నిరంజన్ రెడ్డి విరాళం



**ఇబ్రహీంపట్నం,ఆగస్టు 5(మీడియా టుడే** )గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కొంగరకలాన్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీత్లా భవాని అమ్మవారి దేవాలయం నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపన, బోనాల పండుగ ఏర్పాట్లకు టీపీసీసీ సభ్యులు, ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి తనవంతు సహాయంగా రూ.25,000 విరాళాన్ని బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మర్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, ఆలయాల అభివృద్ధి ద్వారా ఆధ్యాత్మిక విలువలు, సంప్రదాయాలు పరిరక్షించబడతాయని అన్నారు. సమాజంలో ఐక్యత, భక్తి భావన పెంపొందించడంలో దేవాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఆలయ నిర్మాణం విజయవంతంగా పూర్తై, బోనాల ఉత్సవాలు వైభవంగా జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నాగేష్ నాయక్, ఆలయ కమిటీ సభ్యులు కృష్ణ, రమేష్, నరేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 10న జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

## సిపిఎం పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు నాగారపు పాండు



ఈరోజు ఎమ్మెస్ భవన్ గరిడేపల్లి లో రౌండ్ టేబుల్ సమావేశం నర్వహించారు ఈ కార్యక్రమాన్ని నిర్దేశించి సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగారపు పాండు మాట్లడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలపై సూపిస్తున్న విక్షతను నిరసిస్తూ జైల్బరో కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారుబుధవారం రోజు గరిడేపల్లి ఎమ్మెస్ భవన్లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం సిపిఎం మండల కార్యదర్శి ఎస్ కే యాకూబ్ అధ్యక్షతన జరిగినది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాండు గారు మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం 44 చట్టాలను నాలుగు చట్టాలుగా కూడికరించి కార్మికులకు సమ్మె హక్కు లేకుండా చేస్తుందని అన్నారు వేల కోట్ల రూపాయలు ఆదోని లాంటి సంస్థలకు మాఫీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం కార్మికులపై కక్ష కట్టిందని అన్నారు రైతాంగానికి పండించిన పంట చేతికొచ్చే వరకి నమ్మకం లేకుండా పోయిందని మధ్య దళారుల వల్ల రైతుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కొత్తగా విత్తన చట్టం తీసుకొచ్చి ఆదోనిలో కొమ్ముకాస్తున్న ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు భారతదేశంలో ఉన్న వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధంగా ఈ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల వల్ల దేశవ్యాప్తంగా ఆందోళన కొనసాగుతున్నాయని అన్నారు వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ చట్టం పని లేకుండా ఇప్పటికే దేశవ్యాప్తంగా ఐదు కోట్ల జాబు కార్డులు తొలగించి ఇందులో పనిచేసే ఉద్యోగస్తులకు కూడా కొంతమందిని తొలగించడం కోసం ప్రయత్నాలు చేస్తుందని అన్నారు ఇప్పటికే ఏలినో ప్రభావంతో వర్షాలు సరిగా లేకపోవడం వలన కూలీలు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ప్రజల నివారణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని కోరారు రైతు కార్మిక వ్యవసాయ కూలీల సమస్యలపై ఈనెల 10న హుజూర్నగర్ లో జరిగే జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి జిల్లా కమిటీ సభ్యులు కే అనంత ప్రకాష్ కొదమగుండ్ల నగేష్ కొట్టేపు సైదులు పాండు నాయక్ దుగ్గి బ్రహ్మం హుజూర్నగర్ మండల కార్యదర్శి పోసనబోయిన హుస్సేన్ నేరేడుచర్ల మండల కార్యదర్శి శ్రీనివాస్ మఠంపల్లి మండల కార్యదర్శి బాలు నాయక్ దోసపాటి బిక్షం నందిపాటి మట్టయ్య రావుల వెంకన్న శీలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

## -ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్

**మీడియా టుడే ప్రతినిధి నిజామాబాద్ జిల్లా ఆగస్టు 5:** విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ, ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని జీవితంలో మంచి స్థాయికి ఎదిగి తల్లిదండ్రులు గర్వపడేలా నిలవాలని ఆర్మూర్ ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ అన్నారు. ఆర్మూర్ మండల పరిధిలోని చేపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం కీర్తిశేషులు మీనుగు లక్ష్మణ్ 13వ వర్ధంతి సందర్భంగా వారి జ్ఞాపకార్థం వారి కుమారుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎఫ్ఏ ఫార్మేట్ బుక్స్, టీ-షర్ట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్మూర్ ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ హాజరై విద్యార్థులకు పుస్తకాలు, టీ-షర్ట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో విలువైనదని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై పెట్టుకున్న ఆశయాలను నెరవేర్చడంతో పాటు, సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు, విద్యార్థినులకు ఎఫ్ఏ ఫార్మేట్ బుక్స్ మరియు టీ-షర్ట్స్ పంపిణీ చేశారు. తండ్రి కీర్తిశేషులు మీనుగు లక్ష్మణ్ గారి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, టీ-షర్ట్స్ పంపిణీ చేస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న పోలీసు రాజేశ్వర్ సేవాభావాన్ని ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ అభినందించారు. విద్యార్థులకు విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారి చదువుకు తోడ్పాటు అందించడమే కాకుండా, కీర్తిశేషులు మీనుగు లక్ష్మణ్ జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలుపుతున్న కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో



గ్రామ సర్పంచ్ సారంగి శాంతికుమార్, ప్రధానోపాధ్యాయురాలు చేతనకుమారి, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నాగరాజు, పోలీసు రాజేశ్వర్ ఉపాధ్యాయులు సౌడ రవి, చంద్రకళ, విక్రమ్ సింహ, భాగవతుల వనజ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# శిథిలాల నుంచి శతపడకల ఆశల సౌధం

**ఇబ్రహీంపట్నంలో ఆరోగ్య విప్లవానికి నాంది**

**21 మంది స్పెషలిస్టులు తిరిగి రాక- వేగంగా 100 పడకల ఏరియా ఆస్పత్రి నిర్మాణం**

**ఆరోగ్య ఇబ్రహీంపట్నం లక్ష్యం-ఆరు నెలల్లో సేవలు లక్ష్యం**



ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం, ఆగస్టు 5(మీడియా టుడే):ఒకప్పుడు దుర్ఘటనతో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రి.. ఇప్పుడు ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించే శతపడకల ఏరియా ఆస్పత్రిగా రూపుదిద్దుకుంటోంది. శిథిలావస్థకు చేరిన పాత భవనం స్థానంలో ఆధునిక సౌకర్యాలతో మల్టీస్పెషాల్టీ ఆస్పత్రి నిర్మాణం వేగంగా సాగుతోంది.ప్రజారోగ్యమే ప్రధాన లక్ష్యంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో ఆస్పత్రి అభివృద్ధికి ఊపొచ్చింది.నాలుగేళ్ల క్రితం కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల్లో జరిగిన విషాద ఘటన తర్వాత ఆస్పత్రి పరిస్థితులపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆస్పత్రి నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పాత భవనాన్ని తొలగించి 100 పడకల ఏరియా ఆస్పత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అనంతరం ప్రభుత్వం ఆస్పత్రిని ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసి 23 మంది స్పెషలిస్టు వైద్యులను నియమించింది.

**నిర్మాణంతో తాత్కాలిక ఇబ్బందులు**

కొత్త భవనం నిర్మాణం జరుగుతుండటంతో ప్రస్తుతం మున్సిపాలిటీ భవనంలో వైద్యసేవలు కొనసాగుతున్నాయి. స్థలాభావం కారణంగా పలువురు స్పెషలిస్టులు డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో కొంతకాలం ఇద్దరు, ముగ్గురు వైద్యులతోనే సేవలు కొనసాగాయి.

**సచివాలయ సమీక్షతో మారిన పరిస్థితి**

ఇటీవల మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నిర్వహించిన సమీక్ష సమావేశం తర్వాత పరిస్థితి మారింది.డిప్యూటేషన్‌పై వెళ్లిన 21 మంది స్పెషలిస్టు వైద్యులు తిరిగి ఇబ్రహీంపట్నం ఆస్పత్రికి వచ్చారు. వీరిలో గైనకాలజిస్టులు, సర్జన్లు, చిన్నపిల్లల వైద్యులు, జనరల్ ఫిజీషియన్లు, చర్మవ్యాధి నిపుణులు, ఆర్థోపెడిక్, కంటి వైద్యులు, అనస్థీషియా నిపుణులు ఉన్నారు.

**ఎమ్మెల్యేను కలిసిన స్పెషలిస్టులు**

తిరిగి విధుల్లో చేరిన వైద్యులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, కొత్త ఆస్పత్రి అందుబాటులోకి వచ్చిన వెంటనే ప్రజలకు పూర్తి స్థాయి నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

**ఆరు నెలల్లో కొత్త భవనం లక్ష్యం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, ఒకప్పుడు విషాదానికి ప్రతీకగా నిలిచిన ఈ ప్రాంగణాన్ని ప్రజల ఆశలకు నిలయంగా మార్చడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల తరహాలో అన్ని విభాగాలతో కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించేలా ఆస్పత్రిని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మరో ఆరు నెలల్లో కొత్త భవనంలో సేవలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఆరోగ్య ఇబ్రహీంపట్నం లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, భవిష్యత్ తరాలకు మెరుగైన ప్రభుత్వ వైద్యసేవలు అందించడమే తమ సంకల్పమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలతో రైతులు అధిక ఆదాయం పొందాలి

**వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో లాభదాయక పంటలను సాగు చేయాలి**

**వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలి-పంటల వైవిధ్యీకరణే రైతుల ఆదాయానికి మార్గం**

**దేవరుప్పుల మండలం నీర్మాల గ్రామంలో రైతు వ్యవసాయ క్షేత్రం సందర్శన- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ జిల్లా మీడియాటుడే ఆగష్టు 05:** ఎల్-నీనో వాతావరణ పరిస్థితులు, భూగర్భ జలాల పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని రైతులు అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు వెళ్లకుండా, తక్కువ నీటితో అధిక లాభాలు అందించే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా రైతులకు సూచించారు.బుధవారం రోజు , జిల్లాలోని దేవరుప్పుల మండలం, నీర్మాల గ్రామానికి చెందిన ప్రగతిశీల రైతు నరేందర్ రెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించారు. రైతు సాగు చేస్తున్న మల్బరీ పంట, పట్టు పురుగుల పెంపకం, ఆయిల్ పామ్, మునగ పంటలను పరిశీలించి, సాగు విధానాలు, నీటి వినియోగం, మార్కెట్ అవకాశాల గురించి రైతుతో మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ రైతు నరేందర్ రెడ్డిని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. మల్బరీ మొక్కలను ఎంత దూరంలో నాటారు? అని అడుగగా, మొక్కకు మొక్కకు ఐదు అడుగుల దూరంలో నాటామని రైతు తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేశారా? అని ప్రశ్నించగా, డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి, ప్రభుత్వం నుంచి సబ్సిడీ కూడా పొందామని రైతు, కలెక్టర్ కు వివరించారు.అలాగే ఆయిల్ పామ్, మల్బరీ, మునగ పంటలలో ఉన్న వివిధ రకాల వెరైటీల గురించి రైతు, కలెక్టర్‌కు వివరించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. అధిక నీరు అవసరమయ్యే పంటల కంటే తక్కువ నీటితో మంచి ఆదాయం వచ్చే పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.ముఖ్యంగా నువ్వులు, కందులు, పెసర్లు, మినుములు, కుసుమ, ఆముదం వంటి ప్రత్యామ్నాయ పంటలను విస్తృతంగా సాగు చేయాలని సూచించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకుంటే సాగు ఖర్చులు తగ్గడమే కాకుండా రైతులకు ఆదాయం కూడా పెరుగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం సూచిస్తున్న పంటల వైవిధ్యీకరణను రైతులు



సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, సూక్ష్మ నీటిపారుదల విధానాలు, పంటల వైవిధ్యీకరణను అనుసరించడం ద్వారా రైతులు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించుకోవడంతో పాటు అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు.ఈ పరిశీలనలో డీఏఓ అంబికా సోని, ఎంఏఓ మనోహిత్, ఏఈఓ సాయి కిరణ్, గ్రామ సర్పంచ్ సంధ్యారాణి, ఇతర సంబంధిత అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు

# ఏడుగురికి కారుణ్య నియామక పత్రాలు అందించిన: కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , ఆగస్టు 05 :** జిల్లాలో వివిధ శాఖల్లో కారుణ్య నియామకం కింద ఏడుగురికి ఉద్యోగాలు కల్పించినట్లు బుధవారం కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. వివిధ శాఖల్లో ఐదుగురు జూనియర్ అసిస్టెంట్లుగా, ఇద్దరినీ ఆఫీస్ సబార్డినేట్లుగా నియమించినట్లు పేర్కొన్నారు. వారికి కలెక్టరేట్ లోని తన చాంబర్ లో కలెక్టర్ నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ఉద్యోగం పొందిన వారు బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ..తమ కుటుంబాలకు ఆసరాగా నిలవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఆర్ఓ స్వామి తదితరులు పాల్గొన్నారు.కారుణ్య నియామకాలు పొందిన వారి వివరాలు: వినేష్ -ఆఫీస్ సబార్డినేట్ పశుసంవర్ధక శాఖ, అభిలాష్-ఆఫీస్ సబార్డినేట్ ట్రెజరీ, వేల్పుల సుమలత-జూనియర్ అసిస్టెంట్ సీపీఓ ఆఫీస్, వకులాభరణం విషంత-జూనియర్ అసిస్టెంట్ వర్క్స్ మరియు అకౌంట్స్, రేహ ఫాతిమా-జూనియర్ అసిస్టెంట్ కరీంనగర్ జీజీహెచ్, కొల్ల రాజు-జూనియర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయంశ్రీలక్ష్మి- జూనియర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయం.

# పీజీ ఎంట్రన్స్‌లో తరోడ విద్యార్థినికి రాష్ట్రస్థాయిలో ఎనిమిదవ ర్యాంకు



TG CPGET – 2026
KAKATIYA UNIVERSITY
RANK CARD

| | |
|---|---|
| TG CPGET - 2026 Hall Ticket No. | 14339040002 |
| Candidate's Name | TOKRE SUJATHA |
| Father's Name | TOKRE SUDHAKAR |
| Test Name | M.A. Hindi |
| Persons with Benchmark Disability (PH) | NO |
| Community | SC (GROUP-III) |
| Date of Birth | 30/09/2003 |
| Marks Obtained | 82 |
| Result | QUALIFIED |
| Rank in Figure | 8 |
| Rank in Words | Eight |

Convener

**ఆదిలాబాద్ జిల్లా మీడియా టుడే బ్యూరో ఆగష్టు 05 :** తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన పీజీ హిందీ ప్రవేశ పరీక్షల్లో నిర్మల్ జిల్లా ముధోల్ మండల్ తరోదా గ్రామానికి చెందిన సామాజిక వర్గానికి చెందిన సుజాత అద్భుత ప్రతిభ కనబరిచింది. ఇటీవలే ప్రకటించిన పీజీ ఎంట్రెన్స్ లో ఆమె రాష్ట్రస్థాయిలో 8వ ర్యాంకు, లింగ్విస్టిక్స్ లో 170వ ర్యాంకు సాధించింది.ఈ విజయంతో సుజాత, ఆమె కుటుంబ సభ్యులు ,ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. కష్టపడి చదివితే ఏ లక్ష్యమైనా సాధించవచ్చని సుజాత తెలిపింది. ప్రస్తుతం బహుజన స్టూడెంటు ఫెడరేషన్ ఆఫ్ ఇండియా విద్యార్థి నాయకురాలుగా పనిచేస్తుంది. ఉస్మానియా యూనివర్సిటీలో చదవాలి అనే కళ నెరవేరబోతుందని హర్షం వ్యక్తం చేసింది. బాగా కష్టపడి చదివి భవిష్యత్తులో ప్రొఫెసర్‌గా ఎదిగి విద్యార్థులకు సేవ చేయాలనేది తన లక్ష్యమని ఆమె పేర్కొంది.సుజాత విజయం పట్ల స్థానికులు, బంధువులు అభినందనలు తెలియజేస్తున్నారు.

# ప్రజల భాగస్వామ్యంతో నే స్వచ్ఛా గ్రామం ఏర్పడుతుంది

## సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్



**జనగామ జిల్లా కొడకండ్ల మీడియాటుడే ఆగష్టు 05:** కొడకండ్ల గ్రామంలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ప్రణాళిక బద్ధంగా వ్యర్థాలను సేకరించి ప్రజలు భాగస్వాములు గా ఉన్నపుడే స్వచ్ఛా గ్రామం ఏర్పడుతుందని సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో చెత్త సేకరణ , జల సిరి కార్యక్రమాల పై ప్రజలకు గ్రామ పంచాయతీ పాలక మండలి తో కలిసి అవగాహన ర్యాలీ నీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇంకుడు గుంతలు ప్రతి ఇంటి లో ఉండాలని తడి పొడి చెత్త లను వేరుగా సేకరించాలని కోరారు . అనంతరం పల్లె ప్రకృతి వనంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎండీ షన్నా, కార్యదర్శి ఆంజనేయులు, వార్డు సభ్యులు నవీన్, పిల్లల దుర్గా సాయి, శివరాత్రి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో విద్యా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

**అంగన్‌వాడీ కేంద్రంలో పరిశుభ్రత, పోషణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి**

**దేవరుప్పుల మండలం, నీర్మాల గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం సందర్శన**

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ జిల్లా మీడియాటుడే ఆగష్టు 05:** బుధవారం రోజు , జిల్లాలోని దేవరుప్పుల మండలం, నీర్మాల గ్రామంలో ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా సందర్శించి, తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలలోని 2వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ.. వారి పేర్లు, ఏ తరగతి చదువుతున్నారు? రోజూ పాఠశాలకు వస్తున్నారా? ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు అర్థమవుతున్నాయా? తెలుగు, ఇంగ్లీష్ చదవగలుగుతున్నారా? గణితంలో కూడికలు, తీసివేతలు చేయగలుగుతున్నారా? అని అడిగి తెలుసుకున్నారు.ప్రతి విద్యార్థి నాణ్యమైన విద్యను పొందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పిల్లల్లో చదువుపై ఆసక్తి పెంపొందించే విధంగా బోధన ఉండాలన్నారు.అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, చిన్నారుల ఆరోగ్యం, పోషకాహార పంపిణీ, హాజరు, తదితర అంశాలను పరిశీలించారు.చిన్నారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని, కేంద్రంలో పరిశుభ్రతను పాటిస్తూ ప్రతి చిన్నారి ఆరోగ్యం, ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ తనిఖీలో గ్రామ సర్పంచ్ సంధ్యారాణి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

# నూతుల శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు

## -నిరుపేదలకు దుస్తుల పంపిణీ చేసిన సభ్యులు



**మీడియా టుడే ప్రతినిధి నిజామాబాద్ జిల్లా ఆగస్టు 5 :**
ఆర్మూర్ పట్టణంలో బుధవారం నాడు కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు నూతుల శ్రీనివాస్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని నిరుపేద ఇటిక బట్టిలా వద్ద పనిచేసే వారికి చిన్న పెద్ద అని తారతమ్యం లేకుండా నూతన దుస్తులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కిషన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు నూతుల శ్రీనివాస్ రెడ్డి తో పాటు బిజెపి పట్టణ అధ్యక్షులు మందుల బాలు, జిల్లా కార్యదర్శి పొల్కం వేణు, ఆకుల శ్రీనివాస్, కౌన్సిలర్ శ్రవణ్ గౌడ్, ఉదయ్ గౌడ్, శేష గారి లింగం, యామాద్రి వంశీ, నందు, చింటూ, ఆదిలు, గంగారెడ్డి నక్కల రాములు, గట్టడి ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకుందాం

## పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ



**శేరిలింగంపల్లి మీడియా టుడే న్యూస్ ఆగస్టు 5:**
తెలంగాణ రాష్ట్ర సంస్కృతి ,సంప్రదాయాలకు ప్రతీక అయిన ఆషాఢ మాస బోనాల పర్వదినం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరుపున శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని 92 దేవాలయంలకు మంజూరైన రూ.30,71,000/- ముప్పై లక్షల డెబ్బై ఒక వెయ్యి రూపాయల ఆర్థిక సహాయం ను ఈ ఓ సత్యనారాయణ , మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్ , ఉప్పలపాటి శ్రీకాంత్ , సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తో కలిసి ఆలయ ధర్మకర్తలకు అందజేశారు.

**తెలంగాణ ముఖ్యమంత్రి**
రేవంత్ రెడ్డి అన్ని మతాలను సమానంగా చూస్తున్నారు అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ద మనస్సు తో ఈ ఏడాది బోనాల ఉత్సవాల కోసం రూ.20 కోట్ల నిధులు మంజూరి చేయడం జరిగినది అని, మన శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గల 92 దేవాలయాలకు గాను రూ. 30,71,000/- రూపాయలు మంజూరి అయినవి అని, ఆలయాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరుగుతుంది అని, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సదుపాయాలు వంటి అన్ని ఏర్పాట్లను సమన్వయంతో అమలు చేయడం జరుగుతుంది అని, మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుంది అని ఆయన అన్నారు. ప్రతి భక్తుడు అమ్మవారి ఆశీస్సులతో ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలను జరుపుకునేలా అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని అధికారులకు ఎమ్మెల్యే గాంధీ తెలియచేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు ,కార్యకర్తలు, ఆలయ ధర్మ కర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ నేరాల పై అవగాహనాలి సదస్సు



**కోదాడ, ఆగస్టు 05 (మీడియా టుడే)-:**
కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల లో సైబర్ నేరాల పై అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగినదని కళాశాల చైర్మన్ డాక్టర్ నీలా సత్యనారాయణ తెలిపారులి .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోదాడ డిప్యూటీ సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ శ్రీనివాస రెడ్డి పాల్గొని విద్యార్థి నులను ఉద్దేశించి మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ళు ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్ మరియు కంప్యూటర్స్ ఉపయోగించి విద్యార్థినులను మోసం చేసి, వారి వ్యక్తి గత సమాచారాన్ని దొంగిలించటం జరుగుతుంది అని, సైబర్ నేరాల పై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని తెలియచేసారు. కోదాడ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివ శంకర్ మాట్లాడుతూ, విద్యార్థి నులు సామాజిక మాధ్యమాలైన పేస్ బుక్, ఇంస్టాగ్రామ్, ట్విట్టర్, వాట్సప్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థినులకు సూచించారు. కోదాడ ట్రాఫిక్ సబ్ -ఇన్స్పెక్టర్ అంజి రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించడానికి మరియు ప్రాణాలను రక్షించడానికి ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు చరవానిలను వినియోగిచకూడదని విద్యార్థి నులకు చూచించారు. కోదాడ పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ జి. అజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి నులు, నకిలీ సోషల్ మీడియా ప్రొఫైల్ తో, విద్యార్థినులను బ్లాక్మెయిల్ చేయడం జరుగుతుందని, అటువంటి నకిలీ ఖాతాలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్థానిక పోలీస్ అక్క మీనా మాట్లాడుతూ విద్యార్థినులు రక్షణ చట్టాలపై అవగాహనా కల్పించుకోవాలని, విద్యార్థి నులకు ఇటువంటి సమస్యలు ఎదురైనా పోలీస్ అక్కను సంప్రదించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెరుమాళ్ళ పల్లి గాంధీ, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

# కీసరలో ఘనంగా నవోదయ స్థాపన దినోత్సవ వేడుకలు

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ మనూజ రెడ్డి






**మీడియా టుడే/మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా: కీసర ఆగస్టు 05**
నవోదయ విద్యాలయాల స్థాపన దినోత్సవ వేడుకలను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసరలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హయాంలో కేంద్ర విద్యా శాఖ మంత్రిగా పనిచేసిన పీవీ నరసింహారావు 1986 సంవత్సరంలో ప్రభావితుడై గ్రామీణ విద్యార్థులను ఉన్నత స్థితిలో చూడాలని సంకల్పంతో ఈ విద్యాలయాను యావత్ భారత దేశంలో 662 విద్యాలయాలు ప్రారంభించి, వారి ఉదార గుణాన్ని చాటుకున్నారు. ఈ విద్యాలయాలలో చదువుకున్న విద్యార్థులు ఉత్త పౌరులుగా మారి సమాజంలో ఉత్తమమైన సేవలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ మనూజ రెడ్డి పాల్గొని వారి అమూల్య సందేశంతో విద్యార్థులకు దిశా నిర్దేశం చేసి, ప్రతి విద్యార్థి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించవలసిన అవసరాన్ని గుర్తు చేశారు. విద్యార్థుల ప్రతిభ పాటవాలను చూసి ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలు సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. విద్యాలయ ప్రధాన ఆచార్యులు మాధవరావు కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ మనూజ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నవోదయ లో చదివే అవకాశం వచ్చినందుకు పలువురు విద్యార్థులు హర్షద్వానాలు చేసి, ఉన్నత శిఖరాలను మేము చేరగలమని విద్యార్థులంతా ధీమా వ్యక్తం చేశారు. కీసరలో ఉన్న విద్యాలయంపై అభిమానంతో స్థానిక పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ విద్యార్థుల అత్యవసర వసతుల కల్పన కొరకై అడాగా వెంటనే స్పందించి ఏర్పాటు చేసినందుకు విద్యార్థులు తల్లిదండ్రులు ప్రధానచార్యులు, ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు. విద్యాలయ శ్వాశత భవనాన్ని బాచుపల్లిలో నిర్మించడానికి జిల్లా కలెక్టర్ మను చౌదరి ప్రత్యేక చొరవ తీసుకొని 19 ఎకరాల స్థలంలో నూతన విద్యా విధానంలో బోధించడానికి సుందరమైన శాశ్వత భవన నిర్మాణం త్వరగా పూర్తి కావడానికి సహకరిస్తున్నారని ప్రధానాచార్యులు గుర్తు చేశారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతతో పాటు వేగానికి ప్రాధాన్యత ఇవ్వాలి

## రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి. గౌతమ్

**వనపర్తి జిల్లా మీడియా టుడే ప్రతినిధి సి రమేష్ రెడ్డి ఆగస్టు 5**
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిమితులకు లోబడి, నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి. గౌతమ్ ఆదేశించారు బుధవారం వనపర్తి జిల్లా వనపర్తి మండలం రాజపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి మేనేజింగ్ డైరెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఎండి ఆరా తీయగా.. గ్రామంలో మంజూరైన 34 ఇందిరమ్మ ఇళ్లకు 34 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు, ఇండ్లు నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నట్లు హౌసింగ్ పీడీ వివరించారు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు బిల్లులు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఎక్కువ ఎత్తుతో కూడిన బేస్మెంట్ నిర్మించుకోవడం, పరిమితికి మించి స్లాబ్ సైజు పెంచుకోవడం వంటివి చేయవద్దని సూచించారు. అలా చేస్తే నిర్మాణ ఖర్చు భారీగా పెరుగుతుందని సూచించారు. కాబట్టి లబ్ధిదారులు పరిమితులకు లోబడే నిర్మాణం చేపట్టాలని తెలియజేశారు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు అనంతరం లబ్ధిదారులు గంధం నాగమ్మతో పాటు మరో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలను సందర్శించి, పరిశీలించి వారితో నేరుగా మాట్లాడారు. నిర్మాణ వ్యయం, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం, నిర్మాణ పనుల పురోగతి తదితర అంశాలపై ఆరా తీశారు. అలాగే ప్రస్తుతం మార్కెట్లో సిమెంట్ బస్తాలు, ఇనుప సామగ్రి ధరలపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు ఇందిరమ్మ ఇళ్ల



నిర్మాణానికి అవసరమైన సిమెంట్‌ను ప్రభుత్వం రాయితీ ధరలకు లబ్దిదారులకి అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అంశంపై లబ్ధిదారుల అభిప్రాయాలను కూడా తెలుసుకుని నమోదు చేసుకున్నారు ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ విటోభా, ఇతర అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

# నేత్రదానం చేసిన కరీంనగర్ నగర నివాసి చంద్రమౌళి



**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మీడియా టుడే , ఆగస్టు 05**
మానవతా దృక్పథంతో కూడిన ఒక గొప్ప పనిలో భాగంగా, కరీంనగర్ హౌసింగ్ బోర్డ్ కాలనీ నివాసి మరియు పదవీ విరమణ పొందిన ఇూూ అధికారి అయిన లిలివెగ్గిలం చంద్రమౌళి మరణానంతరం వారి కళ్లను దానం చేయడం ద్వారా ఇద్దరు దృష్టి లోపం ఉన్నవారికి చూపును ప్రసాదించారు. మరణానంతరం కూడా మానవాళికి సేవ చేయాలనే కుటుంబ కోరికను నెరవేరుస్తూ, వారి కుమారుడు వెగ్గిలం మనోజ్ తేజ్ తమ బంధువు అంజని కుమార్ సహకారంతో ఈ నేత్రదాన నిర్ణయాన్ని తీసుకున్నారు. నిర్దేశిత వైద్య విధానాలను పాటిస్తూ ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ (ఐ బ్యాంక్)వైద్య బృందం నేత్ర సేకరణ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించింది.లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ సభ్యులు బాధిత కుటుంబానికి తమ మద్దతును తెలియజేయడంతో పాటు నేత్రదాన సందేశాన్ని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మ్యాడం శివకాంత్, కార్యదర్శి బట్టు వినోద్, కోశాధికారి మేతుకు కృష్ణ చైతన్య, ముక్క శరత్ కృష్ణ, గుజ్జుల సతీష్ కుమార్ మరియు కంటి ఆసుపత్రి ట్రస్టీ సభ్యులు కోల అన్నారెడ్డి పాల్గొన్నారు.ఒక దాత ద్వారా ఇద్దరు వ్యక్తులకు చూపును తిరిగి అందించవచ్చని, నేత్రదానం అత్యంత గొప్ప సేవా కార్యక్రమాలలో ఒకటని పేర్కొంటూ, ఈ గొప్ప నిర్ణయం తీసుకున్న దివంగత వెగ్గిలం చంద్రమౌళి గారి కుటుంబాన్ని క్లబ్ సభ్యులు అభినందించారు. నేత్రదానం అనేది ఒక వ్యక్తి జీవితకాలం తర్వాత కూడా వారి చూపును సజీవంగా ఉంచే అమూల్యమైన కానుక అని నొక్కి చెబుతూ, ప్రజలందరూ ముందుకు వచ్చి నేత్రదానానికి అంగీకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాంకుమార్ కి జార్జిరెడ్డి పిడిఎస్ యు వినతి

**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**
ఖమ్మంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న పారిశుద్ధ్య, మౌలిక వసతులు, తాగునీటి సౌకర్యం, శానిటరీ వాష్‌రూమ్‌ల నిర్వహణ, తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్లు, బెంచీలు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ జార్జిరెడ్డి పిడిఎసు యు జిల్లా గర్ల్స్ కమిటీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీ రాంకుమార్ కి వినతిపత్రం అందజేసింది.ఈ సందర్భంగా జార్జిరెడ్డి పిడిఎసు యు జిల్లా గర్ల్స్ కన్వీనర్ పైండ్ల శ్యామల మాట్లాడుతూ, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కళాశాలలో పరిశుభ్రతను ప్రతిరోజూ నిర్వహించాలని, విద్యార్థినులు శానిటరీ ప్యాడ్స్‌ను పారవేయడానికి ప్రత్యేక డస్ట్‌బిన్‌లు, ఇన్సినరేటర్ యంత్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే తరగతి గదుల్లో పనిచేయని ఫ్యాన్లు, లైట్లు వెంటనే మరమ్మతులు చేసి అవసరమైన చోట కొత్తవి ఏర్పాటు చేయాలని, పగిలిపోయిన బెంచీలు, డెస్కుల స్థానంలో కొత్తవి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కళాశాల ప్రాంగణంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించి, స్వచ్ఛమైన తాగునీటిని నిరంతరం అందించాలని తెలిపారు.కళాశాల క్యాంటీన్‌లో పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం సరసమైన ధరలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థినుల భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలు, అవసరమైన భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని కోరారు.ప్రతి క్లాస్‌రూమ్‌లో విద్యార్థినుల సమస్యల కోసం ప్రత్యేక సజెషన్ బాక్స్ ఏర్పాటు చేసి, అందిన ఫిర్యాదులను యాజమాన్యం క్రమం తప్పకుండా పరిశీలించి పరిష్కరించాలని, కళాశాలలో ఉన్న ఆర్.ఓ. వాటర్ ప్లాంట్ మరియు వాటర్ స్టోరేజ్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరచి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు.విద్యార్థినుల ఆరోగ్యం, పరిశుభ్రత, భద్రత, నాణ్యమైన విద్యా




వాతావరణం కోసం సమస్యలను వెంటనే పరిష్కరించాలని, వారు డిమాండ్ చేశారు.ప్రతినిధి బృందంలో జార్జిరెడ్డి పిడిఎసు యు జిల్లా గర్ల్స్ కన్వీనర్ పైండ్ల శ్యామల, ప్రవలిక, సంధ్య, నర్మదా, స్వాతి, మనీషా, మన్విత, శ్రీనిధి పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల పోరాట ఫలితం డిప్‌సైడ్ గని -- ఐఎన్‌టీయూసి

## - కొండాపురం అండర్‌గ్రౌండ్ మైన్‌లో సంబరాలు..

## - మిఠాయిల పంపిణీ చేసిన ఐఎన్‌టీయూసీ నాయకులు

**మణుగూరు,ఆగస్టు 5(మీడియా టుడే):**
పీకేఓసీ-2 డిప్‌సైడ్ గనిని సింగరేణికి కేటాయించిన ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ కొండాపురం అండర్‌గ్రౌండ్ మైన్‌లో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఫిట్ మీటింగ్ నిర్వహించి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మణుగూరు ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ వి. కృష్ణంరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీకేఓసీ-2 డిప్‌సైడ్ గనిని సింగరేణికి కేటాయించడం సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, మణుగూరు ప్రజల సమిష్టి విజయమని అన్నారు. ఈ నిర్ణయంతో వేలాది కుటుంబాలకు భరోసా లభించిందని, గనిలో ఉత్పత్తిని పర్మినెంట్ కార్మికులతోనే చేపట్టాలని డిమాండ్ చేశారు.సింగరేణి పరిరక్షణ కోసం ఐఎన్‌టీయూసీ నిరంతరం పోరాడిందని, ఈ విజయానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో పాటు కోల్‌బెల్ట్ ప్రజాప్రతినిధుల కృషి అభినందనీయమని తెలిపారు.అధికారుల సూచనల మేరకు భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఉత్పత్తి పెంపునకు ప్రతి కార్మికుడు అంకితభావంతో పనిచేయాలని ఆయన



పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ నాయకులు గట్టయ్య, అబ్దుల్ రవూఫ్, డి. సందీప్, తాళ్లూరి రాము, రాజాబాబు, యాకూబ్ పాషా, సతీష్, రత్నం, మహేష్, అధికారులు, కార్మికులు, మహిళా కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

# గోదావరి రెండో వంతెన పనులు వేగవంతం చేయాలి - మంత్రి తుమ్మల



**భద్రాచలం,ఆగస్టు 5(మీడియా టుడే):**
గోదావరి రెండో వంతెనపై రాకపోకలను ఈ నెలలోనే పునరుద్ధరించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.బుధవారం గోదావరి వరదల సమయంలో దెబ్బతిన్న రెండో వంతెన అప్రోచ్ రోడ్డు మరమ్మతు పనులను మంత్రి పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానానికి ప్రతిరోజూ దేశ విదేశాల నుంచి వేలాది మంది భక్తులు వస్తుంటారని తెలిపారు. గోదావరి పుష్కరాలు, శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం వంటి సందర్భాల్లో భారీగా భక్తులు తరలివస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని రెండో వంతెన నిర్మాణం చేపట్టినట్లు వివరించారు.గత ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మాణ పనులు మందగమనంలో సాగాయని, ప్రస్తుతం పనులను వేగవంతం చేసి ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రెండో వంతెన పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటుందని మంత్రి తెలిపారు.వరదలు వచ్చినా అప్రోచ్ రోడ్డు దెబ్బతినకుండా పటిష్టమైన రిటైనింగ్ వాల్ నిర్మాణం జరుగుతోందని, ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేసి వంతెనపై రాకపోకలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.రెండో వంతెన అందుబాటులోకి రావడంతో ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు భద్రాచలం మీదుగా ప్రయాణించే వాహనదారులు, భక్తులకు మరింత సౌకర్యం కలుగుతుందని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# డి ఎం డబ్ల్యూ ఓ మర్యాదపూర్వకంగా కలిసిన కోదాడ నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షులు



**కోదాడ, ఆగస్టు 05 (మీడియా టుడే)–:**
కోదాడ క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షులు డాక్టర్ యేసయ్య నూతనంగా సూర్యాపేట జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర గా చార్జి తీసుకుంటున్న సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి కోదాడ నియోజకవర్గ క్రైస్తవుల తరఫున వారికి శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ వెలిఫర్ జూనియర్ అసిస్టెంట్ చంద్రు, గిరి , కోదాడ నియోజకవర్గం పాస్టర్స్ ప్రభుదాస్, బ్రదర్ రాంబాబు తదితరులు కలిశారు.

# నేటి నుంచి సిపిఐ ప్రజా చైతన్య యాత్ర

**-తల్లంపాడు హైవే జంక్షన్ వద్ద ప్రారంభం.**

**-ప్రభుత్వ వైఫల్యాలు వివరించి జనచైతన్య మే లక్ష్యం**




**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :-**
భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి పిలుపులో భాగంగా ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం నుంచి ప్రజా చైతన్య పాద యాత్రలను నిర్వహించనున్నారు గురువారం ఉదయం తొమ్మిది గంటలకు ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు హైవే జంక్షన్ వద్ద పాదయాత్రను సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ప్రారంభించనున్నారు ఆరో తేదీ నుంచి 13వ తేదీ వరకు 20 మండలాల్లో ఈ పాదయాత్రలు నిర్వహించనున్నట్లు జిల్లా సమితి తెలిపింది కేంద్ర ప్రభుత్వం ప్రజలను విస్మరించి పాలను సాగిస్తున్నదని మోడీ పాలన వైఫల్యాలను ప్రజలకు వివరించే లక్ష్యంతో ప్రజా చైతన్య యాత్రలను నిర్వహిస్తున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు కార్పొరేట్ అనుకూల పాలనలో భాగంగా అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి విబిజి రాంజీ పథకాన్ని తీసుకువచ్చిందని దీని రద్దు కోసం సిపిఐ పోరాడుతుందన్నారు వి బి జి రామ్ జి స్తానే జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యధాతథంగా అమలు చేయాలని సిపిఐ డిమాండ్ చేస్తుందని సురేష్ తెలిపారు వ్యవసాయ రంగాన్ని పరిరక్షించాల్సిన కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరేట్లకు అంటగట్టే ప్రయత్నం చేస్తుందని ఈ క్రమంలోనే ట్రంప్ తో ఒప్పందాలు వ్యవసాయ సబ్సిడీలు ఎత్తివేత పెట్టుబడికి తగిన విధంగా మద్దతు ధరలు ప్రకటించకపోవడం చేస్తున్నారని ఆయన ఆరోపించారు నూతన సాగు చట్టాల పేరుతో రైతులను భూమి నుంచి తరిమే ప్రయత్నం చేస్తున్నదని సురేష్ ఆరోపించారు కార్మిక చట్టాలను రద్దుచేసి దాని స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చారని నాలుగు లేబర్ కోడ్స్ ద్వారా పనిగంటలను పెంచారని ఆయన తెలిపారు దేశంలో ఆర్థిక పరిస్థితులు అత్యంత ప్రమాదకరంగా మారుతున్నాయని పెరుగుతున్న ఆర్థిక అంతరాలు భవిష్యత్తులో ఓ సవాలుగా పరిణమించనున్నాయన్నారు వీటిని అన్నింటిని ప్రజలకు వివరించి చైతన్య పరిచేందుకు పాదయాత్రలు నిర్వహిస్తున్నామన్నారు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తుందని ఈ విషయాన్ని సైతం ప్రజల్లోకి తీసుకు పోతామని సురేష్ స్పష్టం చేశారు రుణమాఫీ ఇందిరమ్మ ఇండ్లు తదితర విషయాల్లో పూర్తిస్థాయి అమల్లో విఫలమైందని మరికొన్నింటి విషయంలో అడుగు కూడా ముందుకు పడలేదన్నారు పాదయాత్రల ద్వారా చైతన్యం తీసుకువచ్చే క్రమంలో పలుచోట్ల సభలు నిర్వహించనున్నట్లు సురేష్ తెలిపారు ఖమ్మంలో ఈ నెల 13న జరిగే బహిరంగ సభతో పాదయాత్రలు ముగుస్తాయని సురేష్ తెలిపారు.

# క్లిష్ట సమయంలో మానవత్వం చాటిన మాజీ ఎంపీ నామానాగేశ్వరరావు

**-వేణుకుమార్‌కు మరోసారి అండగా నిలిచిన మాజీ ఎంపీ నామ**

**-వేణుకుమార్ డిశ్చార్జ్ బిల్లు మాఫీ చేయించిన మాజీ ఎంపీ నామ**

**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**
గ్రూప్స్ నోటిఫికేషన్ల విడుదలలో జాప్యంపై ఆవేదన వ్యక్తం చేస్తూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ముదిగొండ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన జి. వేణుకుమార్ సోమవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు మరోసారి మానవత్వాన్ని చాటుతూ ఆస్పత్రి యాజమాన్యంతో నేరుగా మాట్లాడి వేణుకుమార్ డిశ్చార్జ్ బిల్లును మాఫీ చేయించారు. ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి చేరిన వేణుకుమార్‌కు సకాలంలో వైద్య సేవలు అందించిన డాక్టర్ కేసోజు భారత్ బాబు, ఆస్పత్రి వైద్య బృందం, నర్సింగ్ సిబ్బందిని నామ అభినందించారు. ఇప్పటికే నామ ట్రస్ట్ తరపున వేణుకుమార్‌కు రూ.50 వేల ఆర్థిక సాయం అందించిన నామ వారి కుటుంబంపై ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు తెలిపారు. వేణుకుమార్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన అనంతరం వేణుకుమార్, ఆయన కుటుంబ సభ్యులు ఫోన్ ద్వారా నామకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వేణుకుమార్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నామ, జీవితంలో ఇంకా ముందుకు వెళ్లాలని, సాధించాల్సింది చాలా ఉందని ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. వేణుకుమార్ త్వరగా పూర్తిగా



కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించిన ఆయన, నిరుద్యోగ యువత ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని మరోసారి విజ్ఞప్తి చేశారు.

# సైబర్ నేరగాలపై అవగాహన సదస్సు

**మోసపోతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

**సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన**





**కొత్తగూడెం, ఆగస్టు 5: వినోద్ మీడియా టుడే**
కొత్తగూడెం సింగరేణి ఉమెన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరగాలపై అవగాహన కల్పించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాల రూపాలు కూడా మారుతున్నాయని, ప్రజలు ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉంటేనే ఇటువంటి మోసాల నుంచి రక్షణ పొందగలరని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ అన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో స్వాతంత్ర్య మాసాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న “సురక్ష కా తిరంగా -- సైబర్ స్వతంత్ర తెలంగాణ” ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సైబర్ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డిజిటల్ అరెస్ట్, స్టాక్ మార్కెట్, బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో మోసాలు, లోన్ యాప్‌లు, సోషల్ మీడియా వేదికగా జరిగే మోసాలు, ఏపీకే ఫైళ్ల ద్వారా మొబైల్ ఫోన్లలోకి చొరబడే సైబర్ దాడులు, మ్యూల్ బ్యాంక్ అకౌంట్ల వినియోగం వంటి నేరాలు రోజురోజుకు పెరుగుతున్నాయని తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు, ఉద్యోగాలు, సినిమా అవకాశాలు, రివార్డులు, తక్కువ వడ్డీ రుణాలు వంటి ఆకర్షణీయమైన ప్రకటనలను నమ్మి వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, యూపీఐ పిన్‌లు ఎవరికీ వెల్లడించరాదని హెచ్చరించారు.ప్రభుత్వ సంస్థలు, పోలీసు, బ్యాంకుల పేరుతో వచ్చే అనుమానాస్పద ఫోన్ కాల్స్, వీడియో కాల్స్, కేవైసీ అప్‌డేట్ సందేశాలను గుడ్డిగా నమ్మకూడదని, ఎలాంటి అనుమానం వచ్చినా సంబంధిత అధికారులను సంప్రదించి మాత్రమే స్పందించాలని సూచించారు. అపరిచితులు పంపిన లింకులు, ఏపీకే ఫైళ్లు, యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం ప్రమాదకరమని వివరించారు.సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని, సమయానికి ఫిర్యాదు చేస్తే నష్టపోయిన నగదును తిరిగి పొందే అవకాశాలు అధికంగా ఉంటాయని ఎస్పీ తెలిపారు. అనంతరం విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. అలాగే రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటుబెల్ట్ ధరించాలని, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, సైబర్ సెల్ సీఐ జితేందర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్, సైబర్ సెల్ అధికారులు, పోలీసు సిబ్బంది, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాం నెలవారి తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్

**బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**

**ములుగు జిల్లా ఆగస్టు05(మీడియా టుడే)**
ఈవీఎం గోదాం ను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు నెలవారి తనిఖీ నిర్వహించారు.బుధవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నెలవారి తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్ ను పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, అగ్నిప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఇతర భద్రతా పరికరాలను తనిఖీ చేశారు.అత్యవసర పరిస్థితులు తలెత్తిన సందర్భంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా రిజిష్టర్ లు సందర్శకుల నమోదు పుస్తకాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని భద్రతా సిబ్బందిని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు ప్రతి నెల గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి రాజీ లేకుండా 24 గంటలు భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, గోదాంలోని భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.ఈ



కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎం.డి. సలీం, డిప్యూటీ తహసీల్దార్ నితీష్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో

# సురక్షా కా తిరంగా

**-సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం**




**మీడియా టుడే ప్రతినిధి నిజామాబాద్ జిల్లా ఆగస్టు 5 :**
నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సురక్షా కా తిరంగా సైబర్ అవగాహన కార్యక్రమాన్ని క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. అప్రమత్తంగా ఉండండి అవగాహన పెంచుకోండి సురక్షితంగా ఉండండి అనే నినాదంతో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుతం పెరుగుతున్న కేవైసీ మోసాలు, డీప్‌ఫేక్ మోసాలు, సోషల్ మీడియా ప్రొఫైల్ మోసాలు, పెట్టుబడి మోసాలు వంటి సైబర్ నేరాల గురించి విపులంగా వివరించారు. ఇటువంటి మోసాల నుండి ఎలా జాగ్రత్తపడాలి, అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులు మరియు సోషల్ మీడియా ఖాతాలను ఎలా గుర్తించాలి అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా షీ టీమ్, నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మహిళల భద్రత, సైబర్ వేధింపుల నివారణ మరియు అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం ఎలా పొందాలో విద్యార్థినులకు వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. కట్కం శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థులు డిజిటల్ ప్రపంచంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కళాశాలలో ఇలాంటి సామాజిక అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్మూర్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్‌హెచ్‌ఓ పి. సత్యనారాయణ మాట్లాడుతూ, విద్యార్థులు సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు డిప్యూటీ పోలీస్ కమిషనర్ అడిషనల్ డీసీపీ శుభమ్ ప్రకాష్ నగరాలే, ఐపీఎస్ హాజరై మాట్లాడుతూ, నేటి డిజిటల్ ప్రపంచంలో సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో, అదే స్థాయిలో సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతపై పూర్తి అవగాహన కలిగి ఉండటం నేటి కాలంలో అత్యంత అవసరమని పేర్కొన్నారు. అప్రమత్తంగా ఉండండి అవగాహన పెంచుకోండి సురక్షితంగా ఉండండి అనే సందేశంతో ప్రతి విద్యార్థి బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరుడిగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ అల్జాపూర్ దేవేందర్, కళాశాల ప్రిన్సిపాల్ డా. కట్కం శ్రీనివాస్, అధ్యాపకులు విద్యార్థులు షీ టీం విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కోసం బీజేపీ నిరంతర పోరాటం: జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్



**మెదక్ జిల్లా మీడియా టుడే ఆగస్టు 5**

రైతుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారమే భారతీయ జనతా పార్టీ ప్రధాన లక్ష్యమని బీజేపీ జిల్లా అధ్యక్షులు పేర్కొన్నారు. "రైతుల కోసం, రైతుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ పార్టీ ఎల్లవేళలా పోరాడుతుంది" అని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కమిటీ సభ్యులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు గడ్డం కాశీనాథ్, పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, మాజీ ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు, సర్పంచ్ బాలరాజు, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఖిచ్చి గ్యన్ సింగ్, జిల్లా నాయకులు సిద్ధిరాములు, వివిధ మండలాల అధ్యక్షులు, సర్పంచ్ బెండె వీణ శ్రీనివాస్, హరీశ్, మండల ప్రధాన కార్యదర్శులు, పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న SIR ఫారమ్‌లను త్వరగా పూర్తి చేయాలి: డాక్టర్స్ కాలనీ కాంగ్రెస్ నాయకులు



**బాలాపూర్ (మీడియా టుడే రిపోర్టర్ )ఆగస్టు 05 న్యూస్**

మహేశ్వరం నియోజకవర్గంలోని డాక్టర్స్ కాలనీ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న ా×= ఫారమ్‌లను పూర్తి చేయడానికి కాలనీలు, బస్తీల్లో మిగిలిన ఓటర్లను మరోసారి సందర్శించి ప్రక్రియను పూర్తిచేయాలని డాక్టర్స్ కాలనీ కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులను కోరారు.ఈ సందర్భంగా సరూర్‌నగర్ వీ=ా అధికారి శ్రీ వేణుగోపాల్ గారిని కలిసి, ా×= ప్రక్రియను వేగవంతం చేయాలని, అవసరమైతే తాము కూడా అధికారులతో కలిసి ప్రతి కాలనీ, బస్తీలో తిరిగి మిగిలిన ఓటర్లను కలుసుకుని పూర్తి సహకారం అందిస్తామని డాక్టర్స్ కాలనీ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్స్ కాలనీ డివిజన్ సీనియర్ నాయకులు జిల్లెల కృష్ణ, షఫీ భాయ్, నహీం భాయ్, ఇమ్రాన్ అలీ, కొయడ జనార్దన్ గౌడ్, కండటి జంగారెడ్డి, మొగిళ్ల మల్లేష్, కడియల గోపాల్, కుర్మతి లక్ష్మయ్య, మాదాసు వెంకటేష్, మహబూబ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో రెండో విడత వాక్-ఇన్ అడ్మిషన్లు ప్రారంభం

**మెదక్ జిల్లా మీడియా టుడే ఆగస్టు 5:**

మెదక్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం రెండో విడత వాక్-ఇన్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ గుమ్మకొండ శ్రీనివాస్ తెలిపారు. 8వ లేదా 10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ప్రవేశాలకు అర్హులని, 2026 ఆగస్టు 1 నాటికి కనీసం 14 సంవత్సరాల వయస్సు పూర్తి చేసి ఉండాలని, గరిష్ఠ వయోపరిమితి లేదని పేర్కొన్నారు.ఈ నెల ఆగస్టు 5 నుంచి 15 వరకు వాక్-ఇన్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మొదటి విడతలో ఇప్పటికే దరఖాస్తు చేసిన వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని, వారు నేరుగా కళాశాలకు హాజరుకావచ్చని వెల్లడించారు.ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని తెలిపారు. విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆన్‌లైన్ దరఖాస్తు ప్రతితో కళాశాలకు హాజరై తమకు నచ్చిన ట్రేడ్‌లో ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు.అందుబాటులో ఉన్న ఖాళీ సీట్ల వివరాలను ప్రతిరోజూ అధికారిక వెబ్‌సైట్‌లో నవీకరిస్తామని, అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ గుమ్మకొండ శ్రీనివాస్ కోరారు.

# ప్రజలకు నిరంతర నీటి సరఫరా అందేలా చర్యలను

## సర్పంచి మందుల నాగయ్య

**కోదాడ, ఆగష్టు 05 (మీడియా టుడే)-:**




గ్రామంలో ప్రజలకు నిరంతర నీటి సరఫరా అందేలా చర్యల తీసుకుంటున్నామని సర్పంచి మందుల నాగయ్య అన్నారు. మండల పరిధిలోని గుడిబండ గ్రామంలో పాడైపోయిన బోరు మోటారును మరమ్మతులు చేయించి, తిరిగి అమర్చించడం జరిగిందని తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా, ప్రజలకు నిరంతర నీటి సరఫరా అందేలా అవసరమైన చర్యలను చేపడుతున్నారు. గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలే నవజాత శిశువులకు సంపూర్ణ రక్షణ

## ఐటీడీఏ పీవో రాహుల్



**భద్రాచలం,ఆగస్టు 5(మీడియా టుడే):**

ఆసుపత్రిలో పుట్టిన ప్రతి నవజాత శిశువుకు తల్లి సొంత పాలు మాత్రమే అందేలా వైద్యులు ప్రత్యేకంగా ప్రోత్సహించాలని, నెలలు నిండక ముందే పుట్టిన లేదా అనారోగ్యంతో ఉన్న శిశువులకు కూడా తల్లిపాలే ఉత్తమ పోషకాహారమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు.ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన లాక్టేషన్ మేనేజ్‌మెంట్ యూనిట్ను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ, శిశువుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలు అమూల్యమైనవని, ప్రతి తల్లికి తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి,పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు అందేలా వైద్యులు చర్యలు తీసుకోవాలని సూచించారు.లాక్టేషన్ మేనేజ్‌మెంట్ యూనిట్‌లో తల్లులకు పాలిచ్చే విధానంపై కౌన్సెలింగ్, తల్లిపాలు సేకరణ, నాణ్యత నిర్ధారణ, సురక్షిత నిల్వ వంటి సేవలు అందించాలని తెలిపారు. అలాగే తల్లుల కోసం ప్రత్యేక కౌన్సెలింగ్ గది, పాల సేకరణ గది, పరిశుభ్రమైన స్నాన సౌకర్యాలు, పాల నిల్వ కోసం ఫ్రిజ్, డీప్ ఫ్రీజర్, బట్టలు మార్చుకునే గది వంటి అన్ని మౌలిక వసతులు ఉండేలా చూడాలని సూచించారు.జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారం రాథోడ్ మాట్లాడుతూ, ఈ యూనిట్ ద్వారా తల్లులకు తల్లిపాలపై అవగాహన, సరైన పాలిచ్చే పద్ధతులపై శిక్షణ, వ్యక్తిగత కౌన్సెలింగ్‌తో పాటు నవజాత శిశువులకు అవసరమైన పాల నిర్వహణ సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ యూనిట్ తల్లి--శిశు ఆరోగ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, ఏడీఎంహెచ్‌వో సైదులు, ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఆర్ఎంఓలు డాక్టర్ సంతోష్, డాక్టర్ మల్లేష్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ దేవరాజ్, డాక్టర్ విజయ్, డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ యుగంధర్‌తో పాటు వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

## మెదక్ ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

**మెదక్ జిల్లా మీడియా టుడే ఆగస్టు 5:**

సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాలు కొత్త రూపాల్లో పెరుగుతున్నాయని, ప్రజలు డిజిటల్ ప్రపంచంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ సూచించారు.జాతీయ 'సైబర్ జాగృత్ దివస్' సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన 'సురక్షా కా తిరంగా--సైబర్ స్వతంత్ర తెలంగాణ' కార్యక్రమంలో భాగంగా మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన సైబర్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.సోషల్ మీడియాలో వచ్చే నకిలీ స్టాక్ మార్కెట్ పెట్టుబడి ప్రకటనలను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. వాట్సాప్ గ్రూపుల ద్వారా తప్పుడు లాభాల స్క్రీన్‌షాట్లు చూపించి ప్రజలను పెట్టుబడులకు ప్రలోభపెట్టి చివరకు భారీగా మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఉద్యోగాల పేరుతో వివిధ ఫీజులు అడిగే మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉద్యోగం ఇప్పిస్తామంటూ డబ్బులు కోరితే నమ్మవద్దని, ఉద్యోగం ఇచ్చే సంస్థ అభ్యర్థికి జీతం చెల్లిస్తుందే గానీ, ఉద్యోగం ఇవ్వడానికి డబ్బులు వసూలు చేయదని స్పష్టం చేశారు.బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, ఏటీఎం లేదా డెబిట్ కార్డు వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. ఫేక్ అకౌంట్లు, ఫిషింగ్ లింకులు, తప్పుడు ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు.సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి, జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని ఎస్పీ సూచించారు. విద్యార్థులు సైబర్ భద్రతపై అవగాహన పెంచుకొని తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు




ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీఎస్పీలు సుభాష్ చంద్రబోస్, ప్రసన్నకుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే. హుస్సేన్, అధ్యాపకులు, సైబర్ క్రైమ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

**రూ.20 వేల జరిమానా.. బాధితురాలికి రూ.లక్ష పరిహారం**

**దర్యాప్తు అధికారులను అభినందించిన మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**



**మెదక్ జిల్లా మీడియా టుడే ఆగస్టు 5:**

15 ఏళ్ల బాలికను మాయమాటలతో అపహరించి లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడు అక్తర్ (22)కు జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించింది. అలాగే బాధితురాలికి రూ.1 లక్ష పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు.2024 ఏప్రిల్‌లో బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి నార్సింగి ఎస్ఐ అహ్మద్ మొహినొద్దీన్ కేసు నమోదు చేయగా, అప్పటి రామాయంపేట సీఐ వెంకటరాజా గౌడ్ దర్యాప్తు చేపట్టి పక్కా సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు.కేసు విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య సమర్థవంతంగా వాదనలు వినిపించగా, జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితుడిని దోషిగా నిర్ధారించి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధించారు. బాధితురాలికి రూ.1 లక్ష పరిహారం మంజూరు చేయాలని కూడా ఆదేశించారు.బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. ఇలాంటి కేసుల్లో పటిష్టమైన దర్యాప్తు నిర్వహించి, బలమైన సాక్ష్యాధారాలతో నిందితులకు శిక్ష పడేలా పోలీసులు కృషి చేయాలని సూచించారు.ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి నార్సింగి ఎస్ఐ అహ్మద్ మొహినొద్దీన్, అప్పటి రామాయంపేట సీఐ వెంకటరాజా గౌడ్, లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణ, సీడీఓ సాయిబాబా, భరోసా లీగల్ అడ్వైజర్ శ్వేతా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్యలను జిల్లా ఎస్పీ అభినందించారు.

# నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం

**ఉచిత 4 వీలర్ సర్వీస్ టెక్నీషియన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం**

**శిక్షణ పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు వి వి సి మోటార్స్**

**కొత్తగూడెం, ఆగస్టు 5 వినోద్ మీడియా టుడే**

ఆటోమొబైల్ రంగంలో ఉద్యోగం పొందాలనుకునే నిరుద్యోగ యువతకు వి వి సి మోటార్స్ ఆధ్వర్యంలోని వి2సి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ శుభవార్త తెలిపింది. 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయస్సు గల యువకుల కోసం పూర్తిగా ఉచితంగా 4 వీలర్ సర్వీస్ టెక్నీషియన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. ఆగస్టు 10 నుంచి ప్రారంభమయ్యే ఈ శిక్షణ 30 రోజుల పాటు కొనసాగనుంది. శిక్షణలో ఆధునిక వాహనాల సర్వీసింగ్, నిర్వహణ, ప్రాథమిక సాంకేతిక నైపుణ్యాలపై ప్రాక్టికల్‌తో కూడిన శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు గుర్తింపు పొందిన సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆటోమొబైల్ రంగంలో కెరీర్ ప్రారంభించాలనుకునే యువతకు ఇది మంచి అవకాశమని తెలిపారు.ఈ బ్యాచ్‌లో కేవలం 30 మంది అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేయనున్నందున ఆసక్తి గల యువత ఆలస్యం చేయకుండా వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణకు ఎలాంటి ఫీజు ఉండదని, పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.శిక్షణ కేంద్రం కొత్తగూడెంలోని లక్ష్మీదేవిపల్లి టాటా మోటార్స్ భవనం మొదటి అంతస్తులోని వి వి సి స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉంటుంది. మరిన్ని వివరాల కోసం 8885352258 నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.నైపుణ్యాభివృద్ధితో ఉపాధి సాధించాలనుకునే నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వి వి సీ మోటార్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు




# భూ భారతి చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

## డీఆర్వో అంబాదాస్ రాజేశ్వర్



**మెదక్ జిల్లా మీడియా టుడే ఆగస్టు 5:**

భూ భారతి చట్టంపై రెవెన్యూ సిబ్బంది పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) అంబాదాస్ రాజేశ్వర్ సూచించారు.బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెవెన్యూ సిబ్బందికి నిర్వహించిన ఒకరోజు భూ భారతి చట్టంపై అవగాహన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ, రెవెన్యూ శాఖలో పని చేసే జూనియర్ అసిస్టెంట్లు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం భూ రికార్డుల నిర్వహణను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు, గత వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు సమగ్ర నూతన రెవెన్యూ భూ హక్కుల చట్టమైన భూ భారతి చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చిందన్నారు.ఈ చట్టం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భూ భారతి చట్టంలోని నిబంధనలపై ప్రతి రెవెన్యూ ఉద్యోగి అవగాహన పెంచుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళి అమ్మవారి బోనాలు, తొట్టెల మహోత్సవాలకు కంఠరెడ్డి తిరుపతిరెడ్డికి ఆహ్వానం

**మెదక్ జిల్లా మీడియా టుడే ఆగస్టు 5:**



మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో ఈ నెల 9న నిర్వహించనున్న శ్రీ మహంకాళి అమ్మవారి బోనాలు, తొట్టెల ఊరేగింపు, శ్రీ ముత్యాలమ్మ ఫలహారం బండి, తొట్టెల ఊరేగింపు మహోత్సవాలకు విచ్చేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు బీఆర్ఎస్ నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని కంఠరెడ్డి తిరుపతిరెడ్డి నివాసానికి వెళ్లిన ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. మహోత్సవాలకు తప్పకుండా హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందడంతో పాటు కార్యక్రమ విజయానికి సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కసిరెడ్డి మాణిక్యరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## భూ రీ-సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**-జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ -రైతుల సమక్షంలోనే పారదర్శకంగా భూ రీ సర్వే నిర్వహిస్తాం.**

**-రీ-సర్వే పూర్తయిన తర్వాత భవిష్యత్తులో భూ వివాదాలు**

**గణనీయంగా తగ్గి రైతులకు భద్రత కలుగుతుంది**

**పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలం**

**కొంగర గ్రామసభలో భూ రీ సర్వే పై అవగాహన కల్పించిన జిల్లా కలెక్టర్.**

**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రీ-సర్వే ద్వారా రైతుల భూములపై ఉన్న వివాదాలు, విస్తీర్ణ వ్యత్యాసాలు, రికార్డుల లోని లోపాలను పూర్తిగా పరిష్కరించి శాశ్వతమైన, పారదర్శకమైన భూ రికార్డులను రూపొందించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్పష్టం చేశారు. పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలం కొంగర గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం భూ రీ-సర్వే పై నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ పాల్గొని రైతులకు, గ్రామ ప్రజలకు సమగ్రంగా అవగాహన కల్పించారు. ప్రజలు భూ సర్వే పై అడిగిన పలు సందేహాలు కలెక్టర్ నివృత్తి చేశారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గ్రామంలో ముందుగా రెవెన్యూ గ్రామ సరిహద్దులను పూర్తిగా ఖరారు చేస్తున్నామని, అనంతరం ప్రభుత్వ భూములు, భూసేకరణ జరిగిన ప్రాంతాలు, ఇతర ప్రత్యేక భూములను గుర్తించి వేరు చేస్తున్నామని వివరించారు. తరువాత మాత్రమే వ్యవసాయ భూములు, రైతుల వ్యక్తిగత భూములను క్షేత్రస్థాయిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేస్తామని తెలిపారు. సర్వే ప్రక్రియను ఆధునిక యంత్రాల సహాయంతో పూర్తి స్థాయిలో కొలిచి సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. గతంలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు లేకపోవడం, ఆన్లైన్ ప్రక్రియలో పేర్లు నమోదు కాకపోవడం, రికార్డుల్లో ఉన్న విస్తీర్ణానికి భూమిపై ఉన్న విస్తీర్ణానికి తేడాలు ఉండడం వంటి అనేక సమస్యలు రైతులు ఎదుర్కొన్నారని తెలిపారు. కొంతమందికి తక్కువ విస్తీర్ణం నమోదు కాగా, మరికొందరికి ఎక్కువగా నమోదైన సందర్భాలు కూడా ఉన్నాయని, రీ-సర్వే ద్వారా అలాంటి అన్ని లోపాలను సరిచేస్తామని చెప్పారు. గ్రామంలోనీ ప్రతి రైతుకు 48గంటల ముందుగానే నోటీసులు జారీ చేసి, రైతుల సమక్షంలోనే వారి పొలాలను కొలుస్తామని కలెక్టర్ తెలిపారు. రైతులు స్వయంగా తమ భూమి హద్దులను చూపిస్తారని, పక్కనే ఉన్న రైతులను కూడా పిలిచి పంచనామా నిర్వహించి హద్దులను నిర్ధారిస్తామని వివరించారు. సర్వే పూర్తయ్యాక ఎంత విస్తీర్ణం నమోదైందో రైతులకు అక్కడికక్కడే తెలియజేస్తామని చెప్పారు. భూ రీ సర్వే మొత్తం ప్రక్రియ పూర్తిగా క్షేత్ర స్థాయిలో భూ హక్కుదారిని సమక్షంలో పారదర్శకంగా జరుగుతుందని, రైతుల హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులు అపోహలకు గురికాకుండా అధికారులు అందించే సమాచారాన్ని విశ్వసించి భూ రీ-సర్వే కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. కాకరవాయి, బేతుపల్లి గ్రామాల్లో రీ-సర్వే నిర్వహించిన సందర్భం గుర్తుచేస్తూ, అందుకే ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి పూర్తి వివరాలు తెలియజేస్తున్నామని చెప్పారు. సర్వే అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రకటించి 60 రోజుల గడువు ఇస్తామని, అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించిన తర్వాత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూధార్ కార్డులు జారీ చేస్తామని పేర్కొన్నారు. రీ-సర్వే పూర్తయిన తర్వాత భవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు శాశ్వత భద్రత కలుగుతుందని కలెక్టర్ దివాకర టీఎస్ స్పష్టం చేశారు. ఆనతరం నేలకొండపల్లి మండలం బుద్దారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వీఓ భవనం పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యాక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట నేలకొండపల్లి తహసీల్దారు రాంప్రసాద్, ఎంపిడివో ఎర్రయ్య, గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు, రైతులు తదితరులు ఉన్నారు.

## కరెంట్ షాక్‌తో పొలంలో కుప్పకూలిన రైతు

**మెదక్ జిల్లా మీడియా టుడే ఆగస్టు 5**



మెదక్ జిల్లాలోని ఒక పొలంలో విద్యుత్ షాక్‌కు గురై గోపాల్ (45) అనే రైతు కుప్పకూలిన ఘటన జరిగింది. కోడిపల్లి మండలం నాగసాన్‌పల్లికి చెందిన గోపాల్ పొలంలో పనులు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలింది. ఆయనను వెంటనే మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ

**- సర్పంచ్, ఉప సర్పంచ్ చేతుల మీదుగా పంపిణీ**



**మణుగూరు, ఆగస్టు 5:(మీడియా టుడే):** మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, వార్డు సభ్యురాలు మానస, కళాశాల ప్రిన్సిపాల్ సత్యప్రకాశ్ పాల్గొని విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతుల అభివృద్ధికి చేపట్టిన పనులు విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యతోనే మంచి భవిష్యత్తు నిర్మించుకోవచ్చని, లక్ష్యసాధన కోసం నిరంతరం కృషి చేయాలని ప్రోత్సహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు బాబురావు, సురేష్, కృష్ణ, ఇతర అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సి.పి.ఎం హవేలి కమిటీ ఆధ్వర్యంలో

## ఘనంగా కామ్రేడ్ బోడేపూడి వెంకటేశ్వరరావు 29వ వర్ధంతి సభ

**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**

సిపిఎం హవేలి కమిటీ ఆధ్వర్యంలో అమరజీవి, సిపిఎం మాజీ శాసనసభ పక్ష నాయకులు కామ్రేడ్ బోడేపూడి వెంకటేశ్వరరావు 29వ వర్ధంతి సందర్భంగా స్థానిక బోడేపూడి చౌక్‌లో సంతాప సభను పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం ఖానాపురం హవేలీ కార్యదర్శి దొంగల తిరుపతిరావు అధ్యక్షత వహించారు. ముందుగా కామ్రేడ్ బోడేపూడి వెంకటేశ్వరరావు చిత్రపటానికి సి.పి.ఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వర్లు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేష్ సి.పి.ఎం పార్టీ పతాకావిష్కరణలో చేసినారు బోడేపూడి వెంకటేశ్వరరావు సేవలను స్మరించుకుంటూఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కామ్రేడ్ బోడేపూడి వెంకటేశ్వరంవు తన జీవితమంతా పేదలు, రైతులు, కార్మికులు, శ్రమజీవుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడిన మహోన్నత కమ్యూనిస్టు నాయకుడని కొనియాడారు. శాసనసభలో ప్రజల సమస్యలను నిర్భయంగా ప్రస్తావించి ప్రజల తరఫున గళమెత్తిన నాయకుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. నేటి తరం ఆయన ఆశయాలను, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ప్రజా సమస్యల పరిష్కారం కోసం మరింత సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు మెరుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు పిన్నింటి రమ్య, ఉత్తర దక్షిణ ఏరియా శాఖ కార్యదర్శులు సత్తెనపల్లి శ్రీను, కందాల వికాస్ రెడ్డి, యువజన సంఘం జిల్లా కార్యదర్శి బొడ్డు మధు, ప్రముఖ లాయర్లు ఏడునూతల శ్రీనివాసరావు, జక్కంపూడి నాగేశ్వరరావు, హవేలీ కమిటీ సభ్యులు కత్తుల అమరావతి, ఎల్లావుల రమ, పందుల నాగమణి, తాళ్లపూడి మంగమ్మ, పోతురాజు వెంకటి, చిలకల వెంకటేశ్వర్లు, కుర్రి వెంకటస్వామి, జట్ల ఆనందరావు, తిప్పర్తి నరసింహ, తోట నాగరాజు, వడ్డేపల్లి నరేంద్ర, గొర్రెముచ్చు నాగేశ్వరరావు, చారు ప్రసాద్, దంతాల నరసింహారావు, శాఖ కార్యదర్శులు చల్ల మహేష్,



మాజీ హవేలీ కార్యదర్శి ధనియాకుల నాగేశ్వరరావు, వేదగిరి మురహరి, కర్ల వీరస్వామి, సీనియర్ నాయకులు పెద్ది నాగయ్య, యలమర్థి నారాయణరావు, దంతాల కేశవులు, బొగ్గరపు పాపారావు, మచ్చ భాస్కరరావు, నాయకుడు కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కామ్రేడ్ బోడేపూడి వెంకటేశ్వరరావుకు ఘన నివాళు లర్పించారు.

## ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్‌లో రాష్ట్రంలో అగ్రస్థానంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

**99 శాతం ప్రక్రియ పూర్తి అశ్వారావుపేట, భద్రాచలం నియోజకవర్గాల్లో వంద శాతం నమోదు**

**ఆగస్టు 10 నాటికి పూర్తి స్థాయిలో ఎన్యూమరేషన్ పూర్తి చేస్తాం కలెక్టర్ అంకిత్**



**కొత్తగూడెం, ఆగస్టు 5 వినోద్ మీడియా టుడే**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమం అమలులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ అంకిత్ వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 99 శాతం ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తికాగా, అశ్వారావుపేట, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాల్లో వంద శాతం నమోదు పూర్తయినట్లు తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో కలెక్టర్ అంకిత్, జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ పాల్గొని కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. జిల్లాలో మిగిలిన ఓటర్లను గుర్తించి ఆగస్టు 10 నాటికి ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తిస్థాయిలో ముగిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో నమోదైన మరణాలు, నివాస మార్పులు, డూప్లికేట్ నమోదులు తదితర వివరాలను పోలింగ్ కేంద్రాల వారీగా అన్ని రాజకీయ పార్టీలకు అందజేస్తామని తెలిపారు. వాటిని రాజకీయ పార్టీలు పరిశీలించి ఏవైనా తప్పులు లేదా లోపాలు గుర్తిస్తే వెంటనే తెలియజేయాలని కోరారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగేందుకు రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు అందని అర్హులైన వారు ఆగస్టు 10 తర్వాత ఫారం-6 ద్వారా కొత్త ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 2002కు సంబంధించిన ఆధారాలు లేని వారు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ప్రకారం అవసరమైన ధ్రువీకరణ అనంతరం ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఎన్యూమరేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు బీఎల్ఏలు, బూత్ లెవల్ అధికారులు బీఎల్వోలు, ఎన్నికల సిబ్బంది, అధికారులను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశం అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వై. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పూర్తిగా ఏజెన్సీ ప్రాంతాలతో కూడిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 99 శాతం ఎన్యూమరేషన్ పూర్తి చేయడం, అశ్వారావుపేట, భద్రాచలం నియోజకవర్గాల్లో వంద శాతం నమోదు పూర్తి చేయడం జిల్లా యంత్రాంగం సమర్థతకు నిదర్శనమన్నారు. ఈ విజయానికి కృషి చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్, జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్‌తో పాటు ఎన్నికల అధికారులను కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ తరఫున అభినందించారు. సమావేశంలో ఎస్ఐఆర్ జిల్లా ఇన్‌చార్జి రంగప్రసాద్, ఎన్నికల ఐటీ అధికారి నవీన్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి పూనెం శ్రీనివాస్, సీపీఎం నాయకుడు బాలరాజు, బీజేపీ నాయకుడు సాయి కృష్ణ, ఆప్ పార్టీ ప్రతినిధి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## వేధింపులపై భయపడొద్దు..

**షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయండి**

**తూప్రాన్‌లో విద్యార్థినులకు షీ టీమ్స్ అవగాహన కార్యక్రమం**

**మెదక్ జిల్లా మీడియా టుడే ఆగస్టు 5:**

మహిళలు, బాలికల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, వేధింపులు ఎదురైతే భయపడకుండా వెంటనే షీ టీమ్స్ లేదా పోలీసులను ఆశ్రయించాలని షీ టీమ్స్ సిబ్బంది స్వరూప సూచించారు. బుధవారం తూప్రాన్‌లోని మాస్టర్ మైండ్స్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. మహిళలు, బాలికలపై జరిగే వేధింపులు, ఈవ్‌టీజింగ్, అసభ్యకర ప్రవర్తనను అరికట్టేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. విద్యార్థినులు తమకు ఎదురయ్యే ఇబ్బందులను దాచిపెట్టకుండా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు వంటి సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. గుర్తు తెలియని లింకులను క్లిక్ చేయకుండా సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మహిళలు,




బాలికలకు ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యం లేదా పోలీసులను సంప్రదించాలని, షీ టీమ్స్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

**కలెక్టర్ అంకిత్- మానిటరింగ్ కమిటీ సమావేశంలో కేసుల పురోగతిపై సమీక్ష**

**భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్టు 5:(మీడియా టుడే):**

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీ) చట్టం కింద నమోదైన కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రోహిత్ రాజుతో కలిసి నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2014 నుంచి 2026 జూలై వరకు జిల్లాలో మొత్తం 1,104 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. వీటిలో 908 కేసులు నిజమైనవిగా నిర్ధారణ కాగా, 859 కేసుల్లో చార్జిషీట్లు దాఖలయ్యాయని చెప్పారు. ప్రస్తుతం 49 కేసులు దర్యాప్తు దశలో, 472 కేసులు కోర్టు విచారణలో ఉన్నాయని వెల్లడించారు. దర్యాప్తులో ఉన్న ప్రతి కేసును నాణ్యతతో పూర్తి చేసి చట్టపరమైన గడువులోపు చార్జిషీట్లు దాఖలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అందించే పరిహారం, పునరావాసం, న్యాయ సహాయం సకాలంలో బాధితులకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ, మండల స్థాయిలో ఎస్సీ, ఎస్టీ హక్కులు, అట్రాసిటీ నిరోధక చట్టంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రోహిత్ రాజు మాట్లాడుతూ, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదైన కేసుల్లో అధిక శాతం బాధితులకు ప్రభుత్వం నిర్ణయించిన మూడు దశల పరిహారం అందించామని వివరించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులతో పాటు పోక్సో కేసులను కూడా ప్రాధాన్యతతో విచారిస్తున్నామని చెప్పారు. మహిళలు, బాలల రక్షణ, పోక్సో చట్టం, సైబర్ నేరాల నివారణపై గ్రామాలు, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్‌డీఓ మధు, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి శ్రీలత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్



తుకారాం రాథోడ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వెల్దుర్తిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి

### ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేసిన గ్రామస్తులు



**మెదక్ జిల్లా మీడియా టుడే ఆగస్టు 5:**
వెల్దుర్తి మండలంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు.శివంపేట్ మండలంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేను కలిసి, వెల్దుర్తి మండల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రావాలంటే తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను వెల్దుర్తిలోనే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి స్పందిస్తూ, "వెల్దుర్తి మండలానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు కోసం నా వంతు 100కు 100 శాతం కృషి చేస్తాను. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పాఠశాల ఏర్పాటుకు పూర్తి సహకారం అందిస్తాను" అని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే హామీపై గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండలానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిజి. కళాశాల దోస్త్ ప్రవేశాల్లో మిగిలిన ఖాళీలు 66-ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.రామ్ మోహన్ రెడ్డి




**నిజామాబాద్ ( మీడియా టుడే ) ఆగస్ట్ 05...**
నిజామాబాద్ నగరంలోని జి.జి. కళాశాలకు కేటాయించబడిన 1860 సీట్లకు గాను,బుధవారం నాటికి 1794 మంది విద్యార్థులు తుది ప్రవేశం పొందారని,కేవలం 66 ఖాళీలు మాత్రమే ఏర్పడ్డాయనీ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.రామ్ మోహన్ రెడ్డి తెలిపారు. గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో ఇప్పటివరకు వివిధ కోర్సులలో మిగిలిన ఖాళీల వివరాలు ప్రిన్సిపాల్ తెలియజేశారు. బి.ఏ. 09,ఉపాధి ఆధారిత(ఏఈడీపీ) కోర్సులు బీకాం విభాగంలో బీ.ఎఫ్.ఎస్.ఐ. 02,సైన్స్ విభాగంలో హెల్త్ కేర్ మేనేజ్ మెంట్ 08,డిజిటల్ ఎలక్ట్రానిక్స్ కోర్సుల్లో 03,ఈ మూడు (ఏఈడీపీ) కోర్సుల్లో మొత్తం 180 సీట్లకు గాను 13 ఖాళీలు మిగిలినవి. బి.కాం.లో ఫినాన్స్ 01,టాక్సేషన్ 02, అనాలైటిక్స్ 04, బి.బి.ఏ.02, మొత్తం 480 కి గాను 09 ఖాళీలు మిగిలినవి.బీఎస్సీ లైఫ్ సైన్స్ లో 21, ఫిజికల్ సైన్స్ 10, హానర్స్ 04, మొత్తం బీఎస్సీలో 720 గాను 35 ఖాళీలు మిగిలినవి. బుధవారం నాటికి 1794 మంది విద్యార్థులు తుది ప్రవేశంపూర్తి పొందారు.ఆగస్టు 06వ తేదీ నుండి మొదలయ్యే స్పెషల్ ఫేజ్ అడ్మిషన్స్ కోసం దోస్త్ లో ఖాళీల వివరాలను బట్టి విద్యార్థులు అప్లై చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్ రంగరత్నం, అడ్మిషన్ కన్వీనర్లు రమేష్ గౌడ్, రామస్వామి, దండు స్వామి, వినయ్ కుమార్, రంజిత, ఉమాకిరణ్,జయ ప్రసాద్,నహీదా బేగం,రాజేశ్, రామక్రిష్ణ,కిరణ్ కుమార్ గౌడ్, అధ్యాపకులు,సాంకేతిక సహాయకులు శ్రీకాంత్,నాగరాజు, మోబినొద్దీన్, గంగాధర్,విజయ, వివేకానంద, రాము,నరేష్ కుమార్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యమన్న మైత్రి ఫౌండేషన్ వైస్ చైర్మన్ చెన్నంశెట్టి మౌనిక

### మేడాలమ్మ ఆలయంలో మహిళల సందడి



**సంగారెడ్డి జిల్లా, మీడియా టుడే బ్యూరో, ఆగస్టు 5.**
ఆషాఢ మాసం సందర్భంగా మహిళల ఆధ్యాత్మికత, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గోరింటాకు పండుగను మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నల్లవల్లి పరిధిలోని మేడాలమ్మ దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై గోరింటాకు పెట్టించుకుని సంప్రదాయ వస్త్రధారణలో పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకుని కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల కోసం ప్రార్థనలు చేశారు.మైత్రి ఫౌండేషన్ వైస్ చైర్మన్ చెన్నంశెట్టి మౌనిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు సంప్రదాయ పద్ధతిలో గోరింటాకు పెట్టించుకోవడంతో పాటు ఆషాఢ మాస విశిష్టతను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం మహిళల సందడితో కళకళలాడింది.ఈ సందర్భంగా చెన్నంశెట్టి మౌనిక మాట్లాడుతూ, తెలుగు సంస్కృతి, ఆచార సంప్రదాయాలను భావితరాలకు చేరవేయాలనే సంకల్పంతో మైత్రి ఫౌండేషన్ నిరంతరం సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఆధునిక జీవనశైలిలో కనుమరుగవుతున్న సంప్రదాయాలను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని, అలాంటి వేడుకలు మహిళల్లో ఐక్యతను, కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం తెలుగు సంప్రదాయంలో విశిష్ట స్థానాన్ని కలిగి ఉందని, ఇది కేవలం ఆచారం మాత్రమే కాకుండా మహిళల ఆనందం, ఆత్మీయత, కుటుంబ సౌభ్రాతృత్వానికి ప్రతీక అని అన్నారు. భవిష్యత్ తరాలకు మన సంస్కృతి గొప్పదనాన్ని పరిచయం చేయాలంటే ఇటువంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు మైత్రి ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇలాంటి సంప్రదాయ కార్యక్రమాలు ప్రతి సంవత్సరం నిర్వహించాలని కోరారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువతులు, ఫౌండేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఛాతీ వ్యాధుల శస్త్రచికిత్సలో 'మినిమల్లీ ఇన్వాసివ్ థొరాసిక్ సర్జరీ

### యశోద హాస్పిటల్స్ థొరాసిక్ సర్జన్ డాక్టర్ సి.రోహన్ రెడ్డి




**నిజామాబాదు ఆగష్టు 5 (మీడియా టుడే ప్రతినిధి):**
ఊపిరితిత్తులు, అన్నవాహిక, ఛాతి మధ్య భాగం (మీడియాటినం ), దయాఫ్రేమ్,ఛాతీ గోడకు వచ్చే వ్యాధులను గుర్తించి చికిత్స చేయడానికి సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ అత్యాధునిక విదానాలను ఉపయోగిస్తోందని యశోద హాస్పిటల్స్ దొరాసిక్ సర్జన్ డాక్టర్ సి.రోహన్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మినిమల్లీ ఇన్వాసివ్, రోబోట్ సహాయంతో చేసే సర్జరీల ద్వారా మెరుగైన వైద్యం అందిస్తోందన్నారు.ఊపిరితిత్తుల క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్, ఛాతీలో కణితులు వంటి వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెరుగుతోందని, వ్యాధిని త్వరగా గుర్తించడం వల్ల పేషంట్ల కు మరింత సురక్షితమైన ఆపరేషన్లను ఆసుపత్రి అందిస్తోందన్నారు . దీని ద్వారా ఖచ్చితమైన చికిత్స లబించడమే కాకుండా, పేషెంట్లు త్వరగా కోలుకొని ఆరోగ్యంగా ఇంటికి వెళుతున్నరన్నారు. థొరాసిక్ సర్జరీ అంటే గుండెను మినహాయించి, చాతీలో వచ్చే ఇతర వ్యాధులకు చేసే ప్రత్యేకమైన ఆపరేషన్, కొన్ని క్లిష్టమైన సమస్యలకు చాతీని పూర్తిగా తెరిచి చేసే ఓపెన్ సర్జరీ తప్పనిసరి అయినప్పటికీ, ఇప్పుడు ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయన్నారు.వీడియో కెమెరా సాయంతో చేసే సర్జరీ (వాట్స్ ), రోబోట్ సహాయంతో చేసే సర్జరీ (రాట్స్ ) వంటి పద్ధతుల ద్వారా కేవలం ఒక చిన్న రంధ్రం లేదా కోతతో ఆపరేషన్లు చేస్తున్నారన్నారు . వీటివల్ల పేపింట్లకు సర్జరీ కోత, నొప్పి చాలా తక్కువగా ఉంటాయని,. ఆసుపత్రిలో ఎక్కువ రోజులు ఉండాల్సిన అవసరం కూడా ఉండదన్నారు .పేషేంట్లు చాలా త్వరగా తమ పనులు తాము చేసుకోగలుగుతారన్నారు . డాక్టర్లు కూడా చుట్టుపక్కల ఉండే అవయవాలకు ఎలాంటి హాని కలగకుండా చాలా ఖచ్చితత్వంతో ఈ ఆపరేషన్ చేయగలుగుతున్నరన్నారు . గత పదేళ్లలో చాతీ సర్జరీల్లో ఎన్నో మార్పులు వచ్చాయని ఈరోజుల్లో చిన్న కోతతో లేదా రోబోట్ సహాయంతో ఆపరేషన్లు చేస్తున్నామన్నరు. దీనివల్ల సంక్లిష్టమైన సమస్యలకు కూడా శరీరానికి పెద్దగా ఇబ్బంది కలగకుండా ఖచ్చితంగా చికిత్స చేయగలుగుతున్నాం అని చెప్పారు. వ్యాధిని ముందుగానే గుర్తించడం ఆధునిక సర్జరీ నైపుణ్యాలు అన్ని విభాగాల వైద్యులు కలిసి క్యాన్సర్ కు వైద్యం చేయడం వల్ల పిషేంట్లకు అత్యుత్తము చికిత్స అందుతోందన్నారు.వారు త్వరగా కోలుకొని సాధారణ జీవితం గడపగలుగుతున్నారన్నారు.ప్రతి పేషంట్ కు వారి ఆరోగ్యపరిస్థితికి తగ్గట్టుగా ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తూనేతో ప్రేమతో కూడిన వైద్యం అందించడమే మా లక్ష్యం" అని ఆయన వివరించారు.ఆదువాతన ఆపరేషన్ థియేటర్లు, హై-డెఫినిషన్ ఇమేజింగ్ సిస్టమ్స్, రోబోటిక్ సర్జికల్ ప్లాట్ఫారమీలు, థొరాసిక్ సర్జన్లు, పల్మోనాలజిస్టు, ఆంకాలజిస్టు, రేడియాలజిస్టు, అనస్థీషియాలజిస్టలు, క్రిటికల్ కేర్ నిపుణులతో కూడిన మల్టీడిసిప్లేనరీ బృందం మద్దతుతో, యశోద హాస్పిటల్స్ అనేక రకాల థొరాసిక్ చాతి సమస్యలకు సమగ్రమైన చికిత్సను అందిస్తోందన్నారు . ప్రారంభ దశలో ఉన్న ఊపిరితిత్తుల క్యాన్సర్లు,అన్నవాహిక వ్యాధుల నుండి ప్రాణాపాయం లేని ఛాతి కణితులు సంక్లిష్టమైన దాతీ ఎమర్జెన్సీల వరకు, హాస్పిటల్ ఎవిడెన్స్- బేస్డ్, మినిమల్లీ నాసిస్ సర్జికల్ సేవలను నిరంతరం విస్తరిస్తోందన్నారు . పేషింట్లు మెరుగైన భద్రత సౌకర్యంతో మంచి పలితాలను సాదించడంలో సహాయపడుతుందన్నారు.యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ గత మూడు దశాబ్దాలుగా వైవిద్యమైన వైద్య అవసరాలు కలిగిన ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందిస్తోందని,సమర్ధవంతమైన నాయకత్వం బలమైన యాజమాన్యం కింద, యశోద గ్రూప్ అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్య చికిత్సను అందించే 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా ఎదిగిందన్నారు. పేషంట్ల అవసరాలకు అనుగుణంగా, అరుదైన క్లిష్టమైన ప్రక్రియల కోసం సైతం విప్లవాత్మక సాంకేతికతను ఉపయోగిస్తూ, యశోద గ్రూప్ ప్రతి వైద్య విభాగంలోనూ అత్యాధునిక రోగనిర్ధారణ చికిత్సా సేవలను అందిస్తోందన్నారు .ఈ విలేకరుల సమావేశంలో సీనియర్ మేనేజర్ రూపేష్ షిండే, మార్కెటింగ్ మేనేజర్ అమర్నాథ్ మూర్తి లు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తతే రక్షణ

### అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి పిలుపు -'సురక్షా కా తిరంగా'తో నెలరోజుల అవగాహన కార్యక్రమాలు

### సెయింట్ ఆంథోనీ డిగ్రీ కళాశాలలో ప్రారంభం.. విద్యార్థులు సైబర్ అంబాసిడర్లుగా మారాలని పిలుపు :అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి పిలుపు

**సంగారెడ్డి జిల్లా, మీడియా టుడే బ్యూరో, ఆగస్టు 5.**
రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు తెలంగాణ పోలీసు శాఖ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ షికా గోయల్ ఆదేశాల మేరకు ఆగస్టు నెల మొత్తం "సురక్షా కా తిరంగా -- సైబర్ స్వతంత్ర తెలంగాణ" పేరుతో జాతీయ సైబర్ జాగ్రూకత అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు.డిజిటల్ యుగంలో సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో, అదే స్థాయిలో సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని అదనపు ఎస్పీ తెలిపారు. ముఖ్యంగా చదువుకున్నవారే ఎక్కువగా సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుంటుండటం ఆందోళనకర మన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత ఏడాది ఒక్క సంవత్సరంలోనే సైబర్ మోసాల కారణంగా ప్రజలు సుమారు రూ.1,300 కోట్లకు పైగా ఆర్థిక నష్టం చవిచూశారని పేర్కొన్నారు.

**అత్యాశే సైబర్ నేరగాళ్లకు ఆయుధం,**
తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయనే ఆశతో చాలామంది నకిలీ స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్, బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్, క్రిప్టో పెట్టుబడులు, ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో వచ్చే మోసపూరిత ప్రకటనలను నమ్మి డబ్బులు కోల్పోతున్నారని వివరించారు. సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్, ఈ-మెయిల్ ద్వారా పంపించే లింకులను క్లిక్ చేయడం వల్ల బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతున్నాయని హెచ్చరించారు.తెలియని వ్యక్తులు పంపే లింకులు, యాప్‌లు, క్యూ ఆర్ కోడ్‌లు, పెట్టుబడి ఆఫర్లను నమ్మవద్దని సూచించారు. ఓటీపీ, ఏటీఎం పిన్, సీవీవీ నంబర్, బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్, పాన్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు.




**'సైబర్ అంబాసిడర్లుగా' విద్యార్థులు**
కళాశాల విద్యార్థులు సమాజంలో సైబర్ భద్రతకు దూతలుగా వ్యవహరించాలని అదనపు ఎస్పీ పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, గ్రామాల్లోని ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని కోరారు. ప్రజల్లో అవగాహన పెరిగితేనే సైబర్ నేరాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు మూడు రంగుల సందేశాన్ని పోలీసులు వివరించారు.
కాషాయం: ప్రతి ఆన్‌లైన్ లావాదేవీలో అప్రమత్తంగా ఉండాలి. అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు, లింకులను నమ్మకూడదు.తెలుపు: సైబర్ భద్రతపై అవగాహన పెంచుకుని బాధ్యతాయుతంగా డిజిటల్ సేవలను వినియోగించాలి.ఆకుపచ్చ: సురక్షిత పాస్‌వర్డ్‌లు, ద్వి-దశల భద్రత (2ఫీూ), అధికారిక యాప్‌ల వినియోగం ద్వారా డిజిటల్ భద్రతను కాపాడుకోవాలి.ఆగస్టు నెల మొత్తం జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో పాఠశాలలు, కళాశాలలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థల్లో ప్రత్యేక సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అదనపు ఎస్పీ తెలిపారు. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్, స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, ఫేక్ జాబ్ ఆఫర్లు, కేవైసీ అప్‌డేట్ మోసాలు, సోషల్ మీడియా హ్యాకింగ్ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు.సైబర్ సెల్ డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని సూచించారు.అలాగేwww.cybercrime.gov.in పోర్టల్‌లో వెంటనే ఫిర్యాదు నమోదు చేస్తే ఆర్థిక నష్టాన్ని నివారించే అవకాశం ఉంటుందని తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహనే వాటి నివారణకు అత్యంత ప్రభావవంతమైన మార్గమని పేర్కొన్నారుఈ కార్యక్రమంలో సెయింట్ ఆంథోనీ విద్యాసంస్థల వ్యవస్థాపకులు, చైర్మన్ డా. సాల్మన్ రెడ్డి, డిగ్రీ కళాశాల డైరెక్టర్ విజయ్ కుమార్ రెడ్డి, సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, సంగారెడ్డి టౌన్ ఇన్‌స్పెక్టర్ రామునాయుడు, సైబర్ సెల్ అధికారులు, పోలీసు సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నరేంద్ర డిగ్రీ కళాశాలలో ట్రాఫిక్ పై అవగాహన సదస్సు

### -ముఖ్య అతిథిగా ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ



**మీడియా టుడే ప్రతినిధి నిజామాబాద్ జిల్లా ఆగస్టు 5 :**
ఆర్మూర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఆర్మూర్‌లో ని నరేంద్ర డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, రహదారి భద్రత మరియు సురక్షిత డ్రైవింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏసీపీ మస్తాన్ అలీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతో ముఖ్యమని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ వినియోగించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించవద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ఆర్మూర్ ట్రాఫిక్ ఎస్సై రఘుపతి విద్యార్థులకు ట్రాఫిక్ సంకేతాలు, రహదారి భద్రతా నియమాలు, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ మరియు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, ఆర్మూర్ ట్రాఫిక్ పోలీసు సిబ్బంది తదితరు పాల్గొన్నారు.

## ఘనంగా టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో బోనాల పండుగ

### ముఖ్య అతిథులు గా హాజరైన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

**నిజామాబాదు ఆగష్టు 5 (మీడియా టుడే ప్రతినిధి):**
టీఎన్జీవోల ఆధ్వర్యంలో పాత కలెక్టరేట్ లో ఘనంగా బోనాల పండుగను బుధవారం నిర్వహించారు.ఈ బోనాల వేడుకల్లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనమెత్తి అమ్మవారికి సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రాన్ని సుభిక్షంగా ఉంచాలని అమ్మవారిని కోరినట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి,, సాంప్రదాయాలకు ప్రతీకగా ప్రతి ఆషాడ మాసంలో అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీ వస్తుందన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ పాల్గొని భక్తులతో కలిసి బోనాల వేడుకల్లో సందడి చేశారు.అనంతరం టీఎన్జీవోస్ ప్రతినిధులు మహేష్ కుమార్ గౌడ్ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కేశ వేణు,శేఖర్ గౌడ్, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్,డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి,రామకృష్ణ, దయాకర్ గౌడ్, టీఎన్జీవోస్ అధ్యక్షులు సుమన్ కుమార్,కార్యదర్శి శేఖర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,స్థానిక ప్రజాప్రతినిధులు, టీఎన్జఓఎస్ ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## చేయూతే...! చైతన్యం..!! అంగవైకల్యుడికి ఎలక్ట్రిక్ వీల్‌చైర్ బహుకరణ

మిత్రుల మానవత్వం.. అంగవైకల్యుడి జీవితంలో కొత్త వెలుగు...

మస్కులర్ డిస్ట్రోఫీతో మంచానికే పరిమితమైన యువకుడికి ఎలక్ట్రిక్ వీల్‌చైర్ బహుకరణ

సీఐ సైదులు గౌడ్ ఆధ్వర్యంలో మిత్రుల సేవా కార్యక్రమం.. పలువురి ప్రశంసలు.



**కోదాడ ఆగస్టు 05 (మీడియా టుడే)–:**
సమాజంలో మానవత్వం ఇంకా సజీవంగానే ఉందని మరోసారి నిరూపించిన సంఘటన సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం మంగళకుంట తండాలో చోటుచేసుకుంది. మస్కులర్ డిస్ట్రోఫీ (నరాల బలహీనత) వ్యాధితో బాధపడుతూ కదలలేని స్థితిలో ఉన్న ఓ ఉన్నత విద్యావంతుడికి మిత్రులందరి సహకారంతో ఎలక్ట్రిక్ వీల్‌చైర్‌ను బహుకరించారు. బాధితుడి పరిస్థితిని తెలుసుకున్న మిత్రులు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి ఎలక్ట్రిక్ వీల్‌చైర్‌ను కొనుగోలు చేశారు. అనంతరం కోదాడ సీఐ సైదులు గౌడ్ ఆధ్వర్యంలో బాధితుడి ఇంటికి వెళ్లి, అందరి సమక్షంలో వీల్‌చైర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ సైదులు గౌడ్ మాట్లాడుతూ, అవసరంలో ఉన్న వారికి చేయూత అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. మిత్రుల సేవాభావం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు నీలం శేఖర్, జైలు వార్డెన్ తిరుమల్ యాదవ్, జేఎల్‌ఎం యాదగిరి, వేముల సైదులు, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీఓకు ఉపాధి హామీ ఉద్యోగుల వినతి

### పెన్‌డౌన్--షట్‌డౌన్‌తో నిరసన

### డిమాండ్లు పరిష్కరించాలని వినతి



**చిన్నంబావి, మీడియా టుడే న్యూస్ ఆగస్టు 5:**
చిన్నంబావిఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ ఉద్యోగులు బుధవారం పెన్‌డౌన్--షట్‌డౌన్ నిరసన చేపట్టారు. రాష్ట్ర, జిల్లా జేఏసీ పిలుపు మేరకు విధులను బహిష్కరించి తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. నిరసనతో కార్యాలయ సేవలు స్తంభించడంతో వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనంతరం ఎంపీడీఓ ఆదర్శ్‌గౌడ్‌కు ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఏపీవో ధనుంజయ రాజు మాట్లాడుతూ.. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, పే స్కేల్ అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను తమకూ వర్తింపజేయాలని కోరారు. జీతాలు సక్రమంగా అందక కుటుంబ పోషణ, పిల్లల చదువుల విషయంలో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈసీ వెంకటేశ్వర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు మేకల గోపాల్, యాదవ్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి రూ.8 వేల ఆర్థిక సాయం

**చిన్నంబావి, మీడియా టుడే న్యూస్ ఆగస్టు 5**



చిన్నంబావి మండలం పెద్దమారూర్ గ్రామానికి చెందిన జల్లి సహదేవుడు (44) అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. సింగిల్ విండో వైస్ ప్రెసిడెంట్ బిళ్లకంటి విద్యాసాగర్‌రావు స్పందించి మృతుడి కుటుంబానికి రూ.8 వేల ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన ఎద్దుల బాలమ్మ (78) మృతి చెందడంతో ఆమె కుటుంబాన్ని కూడా నాయకులు పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేష్ యాదవ్, కే. లక్ష్మయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు హనుమంతరావు, వార్డు సభ్యులు పురేందర్ నాయుడు, మాజీ వార్డు సభ్యులు గడ్డం నరహరి, గడ్డం నరసింహ, దాసరి వెంకటస్వామి, వాల్మీకి సంఘం అధ్యక్షుడు పసుల రాజ్‌కుమార్, మాజీ సర్పంచ్ కల్వకోల్ ఉసేన్నయ్య, కృపేందర్ నాయుడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ జంగమ ధూప దీప నైవేద్య అర్చకుల ఆత్మీయ సమ్మేళనం



**ఆలేరు ఆర్సీ, మీడియా టుడే, ఆగస్టు 05:**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని యాత్రనివాస్ ప్రాంగణంలో తెలంగాణ వీరశైవ జంగమ ధూప దీప నైవేద్య అర్చకుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సదా నిరంజన్ సిద్ధాంతి, గొంగళ్ళ మఠం శివప్రసాద్ సిద్ధాంతి, మాట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా వీరశైవ జంగమ ధూప దీప నైవేద్య అర్చకులకు అందాల్సిన సంపూర్ణ సంక్షేమ పథకాలు అందేలా సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అర్చకుల సంక్షేమం, దేవాలయాల్లో సేవల నిర్వహణ, సామాజిక భద్రత, ఆర్థిక పరిరక్షణ, ప్రభుత్వ గుర్తింపు వంటి అంశాలపై పలువురు తమ అభిప్రాయాలను వెల్లడించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వీరశైవ జంగమ ధూప దీప నైవేద్య అర్చకులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సంఘటితంగా సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని, ప్రభుత్వం దృష్టికి అర్చకుల న్యాయమైన డిమాండ్లను తీసుకెళ్లాలని సమావేశంలో సూచించారు. అర్చకుల అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై పలు సూచనలు, సలహాలు స్వీకరించి వాటిని అమలు చేసే దిశగా ముందుకు సాగాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో తిప్పయ్య స్వామి,పరమేశ్వర, సోమయ్య,తదితరులు రాష్ట్రంలోని నలుమూలల నుండి జంగమ అర్చకులు, తదితరులు, పాల్గొన్నారు.

# పక్కా ఓటర్ల జాబితాయే లక్ష్యం

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట జిల్లా మీడియా టుడే, స్టాఫ్ రిపోర్టర్: ఆగస్ట్ 05.**
ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ఆర్డీవో, తహసీల్దార్‌తో పాటు బీఎల్ఓ సూపర్‌వైజర్లు, బీఎల్ఓలతో కలెక్టర్ బుధవారం సూర్యాపేట మండల కేంద్రంలో సూర్యపేట తహసిల్దార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.? ఎన్యూమరేషన్ ఫారాల క్షేత్రస్థాయి పరిశీలన సమావేశంలో ప్రధానంగా ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ, డేటా నమోదుపై క్షుణ్ణంగా సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చిన ఫారాలను క్షేత్రస్థాయిలో రీ-వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా అన్ కలెక్టెడ్ ఫారాలకు సంబంధించి ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్ కేటగిరీల వారి వివరాలను పక్కాగా నిర్ధారించుకోవాలని చెప్పారు. ఎక్కడైనా డూప్లికేట్ ఓట్లు లేదా ఒకే రకమైన సమాచారం నమోదై ఉంటే వాటిని వెంటనే గుర్తించి సరి చేయాలని ఆదేశించారు. సవరణ ప్రక్రియకు గడువు పొడిగించినందున లభించిన కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఏ ఒక్క అర్హుడి ఓటు మిస్ కాకుండా, ఎలాంటి తప్పుల్లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేసే బాధ్యత బీఎల్ఓలు, సూపర్‌వైజర్లపై ఉందన్నారు. కలెక్టరేట్ అధికారులు సైతం మండలాల వారీగా డేటాను క్రాస్ చెక్ చేస్తున్నారని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారంలో డిక్లరేషన్ ఇచ్చేటప్పుడు ఒక్క చోటే దరఖాస్తు చేస్తున్నాం అని సంతకం చేస్తారని గుర్తుచేశారు. ఒకవేళ కావాలని డూప్లికేట్ ఫారాలు సమర్పించినా, తప్పుడు వివరాలు ఇచ్చినా వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వేణుమాధవ్ రావు, తాసిల్దార్ సాయి గౌడ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆక్స్‌ఫర్డ్ ఇంటర్నేషనల్ స్కూల్‌పై ప్రభుత్వ భూముల ఆక్రమణ ఆరోపణలు

### సమగ్ర సర్వే, విచారణ చేపట్టాలని తహసీల్దార్‌కు వినతి

### నో యువర్ రైట్స్ సొసైటీ అధ్యక్షుడు, అడ్వకేట్ ఎస్. ఉమేష్ కుమార్



**బాపట్ల కృష్ణమోహన్,మీడియా టుడే,ఆగస్టు 5:**
మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కీసర మండలం దమ్మాయిగూడ బాలరెడ్డి నగర్‌లో ఉన్న ఆక్స్‌ఫర్డ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఉండవచ్చనే ఆరోపణలపై సమగ్ర సర్వే నిర్వహించి విచారణ చేపట్టాలని నో యువర్ రైట్స్ సొసైటీ అధ్యక్షుడు, అడ్వకేట్ ఎస్. ఉమేష్ కుమార్ కీసర మండల తహసీల్దార్ (మండల రెవెన్యూ అధికారి)కి బుధవారం లిఖితపూర్వకంగా వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం, దమ్మాయిగూడ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 472, 474, 476, 486, 487, 493 మరియు 494లకు సంబంధించిన భూముల రికార్డులను పరిశీలించి, వాటి వర్గీకరణ, యాజమాన్యం, హద్దులు, విస్తీర్ణాన్ని అధికారిక రికార్డుల ఆధారంగా ధృవీకరించాలని కోరారు. అలాగే సంబంధిత సర్వే నంబర్లలో మండల సర్వేయర్ ద్వారా క్షేత్రస్థాయిలో భౌతిక సర్వే నిర్వహించి, అవసరమైతే సంబంధిత పక్షాలకు నోటీసులు జారీ చేసి, ప్రభుత్వ భూమి ఏదైనా అక్రమంగా ఆక్రమించబడిందా, అభివృద్ధి చేయబడిందా లేదా వినియోగించబడుతోందా అనే అంశాలను సమగ్రంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. విచారణ అనంతరం ప్రతి సర్వే నంబర్‌కు సంబంధించిన వర్గీకరణ, ప్రభుత్వ భూమి విస్తీర్ణం, ఆక్రమణ జరిగినట్లయితే దాని పరిమాణం, ఆక్రమణ స్వరూపం, బాధ్యుల వివరాలతో కూడిన సమగ్ర నివేదిక తయారు చేయాలని కోరారు. ఒకవేళ విచారణలో ప్రభుత్వ భూమిపై అక్రమ ఆక్రమణ జరిగినట్లు తేలితే, తెలంగాణ భూ చట్టాల ప్రకారం ఆక్రమణ తొలగింపు, ప్రభుత్వ భూమి పునరుద్ధరణ, అవసరమైతే జరిమానాలు మరియు ఇతర చట్టపరమైన చర్యలు వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత రెవెన్యూ రికార్డులను భద్రపరచి, ఎటువంటి మార్పులు, చేర్పులు లేదా ధ్వంసం జరగకుండా చర్యలు తీసుకోవాలని కూడా కోరారు. ఈ వినతిపత్రం ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వ భూముల రక్షణ కోసం మాత్రమే సమర్పించబడిందని, ఇందులో చేసిన ఆరోపణలు సంబంధిత అధికారుల ద్వారా అధికారిక రికార్డులు మరియు క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా స్వతంత్రంగా నిర్ధారించుకోవాలని ఉమేష్ కుమార్ తెలిపారు. విషయాన్ని అత్యవసరంగా పరిగణించి చట్టబద్ధమైన విచారణ చేపట్టి, తీసుకున్న చర్యల వివరాలను తెలియజేయాలని తహసీల్దార్‌ను కోరినట్లు ఆయన పేర్కొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ఆలేరు ఆర్సీ, మీడియా టుడే, ఆగస్టు 05:**
యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం గౌరాయిపల్లి గ్రామంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య విస్తృతంగా పర్యటించారు. గ్రామంలో ఉదయం మార్నింగ్ వాక్ నిర్వహిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను శ్రద్ధగా విన్న ఆయన, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. నాణ్యతతో పాటు నిర్ణీత గడువులోపు ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రెండవ విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆలేరు నియోజకవర్గానికి రెండవ విడతలో అత్యధికంగా ఇళ్ల మంజూరుకు ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. గ్రామాభివృద్ధి కోసం అవసరమైన రహదారులు, తాగునీటి సౌకర్యం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని తెలిపారు. తదుపరి గ్రామ చేనేత సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. చేనేత రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, చేనేత కార్మికుల సంక్షేమానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గౌరాయిపల్లి గ్రామంలో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలోని చెరువులను నీటితో నింపేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతోందని, గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఆలేరు నియోజకవర్గాన్ని తెలంగాణలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు సమష్టిగా పనిచేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఆలేరు నియోజకవర్గానికి ప్రాధాన్యం కల్పించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, ప్రతి అర్హ కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు.

## ఆలేరు మున్సిపాలిటీలో తైబజార్ వేలం పాట ఆలోచనను విరమించుకోవాలి

### సిపిఎం పట్టణ నాయకులు మోరీగాడి రమేష్

**ఆలేరు ఆర్సీ, మీడియా టుడే, ఆగస్టు05:**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీ పాలకవర్గం గత వారంలో జరిగిన సమావేశంలో ప్రజలకు భారమైనటువంటి కొన్ని నిర్ణయాలు తీసుకోవడాన్ని సిపిఎం పార్టీ వ్యతిరేకిస్తూ బుధవారం రోజు మున్సిపల్ కార్యాలయం ముందు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోరీగాడి రమేష్ మాట్లాడుతూ ఆలేరు మున్సిపాలిటీ పాలకవర్గం సమావేశంలో పట్టణంలో కచ్చ కాలువలు తీయడం కోసం అదేవిధంగా మోరీలు నుండి మురుగును తీయడం కోసం జెసిబిని కొనుగోలు చేయాలని అదే విధంగా ఆలేరు మున్సిపాలిటీలో తైబజార్ వేలం వేసి తోపుడు బండ్లు ఫుట్ పాత్ వ్యాపారులు ద్విచక్ర వాహనాలపై కూరగాయలు లాంటి వస్తువులు అమ్ముకునే వారి నుండి డబ్బులు వసూలు చేయాలని నిర్ణయించడం మానుకోవాలని వారు అన్నారు. ఆలేరు మున్సిపాలిటీకి ఆదాయం పెంచుకునే మార్గాలు అనేకం ఉన్నప్పటికీ అధికారులు మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే అంశాలను విడిచి పేదలపై భారం పడే విధంగా వేలంపాట నిర్వహించాలని చూడడాన్ని సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. ఆలేరులో ఉన్నటువంటి ప్రైవేటు పాఠశాలలు ఫంక్షన్ హాల్స్ లో మున్సిపల్ చట్టానికి అనుగుణంగా పన్నులు వసూలు చేస్తే లక్షలాది రూపాయల ఆదాయం పెరుగుతుందని అలా కాకుండా పేదలపై భారం పడేవిధంగా ఆలోచనలను నిర్మించుకోవాలి అని అన్నారు. గత కొన్ని రోజులుగా అనేక వివాదాలకు కారణమైన ఒక ప్రైవేట్ స్కూలు విషయంలో ఉన్నతాధికారులు కల్పించుకొని కొలతలు వేసి పన్నులు వసూలు చేయడం వలన ఒక్క ప్రైవేట్ స్కూల్ నుండి 2 లక్షల రూపాయల ఆదాయం మున్సిపాలిటీకి పెరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంతేకాకుండా ఆలేరు మున్సిపాలిటీ ఏర్పడినప్పుడు అప్పటివరకు పన్నులు కడుతున్నటువంటి అన్ని ఇండ్లను ఆన్లైన్ చేయడంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల వందలాది ఇండ్లు ఆన్లైన్ ఎక్కక పోవడం వల్ల పన్నులు కట్టలేని పరిస్థితిలో ఉన్నారని ఆలేరు పట్టణంలో దాదాపుగా 150 నుండి 200 ఇండ్లకు పన్నులు రావడం లేదని ఇంటి యజమానులు క్రయవిక్రయాల కోసం అనేకమైన అవస్థలు పడుతున్నారని 20 సంవత్సరాలుగా పన్ను కడుతున్నాం మా ఇల్లు మున్సిపాలిటీలో ఎక్కించమని కోరినప్పటికీ కూడా అధికారులు స్పందించడం లేదని అధికారుల నిర్లక్ష్యం వల్ల మున్సిపాలిటీకి వచ్చే ఆదాయాన్ని గండిపడుతుందని అన్నారు. అదేవిధంగా ఆలేరు మున్సిపాలిటీకి కచ్చ కాలవలు తీయడం కోసం అదేవిధంగా మురుగు కాలువలను శుభ్రం చేయడం కోసం జెసిబి కొనుగోలు చేయడం ప్రజలపై భారం పడుతుందని ఈ ఆలోచన వెంటనే విరమించుకోవాలని అన్నారు. దాదాపు 50 లక్షల రూపాయలు జెసిబికి రచించడం వలన ఆలేరు మున్సిపాలిటీలో ఎన్ని వందల మీటర్ల కచ్చా కాలువ ఉంది ఎన్ని మీటర్ల మోరిలు జెసిబి తో పూడిక తీయడం కోసం అణువుగా ఉన్నాయో మున్సిపల్ కమిషనర్ ఒకసారి పరిశీలన చేయాలని అన్నారు. ఆలేరు మెయిన్ రోడ్డుపై దుమ్ము ధూళితో దాదాపుగా 2, 3, 4,5,6 వార్డుల ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని షాపుల సముదాయంలో దుమ్ము వచ్చి అనేకమైనటువంటి ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని దాని



పరిష్కారం కోసం మెయిన్ రోడ్డు పై ఇరువైపులా ఫుట్పాత్ ఏర్పాటు చేసి బీటీ రోడ్డు వేయాలని అప్పుడు మెయిన్ రోడ్డు పైన దుమ్ము రాకుండా ఉంటుందని అదేవిధంగా వర్షాకాలంలో నీరు నిలబడడం వలన మెయిన్ రోడ్డు అనేక చోట్ల చెరువును తలపిస్తుందని దీనికి శాశ్వత పరిష్కారంగా ఇరువైపులా ఫుట్పాత్ ఏర్పాటు చేసి బీటీ రోడ్డు వేయాలని వారి డిమాండ్ చేశారు. ఆలేరు మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుండి మౌలిక వసతులు కల్పించడంలో ఘోరంగా విఫలమై ఉందని మున్సిపాలిటీలో ఉన్న డబ్బులు మొదటి ప్రాధాన్యత మౌలిక వసతులు కల్పన మురుగు కాలువలు సిసి రోడ్లు లాంటి వాటికి ఉపయోగించాలని రెండో ప్రాధాన్యతలో జెసిబి లాంటి యంత్రాల కొనుగోలును చేయాలని వారు ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి తెలియజేశారు. టై బజార్ వేలాన్ని వెంటనే ఆపకపోతే పట్టణంలో ఉన్నటువంటి చిరు వ్యాపారులందరి సమీకరించి మునిసిపల్ కార్యాలయాన్ని దిగ్బంధనం చేస్తామని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు. సమస్యలతో కూడిన మెమొరాండాన్ని కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిపిఎం వడ్డేమాన్ బాలరాజు ఘనగాని మల్లేష్ మోరిగాడి అశోక్ మోరీగాడి అంజయ్య ఘనగాని రాజు డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు యాసారపు ప్రసాద్ బర్ల సిద్దులు ఎండి ఖలీల్ ఘనగాని కిష్టయ్య ఎండి మతిన్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లాపురం అంగన్వాడి లో తల్లిపాల వారోత్సవాలు



**ఆలేరు ఆర్సీ, మీడియా టుడే, ఆగస్టు05:**
యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మల్లపురం గ్రామంలో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా అంగన్వాడి టీచర్ జీడిమెట్ల మంజుల అధ్యక్షన బుధవారం రోజు జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ మూల్యాంక పాల్గొని మాట్లాడుతూ గ్రామంలో ఉన్న గర్భిణీ స్త్రీలకు మరియు బాలింతలకు తల్లిపాలు పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు ఇవ్వాలని ఆపరేషన్ అయిన తల్లులు గానీ నార్మల్ అయిన తల్లులు గాని గంటలోపు ముర్రుపాలు ఇవ్వాలని హాస్పిటల్ లో డెలివరీ అయినప్పుడు పక్కకు అత్త లేదా అమ్మ ఉంటారు కాబట్టి వాళ్లు తల్లి ముర్రుపాలు కచ్చితంగా పిల్లలకు ఇవ్వాలని డాక్టర్ అంగన్వాడీ టీచర్ తెలపడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఎన్ఎంలు చంద్రకళ, సునీత, ఆశా వర్కర్, నిమ్మల రేణుక, అంగన్వాడి ఆయా రాములమ్మ ,మహిళలు కల్పన, ప్రత్యూష,నాగేశ్వరి , మల్లపురం గ్రామంలో గర్భిణీలు బాలింతలు అత్తలు అమ్మలు కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## ఎల్ నినో ప్రభావాన్ని తట్టుకునే పంటలను వేయాలని రైతులకు చెప్పాలని ట్రాక్టర్ యూనియన్ సభ్యులకు అవగాహన కలిపించిన వ్యవసాయ అధికారులు



**ఆలేరు ఆర్సీ,మీడియా టుడే,ఆగస్టు 05:**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం మరియు గ్రామంలో ఎల్ నినో ప్రభావం వలన ప్రత్యామ్నాయ పంటల పైన మరియు మెట్ట ఆరు తడి పంటలు అనగా కంది పెసర ఆముదం జొన్నలు సజ్జలు కూరగాయలు ఆయిల్ ఫామ్ పంటలను వేసుకోవాల్సిందిగా ఆత్మకూరు(ఎం)ట్రాక్టర్ యజమానులకు వారు కిరాయికి దున్నే ప్రతి రైతులకు మీ పరంగా చెప్పాలని వారికి అవగాహన ఇవ్వాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు(ఎం)ట్రాక్టర్ యూనియన్ సభ్యులు116 మంది , రైతులు పాల్గొనడం జరిగింది.

## "కుట్టు శిక్షణతో మహిళలకు స్వయం ఉపాధి బాట.. ఆర్థిక సాధికారతే లక్ష్యం"



**జగదేవ్ పూర్ : ఆగస్టు5 ,(మీడియా టుడే )**
జగదేవపూర్ మండలం వెంకటాపూర్ (బి.జి) గ్రామంలో మారి సంస్థ, ఆర్‌సెటీ ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ శిక్షణలో 30 మంది మహిళలు పాల్గొని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చెక్కల పరమేశ్వర్ మాట్లాడుతూ మహిళలు నైపుణ్యాలనుపెంపొందించుకుని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మారి సంస్థ మేనేజర్ రావుల రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ, శిక్షణ పొందిన మహిళలకు సిద్దిపేటలో తుది పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి ధ్రువపత్రాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌సెటీ డైరెక్టర్ గేమ్ నాయక్, ట్రైనర్ పద్మ, గ్రామ పెద్దలు, నిర్వాహకులు, శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.

## 108 వాహనంలో మహిళ ప్రసవం

**మీడియా టుడే ప్రతినిధి నిజామాబాద్ జిల్లా ఆగస్టు 5 :**



నిజామాబాద్ జిల్లాలోని జక్రాన్ పల్లి మండలం కలిగోట్ గ్రామానికి చెందిన గర్భిణీ స్త్రీ కమ్మరి సోనిని ప్రసవం కోసం 108 వాహనంలో ఆర్మూర్ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు అధికం కావడంతో దీంతో 108 సిబ్బంది ఈఎంటీ జగదీష్, పైలట్ నరేందర్, చాకచక్యంగా వ్యవహరించి అంబులెన్స్ లోనే సుఖ ప్రసవం చేశారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు. మహిళ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను క్షేమంగా ఆసుపత్రికి తరలించిన 108 సిబ్బందిని వైద్యులు, కుటుంబ సభ్యులు అభినందించి ధన్యవాదాలు తెలియజేశారు.

## మార్దండ పాఠశాలకు లయన్స్ క్లబ్ నుంచి 10 బెంచీల విరాళం

**మీడియా టుడే కామారెడ్డి జిల్లా పిట్లం ఆగస్టు 5**



పిట్లం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మార్దండ ప్రాథమికోన్నత పాఠశాలకు 10 బెంచీలను అందజేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు .అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేశారు. విద్యార్థులు ప్రకృతిని ప్రేమించి మొక్కలను సంరక్షించాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ట్రెజరర్ బాలు, జె సి నారాయణ, డి సి లు సంజీవరెడ్డి, రాజేంద్ర ప్రసాద్, కిషన్, చంద్రశేఖర్, ధన్నరపు సంతోష్, అశోక్ గౌడ్, గ్రామ సర్పంచ్ సాయిలు, గ్రామ కార్యదర్శి రాములు, ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, ఉపాధ్యాయులు రమేష్, దివ్య, మాజీ సర్పంచ్ రామకృష్ణ, సాయిలు పటేల్‌తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ లో ఆఫర్ ఫర్ సేల్ పేరుతో ఎఫ్‌పివో 6.5 ని విక్రయించే యోచనను కేంద్రం ఉపసంహరించుకోవాలి

### ఐసీఈయూ ఆధ్వర్యంలో నిరసన



**సూర్యాపేట జిల్లా మీడియా టుడే, స్టాఫ్ రిపోర్టర్: ఆగస్టు 05.**

ఎల్ఐసి లో ఆఫర్ ఫర్ సేల్ పేరుతో ప్రభుత్వ వాటా( ఎఫ్ పి వో) 6.5 ని విక్రయించే యోచన ను తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ సూర్యాపేట బ్రాంచ్ అధ్యక్షుడు ఎల్, మోహన్ సింగ్ డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐఐఇఏ) దేశవ్యాప్త పిలుపుమేరకు జిల్లా కేంద్రంలోని ఎల్ఐసి కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో ఐసీయూ ఇయు ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను ఖాతాదారులకు అనుగుణంగా బలోపేతం చేసేలా కృషి చేయాలి కానీ నిర్వీర్యం చేసే అనాలోచిత నిర్ణయాన్ని విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆఫర్ ఫర్ సేల్ పేరుతో కేంద్ర ప్రభుత్వం 31 వేల కోట్లను విక్రయించాలని చూస్తుందని దీనివలన ప్రమాదకరంగా మారే పరిస్థితులు తలెత్తుతాయని దీనిని ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ సూర్యపేట బ్రాంచ్ సెక్రటరీ డి, ప్రభాకర్, నాయకులు కె, రామయ్య, చాంద్ పాషా, శంకర్, శివకుమార్, సంజీవయ్య, హరిశంకర్, రామకృష్ణ, సువర్ణ, సందీప్, బాలు, ఎల్ఐసి ఉద్యోగులు, ఏజెంట్లు, డెవలప్మెంట్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల కట్టడికి అప్రమత్తత,అవగాహనే ఆయుధం

### పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**మీడియా టుడే ఖమ్మం ఆర్సి**
ఖమ్మం: సైబర్ నేరాల కట్టడికి అప్రమత్తత,అవగాహనే ఆయుధమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించడానికి సైబర్ జాగృక్త దివస్ కార్యక్రమంలో భాగంగా సైబర్ క్రైమ్ పోలీసుల ఆధ్వర్యంలో ఈ రోజు 'సురక్ష కా తిరంగా -సైబర్ స్వతంత్ర తెలంగాణ' ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్అనే ప్రత్యేక అవగాహన ప్రచార కార్యక్రమాన్ని నగరంలోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ...డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవితాన్ని అపూర్వంగా సులభతరం చేసినప్పటికీ, అదే సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ సైబర్ నేరగాళ్లు ప్రజల సొమ్ము,వ్యక్తిగత సమాచారం,గోప్యతపై దాడులు చేయడం ఆందోళనకరంగా మారిందన్నారు. నగదులావాదేవీల స్థానంలో యూపీఐ, నెట్ బ్యాంకింగ్,మొబైల్ బ్యాంకింగ్,డిజిటల్వాలెట్లు, ఆన్లైన్ కొనుగోళ్లు, సామాజిక మాధ్యమాల వినియోగం విస్తరించడంతో సైబర్ నేరాలకు అవకాశాలు పెరిగాయని అన్నారు. సైబర్ నేరాల నివారణలో ప్రతి పౌరుడు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని, బ్యాంకు ఖాతా వివరాలు, ఒటీపీ, యూపీఐ పిన్, సీవీవీ సంఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు చెప్పకూడదన్నారు. తెలియని లింక్ లను నొక్కకూడదన్నారు. ప్రతి ఖాతాకు వేర్వేరు బలమైన సంకేత పదాలను ఉపయోగించాలన్నారు. రెండు దశల ధృవీకరణ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన సందేశాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని,అనుమానాస్పద కాల్ వస్తే వెంటనే కాల్ నిలిపివేసి సంబంధిత సంస్థ అధికారిక నంబర్లకు సంప్రదించాలన్నారు. ప్రస్తుతం కృత్రిమ మేధస్సు, నకిలీ వెబ్సైట్లు, నకిలీ మొబైల్ యాప్లు, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రకటనలు, ఉద్యోగాల పేరుతో మోసాలు, పెట్టుబడుల పేరుతో మోసాలు, డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరింపులు, ఓటీపీలు, యూపీఐ అభ్యర్థనలు, క్యూఆర్ కోడ్ల ద్వారా డబ్బు దోచుకునే కొత్త పద్ధతులు విస్తృతంగా పెరిగాయని, నేరగాళ్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంలో మరింత చురుకుగా మారుతుండగా, సాధారణ ప్రజలలో అవగాహన అంతే వేగంగా పెరగక పోవడం సమస్యను మరింత క్లిష్టతరం చేస్తోందన్నారు. ప్రతి నెల వందల సంఖ్యలో సైబర్ మోసాలపై ఫిర్యాదులు నమోదవుతున్నాయని, లక్షల రూపాయల మేర ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. అత్యంత విద్యావంతులు కూడా నేరగాళ్ల మానసిక వ్యూహాలకు మోసపోవడం ఈ నేరాల స్వరూపాన్ని తెలియజేస్తోందని పేర్కొన్నారు. ఒక్కసారి బ్యాంకు వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్ లేదా వ్యక్తిగత సమాచారం నేరగాళ్ల చేతికి చేరితే కొన్ని నిమిషాల్లోనే బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతున్నాయని తెలిపారు. ఇటీవలి కాలంలో ప్రమాదకరంగా మారిన నేరాల్లో 'డిజిటల్ ఆరెస్టు' మోసాలని, కేంద్ర దర్యాప్తు సంస్థలు, పోలీసు అధికారులు పేర్లు చెప్పి వీడియో కాల్ ద్వారా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ గంటల తరబడి ఫోన్లోనే ఉంచి వారి నుంచి లక్షల రూపాయలు బదిలీ చేయించుకునే సంఘటనలు వెలుగు చూశాయని,అలాగే



పెట్టుబడి పెడితే రోజుల్లోనే రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మిస్తూ నకిలీ ట్రేడింగ్ యాప్ల ద్వారా లక్షల రూపాయలు కాజేసే సంఘటనలు కూడా పెరుగుతున్నాయని అన్నారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన లింక్లను తెరవడం, అపరిచిత యాప్లను డౌన్లోడ్ చేయడం, ఓటీపీలు చెప్పడం, క్యూఆర్ కోడ్లను విచక్షణారహితంగా స్కాన్ చేయడం, సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత వివరాలను అధికంగా పంచుకోవడం, ఒకే సంకేత పదాన్ని అన్ని ఖాతాలకు ఉపయోగించడం వంటి అలవాట్లు నేరగాళ్లకు అవకాశాలను కల్పిస్తున్నాయని తెలిపారు. ఆన్‌లైన్ మోసాలు లేదా ఆర్థిక సైబర్ నేరాలు జరిగితే బాధితులు వెంటనే టోల్-ఫ్రీ నంబర్ 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని,ఇది 24 గంటలూ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణిందర్, ఇన్స్పెక్టర్లు కరుణాకర్, బాలకృష్ణ, మోహన్ బాబు, భానుప్రకాష్, ఉస్మాన్ షరఫ్, రవికుమార్, ఎస్సై లు రంజిత్ కుమార్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చొరవతో మెదక్‌లో వేగంగా అభివృద్ధి పనులు

### 5వ వార్డులో రూ.50 లక్షల సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



**మెదక్ జిల్లా మీడియా టుడే ఆగస్టు 5:**
మెదక్ పట్టణంలోని 5వ వార్డులో టీయూఎఫ్ఐడీసీ (ఁఖఫీ×ణజ) మరియు యూఐడీఎఫ్ (ఖ×ణఫీ) పథకాల కింద మంజూరైన రూ. 50 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు నాయకత్వంలో పట్టణంలోని అన్ని వార్డుల్లో పార్టీలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, కో-ఆప్షన్ సభ్యుడు తాహెర్, నాయకులు కానుగు భూపతి రాజు, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, పట్టణ అధ్యక్షుడు మందుల గంగాధర్, మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. సత్యనారాయణ, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ జె. నితిన్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో తెలంగాణ కార్మిక సంఘం అభినందన సభ

### పిట్లం చేనేత సంఘం నాయకులకు సన్మానం

**మీడియా టుడే కామారెడ్డి జిల్లా పిట్లం ఆగస్టు 5**



తెలంగాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్,వనస్థలిపురంలో నిర్వహించిన నూతన పాలకవర్గాల అభినందన సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పిట్లం చేనేత సంఘం అధ్యక్షులు మర్గల వేణు, ఉపాధ్యక్షులు నీలకంఠి సంతోష్లను సంఘం కన్వీనర్ వనం శాంతి కుమార్ సన్మానించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి ఎల్ రమణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, చేనేత కార్మికులకు రావలసిన రుణమాఫీలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, కొత్త పింఛన్లను మంజూరు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. అలాగే చేనేత కార్మికులు ఐక్యంగా ఉండి తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కృషి చేయాలని, నూతన పాలకవర్గాలు కార్మికుల సంక్షేమం, అభ్యున్నతి కోసం అంకితభావంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కార్మిక సంఘం నాయకులు, చేనేత కార్మికులు, వివిధ ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం నూతన జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా మేకల రాజ్ ప్రకాష్ మహమ్మద్ అబ్దుల్ రజాక్ ఏకగ్రీవ ఎన్నిక



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి మీడియా టుడే ఆగస్టు 5**
తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శిగా బుధవారం నూతనంగా ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షులుగా మేకల రాజ్ ప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ అబ్దుల్ రజాక్,జిల్లా అసోసియేట్అధ్యక్షులుగాఎస్ కే అబ్బాస్, ఉపాధ్యక్షులుగా ఏ నాగరాజ్, జె నరేష్ కుమార్, టి టి సాగర్,సువర్ణ లు,ట్రెజరర్ గా పి రాజయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి ఉదయ్ కుమార్, బి సతీష్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా పి రమేష్, జాయింట్ సెకరెటరీలుగాఎన్ శ్రీనివాస్, బి వెంకటేష్,ఎస్ శ్రీనివాస్,మౌనిక,జిల్లా కార్యవర్గ సభ్యులుగా మహమ్మద్ రెహమత్ పాషా,ఎం అశోక్,జి పవన్ కుమార్,యం వేణు, ఆర్ శివరామకృష్ణ బి శ్రీనివాస్ జె సరస్వతి ఏకగ్రీవంగా ఎన్నికైనారు.

## ఆర్థిక అక్షరాస్యతపై గ్రామస్తులకు అవగాహన




**అనంతగిరి ఆగస్టు 5 మీడియా టుడే -:** మండలంలోని పాలవరం గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం-- కోదాడ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యత, పొదుపు అలవాట్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకింగ్ సేవల వినియోగం, డిజిటల్ లావాదేవీలు, పొదుపు ప్రాముఖ్యత, బీమా, పెన్షన్ పథకాలు, రుణాల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ మోసాల నివారణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబం ఆర్థిక ప్రణాళికతో ముందుకు సాగాలని, ప్రభుత్వ, బ్యాంకుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్టపల్లి నరేష్, ఉప సర్పంచ్ బెల్లంకొండ అంజయ్య, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మట్టపల్లి రామకోటయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ మట్టపల్లి శ్రీదేవి, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రతినిధులు, గ్రామ పంచాయతీ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### - పలుగుగడ్డలో కార్మిక సంఘం 23వ ఆవిర్భావ దినోత్సవం



**జగదేవపూర్ ఆగస్టు 5 (మీడియా టుడే )**

జగదేవపూర్: రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పలుగుగడ్డ గ్రామ భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు లింగాల కనకయ్య డిమాండ్ చేశారు. కార్మిక సంఘం 23వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం పలుగుగడ్డలో ఆయన ఆధ్వర్యంలో కార్మిక జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సంక్షేమ బోర్డు నిధులను ప్రైవేటు బీమా సంస్థలకు మళ్లించే నిర్ణయాన్ని రద్దు చేయాలని, సీఎస్సీ హెల్త్ టెస్టులను నిలిపివేయాలని కోరారు. 60 ఏళ్లు నిండిన కార్మికులకు నెలకు రూ.9 వేల పెన్షన్, అర్హులైన ప్రతి కార్మిక కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సంక్షేమ క్లెయిమ్‌లను వెంటనే మంజూరు చేసి, నమోదు, రెన్యువల్ ప్రక్రియను సులభతరం చేయాలని కోరారు.కార్యక్రమంలో సర్పంచ్ నర్ర కనకయ్య, ఉప సర్పంచ్ కళ్యాణి రాజ్‌కుమార్, కార్మిక సంఘం నాయకులు, సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పాలవరంలో తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం

### సర్పంచ్ మట్టపల్లి నరేష్ గౌడ్ పాల్గొని ప్రారంభించారు




**అనంతగిరి ఆగస్టు 5 మీడియా టుడే-:**

అనంతగిరి మండలంలోని పాలవరం గ్రామ అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను బుధవారం గ్రామ సర్పంచ్ మట్టపల్లి నరేష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు మొదటి 6 నెలలు తల్లిపాలే సర్వోత్తమ ఆహారమని, అవి రోగనిరోధక శక్తిని పెంచి బిడ్డ ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. తల్లిపాలు బిడ్డకు అన్ని రకాల పోషకాలను అందిస్తాయని, కృత్రిమ పాలకు బదులుగా తల్లిపాలను ప్రోత్సహించాలని తల్లులకు సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కరపత్రాలు పంపిణీ చేసి, పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో అందరూ సహకరించాలని సర్పంచ్ కోరారు.కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## నేటినుంచిఎరువులవిక్రయ విధానములో మార్పులు

### నేలకొండపల్లిమండలవ్యవసాయశాఖఅధికారి బి రాధ

**నేలకొండపల్లి ఆగస్టు 5 మీడియా టుడే ప్రతినిధి**




నేటి నుంచిఎరువుల విక్రయంలో ప్రభుత్వం నూతన విధానాన్ని అమలు చేస్తుందని నేలకొండపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి బి రాధ చెప్పారు.2026 ఆగస్టు 6 నుండి ఎరువుల విక్రయ విధానంలో మార్పులు అమలులోకి వస్తాయని ఆమె చెప్పారు.ఇకపై యూరియా, డీఏపీ మరియు కాంప్లెక్స్ ఎరువుల కొనుగోలు కోసం Frame work for fertilizer sale App ద్వారా మాత్రమే పంపిణీ చేయబడుతుంది. రైతులు తప్పనిసరిగా Farmers Registryలో నమోదు చేసుకుని Farmer ID పొందాలని రాధా చెప్పారు .Farmers Registryలో నమోదుతప్పనిసగాచేయాలFarmer ID ఉన్న రైతులకు మాత్రమే ఎరువుల కొనుగోలు చేసేఅవకాశం ఉంటుందని ఆమె చెప్పారు.రైతులు సమీప వ్యవసాయ విస్తరణ అధికారి (ూాజుూ), మీ సేవ కేంద్రం లేదా జూజ కేంద్రంలో Farmers Registry నమోదు చేసుకోవచ్చునిచెప్పార .FarmerIDనమోదు అనంతరంFramework for fertilizersale ూాజూాజూాద్వారాూాూా ధృవీకరణతోఎరువులను ొందేఅవకాశంకలుగుతుందని ఆమెరైతులకుసూచించారు. నేలకొండపల్లి మండలంలోని రైతులందరూ వెంటనే Farmers Registry ŸP]ï#ûd ¾FarmerID పొందాలని,ఎ రువులకొనుగోలులో ఎలాంటిఇబ్బందులు ఎదురుకాకుండాముం దస్తుచర్యలుతీసుకోవాలని ఆమె కోరారు.

# అర్హులైన పేద కుటుంబాలకే డబుల్ బెడ్ రూములు



**మహబూబ్‌నగర్. మీడియా ప్రతినిధి. ఆగస్టు05:-** డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో పూర్తి పారదర్శకత పాటించి నిజమైన అర్హులైన పేద కుటుంబాలకే ప్రాధాన్యం ఇవ్వాలని గృహ నిర్మాణ శాఖ ఎం.డి., కార్యదర్శి,ఎల్ నినో పై ప్రభుత్వం జిల్లా కు నియమిం చిన ప్రత్యేక అధికారి వి.పి. గౌతం ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఖాళీగా ఉంచకుండా వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని, రెండు పథకాల లబ్ధిదారుల జాబితాలను కృత్రిమ మేధ సాయంతో సరిపోల్చి ఒకే వ్యక్తికి రెండు పథకాల ప్రయోజనం అందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గృహనిర్మాణ, రెవెన్యూ,మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.పెండింగ్ లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్, రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరగాలని, ఇప్పటికీ పంపిణీ చేయకుండా పెండింగ్ లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ను, ఇప్పటికే గుర్తించిన డబుల్ బెడ్రూం అర్హుల జాబితాను 360 డిగ్రీ డాటా తో పరిశీలించి అనర్హులను తొలగించి అర్హులకు కేటాయించాలని గౌతమ్ సూచించారు. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, ఇతర తక్కువ వేతనాలతో పనిచేసే ప్రభుత్వ సేవల సిబ్బందిని కేవలం ఉద్యోగం ఆధారంగా అనర్హులుగా ప్రకటించరాదని, వారి కుటుంబ పరిస్థితులు, ఆదాయం, ఆస్తులను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి తిరస్కరణకు స్పష్టమైన కారణాలను నమోదు చేయాలని ఆదేశించారు.నిర్మాణం పూర్తయిన ఇళ్లను ఎక్కువకాలం ఖాళీగా ఉంచితే ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొంటూ,వెంటనే లబ్ధిదారులకు కేటాయించి విద్యుత్, తాగునీరు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. కేటాయించిన ఇళ్లలో నివసించకుండా తాళాలు వేసి వేరే ప్రాంతాల్లో ఉంటున్న వారి వివరాలను పరిశీలించి అవసరమైతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, దీర్ఘకాలంగా వినియోగంలో లేని ఇళ్లను తిరిగి స్వాధీనం చేసుకుని అర్హులకు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు.డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ గృహాల లబ్ధిదారుల జాబితాలను కృత్రిమ మేధ ద్వారా సరిపోల్చాలని సూచించారు ఆధార్ నంబర్ లేకున్నా పేర్ల ఆధారంగా కూడా వివరాలను పోల్చి ఒకే వ్యక్తి రెండు జాబితాల్లో ఉన్నారా అనే విషయాన్ని గుర్తించాలని, సాంకేతికంగా ధృవీకరణ పూర్తైన తర్వాత నిర్భయంగా ఇళ్ల కేటాయింపు చేపట్టాలని అధికారులకు సూచించారు.సమీక్షలో భాగంగా మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాల పరిధిలో పూర్తయిన, అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లతో పాటు పంపిణీ చేసిన ఇళ్ల వివరాలను మండలాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఇందిరమ్మ గృహాల రెండో దశ అమలుపై సమీక్షిస్తూ గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలకు తప్పనిసరిగా తొలి ప్రాధాన్యం ఇవ్వాలని గౌతమ్ స్పష్టం చేశారు. రాజకీయాలు లేదా ఇతర అంశాలకు అతీతంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హుల ఎంపిక జరగాలని సూచించారు. కొత్త ఇళ్లు, రూఫ్ రీప్లేస్‌మెంట్‌కు అర్హులైన వారి వివరాలను ఒకే సమగ్ర ప్రతిపాదనగా సిద్ధం చేయాలని ఆదేశించారు.రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్న ఆయన, గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. గోడలు బాగుండి పైకప్పు మాత్రమే దెబ్బతిన్న ఇళ్లకు ప్రభుత్వం రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. గుడిసెల్లో నివసించే వారికి ఇళు మంజూరైన తర్వాత నిర్మాణం పూర్తయ్యే వరకు ఇంజినీర్లు, అధికారులు బాధ్యతగా పర్యవేక్షించి అవసరమైన సాంకేతిక సహాయం అందించాలని ఆదేశించారు.జడ్చర్లలో అసంపూర్తిగా నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలపై కూడా గౌతమ్ ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. కాంట్రాక్టర్‌కు ఇప్పటివరకు చేసిన చెల్లింపులు, పెండింగ్ బకాయిలు, మిగిలిన పనుల విలువపై పూర్తి వివరాలు సేకరించాలని ఆదేశించారు. అవసరమైతే పాత కాంట్రాక్టును రద్దు చేసి కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అదనపు చెల్లింపులు జరిగి ఉంటే వాటిని రికవరీ చేసే చర్యలు చేపట్టాలని సూచించారు.అంతకుముందు గౌతమ్, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి ఏనుగొండలోని మౌలాలి గుట్టలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ గృహాలను సందర్శించి లబ్ధిదారుల నివాసం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై ప్రత్యక్షంగా ఆరా తీశారు. అక్కడ ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను గమనించిన ఆయన, వెంటనే లబ్ధిదారులను గుర్తించి వాటిని అర్హులైన వారికి అప్పగించాలని అన్నారు.సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని,డి.ఆర్.ఓ ఎ. నిర్మల, ఆర్.డి.ఓ నవీన్, గృహనిర్మాణ శాఖ పి.డి. ఉపేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసిన నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ రహీం

**హైదరాబాద్:** నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ రహీం ఈరోజు హైదరాబాద్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ గారిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఘన సన్మానం: ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ గారిని షాల్వాతో ఘనంగా సత్కరించి, గౌరవపూర్వక వందనాలు సమర్పించారు. కార్యక్రమాల వివరణ: తెలంగాణ రాష్ట్రంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ తరఫున తాము చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలు, మానవ హక్కుల పరిరక్షణ చర్యలను అబ్దుల్ రహీం గారు వారికి కూలంకషంగా వివరించారు. సమస్యలపై చర్చ: ప్రస్తుత సమాజంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న పలు సామాజిక సమస్యలు, మానవ హక్కుల ఉల్లంఘనలపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమస్యల పరిష్కారానికి, బాధితులకు న్యాయం చేకూర్చడానికి కమిషన్ మరింత చొరవతో పనిచేయాలని జస్టిస్ చంద్రకుమార్ గారు ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. మర్యాదపూర్వక భేటీ మరియు సన్మానంఈరోజు హైదరాబాద్ లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, గౌరవనీయులు జస్టిస్ చంద్రకుమార్ సార్ గారిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా వారికి షాల్వతో ఘన సన్మానం సమర్పించాము.మానవ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్రంలో మనం నిర్వహిస్తున్న నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ కార్యక్రమాల గురించి వారికి వివరించడం జరిగింది. అలాగే రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు కీలక సామాజిక సమస్యల పైన, వాటి పరిష్కార మార్గాల పైన సార్ గారితో సుదీర్ఘంగా చర్చించడం జరిగింది . ఈ



కార్యక్రమం లో ఎస్గి గ్రామ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు తయ్యబ్ పాల్గొనడం జరిగింది.

# భక్తి శ్రద్ధలతో పోచమ్మ బోనాల పండుగ వేడుకలు



**మహబూబ్‌నగర్. ఆగస్టు05(మీడియా టుడే)**

రాష్ట్ర పండుగలలో సంస్కృతికి సాంప్రదాయాలకు ప్రతీక అయిన ఆషాఢ మాసంలో పోచమ్మ బోనాల సంబరాలు భక్తి శ్రద్ధలతో బుధవారం తెల్లవారుజాము నుంచే మహిళలు పసుపు చీరలు, పూలతో అలంకరించుకుని, బోనం కుండలను తలపై పెట్టుకుని గ్రామ దేవత ఆలయాలకు తరలివచ్చారు. బోనం కుండలో పాలు, బెల్లం అన్నం, దీపం, వెండి గాజులు సమర్పించి పోచమ్మ తల్లిని కొలిచారు. ఈ సందర్భంగా సర్పంచ్ భగవంతుడి మాట్లాడుతూ"అమ్మవారి కరుణతో పంటలు బాగా పండాలి, ఊరికి రోగాలు రాకూడదు" అని మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. డప్పుల చప్పుళ్ళు , పోతురాజుల వీర నృత్యాలు వాతావరణాన్ని భక్తిమయం చేశాయి. ప్రభుత్వం తరపున ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. పోచమ్మ" అంటూ తెలంగాణ ఆడబిడ్డల కంఠాలతో గ్రామాలు మారుమోగాయి. ఆషాఢ మాసంలో వచ్చే పోచమ్మ బోనాలు తెలంగాణ ప్రజల జీవన విధానంలో ఒక భాగం. వర్షాలు సరిగా పడాలి, పంటలు పండాలి, ఊరిలో అంటువ్యాధులు రాకూడదనే కోరికతో గ్రామదేవత పోచమ్మకు బోనాలు సమర్పించే ఆచారం శతాబ్దాలుగా వస్తోంది.తెల్లవారుజామునే మహిళలు స్నానం చేసి, కొత్త చీరలు కట్టి, మట్టి కుండలో వండి తెచ్చిన బోనాన్ని తలపై పెట్టుకుని "అమ్మా పోచమ్మా" అంటూ ఆలయానికి బయలుదేరారు. ఆడపడుచులు నెత్తిపై బోనం లకు వేపాకులు, దీపం పెట్టి అలంకరించారు. ఆలయం వద్ద పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోతురాజులు డప్పులతో వీర నృత్యాలు చేసి భక్తులను ఉర్రూతలూగించారు. యువతులు "బోనాల పాటలు" పాడుతూ అమ్మవారిని కీర్తించారు. అది తెలంగాణ ఆడబిడ్డల ఐక్యతకు, సంస్కృతికి నిదర్శనం. ప్రభుత్వం కూడా ఈ ఏడాది భారీ ఏర్పాట్లు చేయడంతో లక్షలాది భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందడంతో పాటు వారు వెంబడి తెచ్చుకున్న ముగ్గులు అమ్మవారికి సమర్పించి తీర్చుకున్నారు ఈ కార్యక్రమంలో చత్రపతి శివాజీ యువజన సంఘం సభ్యులు. ఐలమ్మ సంఘం సభ్యులు. ముదిరాజుల సంఘం సభ్యులు. పద్మశాలి యువజన సంఘ సభ్యులు. అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు హనుమాన్ యువజన సంఘ సభ్యులు. తదితరులు పాల్గొన్నారు.

## మీడియా టుడే కదనానికి స్పందించిన జిల్లా గ్రంధాలయ సంస్థ సెక్రెటరీ

### హుజూర్‌నగర్ గ్రంథాలయాన్ని పరిశీలించిన జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ రామచంద్ర నాయక్.

**సూర్యాపేట జిల్లా / హుజూర్ నగర్ మీడియా టుడే, స్టాఫ్ రిపోర్టర్: ఆగస్ట్ 05.**


హుజూర్ నగర్ శాఖా గ్రంథాలయ పని వేళలు పెంచాలి

ప్రజాప్రతినిధులు, అధికారుల స్పందన కోసం నిరుద్యోగుల విజ్ఞప్తి.

సూర్యాపేట జిల్లా మీడియా టుడే, స్టాఫ్ రిపోర్టర్: జూలై 31.

హుజూర్ నగర్ పట్టణంలోని శాఖా గ్రంథాలయాన్ని సెలవులు, శుక్రవారం అనే పరిమితులు లేకుండా ప్రతిరోజూ 12 నుండి 14 గంటల పాటు తెరిచి ఉంచాలని నిరుద్యోగులు, పోటీ పరీక్షల అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. రూ. 86 లక్షల ప్రజాధనంతో నిర్మించిన ఈ గ్రంథాలయం ప్రస్తుతం పరిమిత వేళల్లో మాత్రమే పనిచేస్తుండటంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వ లైబ్రరీ వేళలు తక్కువగా ఉండటం వల్ల తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు స్టడీ సెంటర్లను ఆశ్రయించాల్సి వస్తోందని, లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని నిరుద్యోగ అభ్యర్థులు వాపోతున్నారు. దీనివల్ల తమపై తీవ్ర ఆర్థిక భారం పడటమే కాకుండా విలువైన సమయం కూడా వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఓ సందర్భంగా విద్యార్థులు మరో ముఖ్యమైన విషయాన్ని స్పష్టం చేశారు: "గ్రంథాలయంలోని పుస్తకాలకు సంబంధించి మాకు ఎలాంటి బుక్స్ ఇవ్వకున్నా పర్వాలేదు, మా పుస్తకాలను మేమే తెచ్చుకుంటాం. లైబ్రరీ బుక్స్ అన్నీ భద్రంగా లాకర్‌లో పెట్టి రూమ్ తాళం వేసినా మాకేమీ అభ్యంతరం లేదు. మాకు కేవలం ప్రశాంతంగా చదువుకోవడానికి స్టడీ హాల్ (రీడింగ్ స్పేస్) మాత్రమే కేటాయించి, ఎక్కువ సమయం అందుబాటులో ఉంచండి" అని వేడుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని నిరుద్యోగులు వాపోతున్నారు.స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, యువత ఆవేదనను అర్థం చేసుకోవాలని అభ్యర్థులు కోరుతున్నారు. తెలంగాణ భవిష్యత్తు అయిన యువత బంగారు బాటలు వేసుకునేందుకు ప్రజాప్రతినిధులు తమవంతు సహకారాన్ని అందించి, హుజూర్ నగర్ శాఖా గ్రంథాలయ వేళలను 12 నుండి 14 గంటలకు పెంచేలా చర్యలు తీసుకోవాలని హుజూర్ నగర్ ప్రాంత ప్రజాప్రతినిధులను, అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

జూలై 31 మీడియా టుడే లో వచ్చిన కథనానికి స్పందించిన జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ. హుజూర్ నగర్ పట్టణ గ్రంథాలయాన్ని రామచంద్ర నాయక్ సందర్శించి, ఈ సందర్భంగా నిరుద్యోగులు ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా గ్రంథాలయాన్ని తెరిచి ఎక్కువ టైం కేటాయించాలని ఉంచాలని కోరుతూ నిరుద్యోగుల కోరికపై దీనిపై ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. గ్రంథాలయ పని వేళలను ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగించ నున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి శ్రీధర్ రెడ్డి, నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

## ఘనంగా బుద్ధారం గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు

**గణపురం సెక్టర్ సూపర్వైజర్ రజిత**

**భూపాలపల్లి/గణపురం మీడియా టుడే ఆగస్టు 05**



గణపురం మండలం బుద్ధారం గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు ర్యాలీ తో ఘనంగా నిర్వహించారు. సూపర్వైజర్ రజిత మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం తో పాటు టీకాలు వేయించాలి బిడ్డకు, మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే అందించడం వల్ల శిశువుకు సంపూర్ణ పోషకాహారం అందడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. తల్లిపాలు బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో అవసరమని, ప్రతి తల్లి ఈ విషయాన్ని గుర్తుంచుకుని చిన్నారులకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని సూచించారు. సూపర్వైజర్ రజితతో లబ్ధిదారులకు పౌష్టిక ఆహారాన్ని అందించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ పద్మ శ్యామల దేవి కోమల ఆయాలు ఆశలు పిల్లలు తల్లులు గర్భిణీలు బాలింతలు పాల్గొన్నారు

# చిన్నమారూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ఫేజ్--1లో నీటి విడుదల

## కృష్ణమ్మ రాకతో రైతుల్లో హర్షం.. మంత్రి జూపల్లి ఆదేశాలతో మోటార్లు రన్

**చిన్నంబావి, మీడియా టుడే న్యూస్ ఆగస్టు 5**



చిన్నంబావి మండల పరిధిలోని పెద్దమారూర్ గ్రామ సమీపంలో కృష్ణానదిపై నిర్మించిన చిన్నమారూర్ ఎత్తిపోతల పథకం ఫేజ్--1 పంప్‌హౌస్ మోటార్లను బుధవారం రన్ చేసి నీటిని కాలువల్లోకి విడుదల చేశారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణానదికి సమృద్ధిగా నీరు చేరుతుండటంతో సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మోటార్ల ద్వారా నీటిని లిఫ్ట్ చేసి కాలువల్లోకి వదిలారు.గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ప్యానల్ బోర్డుపై స్విచ్‌లు ఆన్ చేసి మోటార్లను ప్రారంభించారు. దీంతో కృష్ణమ్మ నీరు కాలువల ద్వారా ఆయకట్టు భూములకు చేరుతుండటంతో రైతులు హర్షంవ్యక్తంచేశారు .నెదర్లాండ్స్ ప్రభుత్వ ఆర్థిక సహకారంతో, అప్పటి కొల్లాపూర్ ఎమ్మెల్యే కొత్త వెంకటేశ్వరరావు హయాంలో నిర్మించిన చిన్నమారూర్ ఎత్తిపోతల పథకం ప్రారంభంలో సక్రమంగా పనిచేసింది. అనంతరం నిర్వహణ, నియంత్రణ, పర్యవేక్షణ లోపాలతో మోటార్లు నిరుపయోగంగా మారాయి. తాజాగా మోటార్లను తిరిగి రన్ చేయడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం నెలకొంది.మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫేజ్--1 పంప్‌హౌస్ ద్వారా నీటిని విడుదల చేసినట్లు గ్రామ పంచాయతీ పాలకవర్గం తెలిపింది. నీటిని వృథా కాకుండా కాలువల ద్వారా చెరువుల్లోకి మళ్లించేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందుబాటులోకి రావడంతో వ్యవసాయ భూములకు నీటి సమస్య కొంతమేర పరిష్కారమవుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. పథకాన్ని తిరిగిఅందుబాటులోకితీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్ నరేష్ యాదవ్, హనుమంతరావు, కే. లక్ష్మయ్య, కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, రైతులు ఆబోతు చంద్రయ్య, మూగి కురుమయ్య, లోకేష్, మద్దిలేటి, నాగరాజు, గ్రామస్థులు, లిఫ్ట్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# ఉద్యోగ ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న వేతన సవరణప్రభుత్వం వెంటనే అమలు చేయాలి

## ఎస్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి పాలూరి అంజయ్య

**మీడియా టుడే గరిడేపల్లి ఆగస్టు 5:**

ఉద్యోగ ఉపాధ్యాయులు మూడేళ్లుగా ఎదురుచూస్తున్న వేతన సవరణను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, లేని పరిస్థితుల్లో సెప్టెంబర్ నెలలో వేతన సవరణ, ఉపాధ్యాయ సమస్యలపై పెద్ద ఎత్తున పోరాట కార్యక్రమం నిర్వహిస్తామని ఎస్ టి యు సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పాలూరి అంజయ్య, గరిడేపల్లి మండల అధ్యక్షులు మీసాల నరసింహారావు, ప్రధాన కార్యదర్శి గొర్రె నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం గరిడేపల్లి మండలంలో జరిగిన ఎస్ టి యు సభ్యత్వ నమోదు క్యాంపెయిన్ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి ఎస్టీయూ సంఘం సభ్యత్వలను అందించారు. ఎస్ టి యు రాష్ట్ర విద్యా నిపుణులు రూపొందించిన టెట్ మెటీరియల్ను వివిధ ఉపాధ్యాయులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు రాష్ట్ర నాయకులు కె వి సత్యనారాయణ, మండల ఆర్థిక కార్యదర్శి గండు నాగయ్య , జిల్లా నాయకులు కట్ట బాలస్వామి, రామిశెట్టి లక్ష్మయ్య, కోట రంగయ్య, గోవిందయ్య, సతీష్, రమేష్, సివి రావు, మాధవరపు గోవిందు, బేతు సైదులు, జానకి రెడ్డి, విజయ కుమారి మొదలైన వారు పాల్గొన్నారు.




# భూ రీ-సర్వేతోభూసమస్యలకు శాశ్వత పరిష్కారం

## రైతుల సమక్షంలోనే పారదర్శకంగాభూ రీ సర్వేనిర్వహిస్తాం

## రీ-సర్వేపూర్తయినతర్వాతభవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గుతాయి




**నేలకొండపల్లి ఆగస్టు 5 మీడియా టుడే ప్రతినిధి**

నేలకొండపల్లి మండలం కొంగర గ్రామసభలో భూ రీ సర్వే పై అవగాహన కల్పించిన జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రీ-సర్వే ద్వారా రైతుల భూములపై ఉన్న వివాదాలు, విస్తీర్ణ వ్యత్యాసాలు, రికార్డులలోని లోపాలను పూర్తిగా పరిష్కరించి శాశ్వతమైన, పారదర్శకమైన భూ రికార్డులను రూపొందించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్పష్టంచేశారు.పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలం కొంగర గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం భూ రీ-సర్వే పై నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ పాల్గొని రైతులకు, గ్రామ ప్రజలకు సమగ్రంగా అవగాహన కల్పించారు. ప్రజలు భూ సర్వే పై అడిగిన పలు సందేహాలకు కలెక్టర్ నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకరటిఎస .ట్లాడుతూగ్రామంలో ముందుగా రెవెన్యూ గ్రామ సరిహద్దులను పూర్తిగా ఖరారు చేస్తున్నామని, అనంతరంప్రభుత్వభూములు,భూసేకరణ జరిగిన ప్రాంతాలు, ఇతర ప్రత్యేక భూములను గుర్తించి వేరు చేస్తున్నామని వివరించారు.తరువాత మాత్రమే వ్యవసాయ భూములు, రైతుల వ్యక్తిగత భూములను క్షేత్రస్థాయిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేస్తామని తెలిపారు. సర్వే ప్రక్రియను ఆధునిక యంత్రాల సహాయంతో పూర్తి స్థాయిలో కొలిచి సర్వేనిర్వహిస్తున్నామని చెప్పారు.గతంలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు లేకపోవడం, ఆన్లైన్ ప్రక్రియలో పేర్లు నమోదు కాకపోవడం, రికార్డుల్లో ఉన్న విస్తీర్ణానికి భూమిపై ఉన్న విస్తీర్ణానికి తేడాలు ఉండడం వంటి అనేక సమస్యలు రైతులు ఎదుర్కొన్నారని తెలిపారు. కొంతమందికి తక్కువ విస్తీర్ణం నమోదు కాగా, మరికొందరికి ఎక్కువగా నమోదైన సందర్భాలు కూడా ఉన్నాయని, రీ-సర్వే ద్వారా అలాంటి అన్ని లోపాలను సరిచేస్తామని చెప్పారు.గ్రామంలోనీ ప్రతి రైతుకు 48గంటల ముందుగానే నోటీసులు జారీ చేసి, రైతుల సమక్షంలోనే వారి పొలాలను కొలుస్తామని కలెక్టర్ తెలిపారు. రైతులు స్వయంగా తమ భూమి హద్దులను చూపిస్తారని, పక్కనే ఉన్న రైతులను కూడా పిలిచి పంచనామా నిర్వహించి హద్దులను నిర్ధారిస్తామని వివరించారు. సర్వే పూర్తయ్యాక ఎంత విస్తీర్ణం నమోదైందో రైతులకు అక్కడికక్కడే తెలియజేస్తామని చెప్పారు.భూరీసర్వే మొత్తం ప్రక్రియ పూర్తిగా క్షేత్ర స్థాయిలో భూ హక్కుదారిని సమక్షంలో పారదర్శకంగా జరుగుతుందని, రైతుల హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులు అపోహలకు గురికాకుండా అధికారులు అందించే సమాచారాన్ని విశ్వసించి భూ రీ-సర్వే కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని కోరారు.కాకరవాయి, బేతుపల్లి గ్రామాల్లో రీ-సర్వే నిర్వహించిన సందర్భం గుర్తుచేస్తూ, అందుకే ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి పూర్తి వివరాలు తెలియజేస్తున్నామని చెప్పారు. సర్వే అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రకటించి 60 రోజుల గడువు ఇస్తామని, అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించిన తర్వాత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూధార్ కార్డులు జారీ చేస్తామని పేర్కొన్నారు. రీ-సర్వే పూర్తయినతర్వాతభవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు శాశ్వత భద్రత కలుగుతుందని కలెక్టర్ దివాకర టీఎస్ స్పష్టం చేశారు.ఆనతరం నేలకొండపల్లి మండలం బుద్ధారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వీఓ భవనం పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఆధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యాక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట నేలకొండపల్లి తహసీల్దారు రాంప్రసాద్, ఎంపిడివో ఎర్రయ్య,గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు,రైతులు తదితరులు ఉన్నారు.

# ప్రజల గుండెచప్పుడు బోడేపూడి.. మద్దాల

## తెలంగాణ సాయుధ పోరాట యోధుడు

**మీడియా టుడే ఎర్రుపాలెం:**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, అమర్ జీవి బోడేపూడి వెంకటేశ్వరరావు అని ఆయన జీవితం ఓ తెరిచిన పుస్తకం అని మద్దాల ప్రభాకర్ రావు పేర్కొన్నారు. ఎర్రుపాలెంమండల కేంద్రమైన కామ్రేడ్ రామ్ శెట్టి పుల్లయ్య భవనంలో ఎర్రుపాలెం శాఖ కార్యదర్శి దూదిగం బసవయ్య అధ్యక్షతన స్వర్గీయ బో డెపుడి వెంకటేశ్వరరావు 29 వర్ధంతి నీ బుధవారం ఘనంగా నిర్వహించారు.తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రభాకర్ మాట్లాడుతూ మధిర శాసనసభ్యులుగా నిత్యం రైతాంగ సమస్యలపై స్పందించినటువంటి ప్రజా ప్రతినిధి బోడెపూడి అన్నారు. శాసనసభ్యులు అంటే హైదరాబాదులో ఉండి చుట్టం చూపుగా వచ్చి పోవడం కాదని నిత్యం రైతాంగ సమస్యలపై పోరాటం చేస్తూ రైతాంగం కోసం సాగర్ జలాల సాధన కోసం కాలువ కట్టలపై తిరిగిన చరిత్ర కారుడు బోడిపుడి వెంకటేశ్వర అన్నారు. రాజకీయాలకతీతంగా మంచినీటి సౌకర్యాలు, నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయటంలో నిస్వార్థం ఎరుగని మచ్చలేని మహనీయుడని కొనియాడారు. రైతాంగానికి పేద ప్రజలకు అండగా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు చేసే ప్రతి పోరాటంలో ఆయన ముందు ఉండేవారని ఆయన స్ఫూర్తిని ఎప్పటికీ మరువలేమని తెలిపారు. వ్యవసాయ రంగం నుండి రైతుని క్రమంగా దూరం చేసే విధానాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని విమర్శించారు.తొలుత విత్తనాలను రైతును దూరం చేశారని,పండించే పంటలు గిట్టుబాటు ధర నుండి రైతులను దూరం చేశారని అసహన వ్యక్తం చేశారు. ఎరువులు, పురుగుమందులు సబ్సిడీలు నుండి క్రమంగా రైతాంగానే సంక్షోభంలో నెట్టి నూతన ఆర్థిక విధానాలైనా స్వేచ్ఛ వాణిజ్యం, టారిఫ్ ఒప్పందాలు అమలవల్ల సకుటున ప్రతి అరగంటకు ఒక రైతు చొప్పున ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గామస్ జోగయ్య, నాగులవంచ వెంకట రామయ్య, నక్క పుల్లారావు, గుబ్బూరి కృష్ణంరాజు, అంజయ్య, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు



# గరిడేపల్లిలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

## కస్తూర్బా పాఠశాలలో 'సురక్ష కా తిరంగా' కార్యక్రమం.

**మీడియా టుడే గరిడేపల్లి ఆగస్టు 5:**

గరిడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ )లో బుధవారం సైబర్ నేరాలపై ముమ్మర అవగాహన సదస్సు నిర్వహించారు. పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సురక్ష కా తిరంగా – టువర్డ్స్ ఎ సైబర్ ఇండిపెండెంట్ తెలంగాణ' కార్యక్రమంలో భాగంగా ఈ సదస్సు జరిగింది. గరిడేపల్లి సబ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించి, విద్యార్థినులకు సైబర్ భద్రత మరియు ఆన్‌లైన్ మోసాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గరిడేపల్లి ఎస్ఐ మాట్లాడుతూ, నేటి ఆధునిక కాలంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు, సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా డిజిటల్ భద్రతా ప్రమాణాలను తెలుసుకోవడం అత్యంత అవసరమని స్పష్టం చేశారు. ముఖ్యంగా విద్యార్థినులు అంశాలపై ఖచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని వివరించారు:



# ఘనంగా ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి జన్మదిన వేడుకలు

## జర్నలిస్టుల సేవలు సమాజానికి ఎంతో విలువైనవి: ఉందూరు జితేందర్ రెడ్డి

## పాత్రికేయుల ఐక్యతే ప్రెస్ క్లబ్‌కు బలం: వడపల్లి కిషోర్ కుమార్

**ఉప్పల్, ఆగస్టు 5 (మీడియా టుడే ప్రతినిధి):**




ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గ టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఉందూరు జితేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు వడపల్లి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో నరసింహారెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి, కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఉందూరు జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, సమాజానికి వాస్తవాలను చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పాత్రికేయులు పనిచేస్తున్నారని కొనియాడారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మరింత అభివృద్ధి చెందాలని, ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డికి ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అధ్యక్షుడు వడపల్లి కిషోర్ కుమార్ మాట్లాడుతూ, పాత్రికేయుల ఐక్యతే ప్రెస్ క్లబ్‌కు బలమని, జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం ఉప్పల్ ప్రెస్ క్లబ్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షుడు ఇడపాక సురేష్, బోడ ప్రవీణ్, కశీదుకూరి ప్రశాంత్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ధత్రపు దేవాకుమార్ ,యాకూబ్ పాషా, నెమ్మది వెంకన్న తదితరులు పాల్గొని నరసింహారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# జిల్లా కలెక్టర్ ను కలిసిన నూతనంగా ఎన్నికైన జిల్లా నూతన ట్రేస్సాకార్యవర్గం

## జిల్లా కలెక్టర్ ను అడిషనల్ కలెక్టర్లను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి మొక్కలను అందజేశారు"

## నూతనంగా ఎన్నికైన జిల్లా ట్రేస్సా కార్యవర్గాన్ని అభినందనలు"

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి మీడియా టుడే ఆగస్టు 5:**



నూతనంగా ఎన్నికైన తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం కు ఎన్నికయిన కార్యవర్గాన్ని శాలువాలతో సన్మానించి పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష ప్రధాన కార్యదర్శి మేకల రాజ్ కుమార్,మహమ్మద్ అబ్దుల్ రజాక్ లుమాట్లాడుతూజిల్లాలోని రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను జిల్లా స్థాయిలో పరిష్కరించేలా కృషి చేస్తామని వారున్నారు. రెవెన్యూ వ్యవస్థను కాపాడుకుంటే మనల్ని ఆ రెవెన్యూ వ్యవస్థ కాపాడుతుందని వారు తెలిపారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యల సాధించే దిశగా కృషి చేస్తామని తెలిపారు.

# సైబర్ నేరాల నిర్మూలనలో విద్యార్థుల పాత్ర కీలకం

## జిల్లా సునిత రెడ్డి, ఐపీఎస్

**జిల్లా మీడియా టుడే ప్రతినిధి సి రమేష్ రెడ్డి ఆగస్టు 5**




సైబర్ మోసాలకు చెక్."సురక్షా కా తిరంగా"తో విద్యార్థుల్లో చైతన్యం నింపిన ఎస్పీ ఆగస్టు నెలలో జిల్లావ్యాప్తంగా ప్రత్యేక సైబర్ జాగృతి కార్యక్రమాలు ప్రత్యేక సైబర్ జాగృతి దివస్ పోస్టర్లను ఆవిష్కరించిన ఎస్పీ సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలని సూచనఅప్రమత్తతే సైబర్ నేరాలకు శాశ్వత పరిష్కారం. ప్రతి పౌరుడు సైబర్ భద్రతలో భాగస్వామి కావాలని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్ అన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "సురక్షా కా తిరంగా" సైబర్ స్వతంత్ర తెలంగాణ" ప్రత్యేక సైబర్ అవగాహన ప్రచార కార్యక్రమాన్ని బుధవారం రోజు వనపర్తి జిల్లా కేంద్రంలోని స్కాలర్స్ జూనియర్ కళాశాలలో జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఐపీఎస్ 7వందల మంది విద్యార్థినీ, విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు.అనంతరం ప్రత్యేక సైబర్ జాగృతి అవగాన పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు ప్రతి రోజూ కొత్త పద్ధతుల్లో అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. అధిక లాభాలు వస్తాయని చెప్పే పెట్టుబడి యాప్‌లు, నకిలీ ట్రేడింగ్ వెబ్‌సైట్లు, డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరింపులు, ఫేక్ లోన్ యాప్‌లు, ఓటీపీ, కేవైసీ, సోషల్ మీడియా, ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి.'ఆగు -- ఆలోచించు -- నిజం నిర్ధారించు -- సైబర్ భద్రత పెంచు' అనే సందేశాన్ని ప్రతి పౌరుడు జీవితంలో ఆచరించినప్పుడే సైబర్ నేరాలను సమర్థంగా అరికట్టగలుగుతాం. ప్రతి విద్యార్థి తన కుటుంబానికి, గ్రామానికి, సమాజానికి సైబర్ భద్రత రాయబారిగా మారాలని కోరారు. ఆగస్టు నెల మొత్తం జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలు, మహిళా సంఘాలు, గ్రామ పంచాయతీలు, స్వచ్ఛంద సంస్థలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లలో విస్తృత స్థాయిలో సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. సైబర్ నేరాలపై ప్రజల్లో అప్రమత్తత పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ప్రజలకు ముఖ్యంగా అనుమానాస్పద లింకులు, యాప్‌లు, పెట్టుబడి ఆఫర్లను నమ్మవద్దు. ఓటీపీ, బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్‌లు ఎవరికీ చెప్పవద్దు. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు, ప్రముఖుల పేర్లతో వచ్చే పెట్టుబడి ఆఫర్లను ధృవీకరించకుండా నమ్మొద్దని తెలిపారు నేటి విద్యార్థులే రేపటి డిజిటల్ భారత నిర్మాణ శిల్పులని ఎస్పీ పేర్కొన్నారు. పాఠశాలలో నేర్చుకున్న సైబర్ భద్రత అంశాలను తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలకు తెలియజేస్తూ, అనుమానాస్పద లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్‌లను ఎవరికీ ఇవ్వవద్దని అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి విద్యార్థి తన కుటుంబానికి, గ్రామానికి, సమాజానికి "సైబర్ భద్రత రాయబారి"గా మారాలని పిలుపునిచ్చారు.సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలి లేదా ఒఒఒ.ఎఎఎవతీఎతీఅఎవ.స్త్రశీజ.ఱఅలో వెంటనే ఫిర్యాదు నమోదు చేయాలని ఎస్పీ తెలిపారు.అనంతరం సైబర్ భద్రత నియమాలను తప్పకుండా పాటిస్తాను.ఓటీపీ, పాస్‌వర్డ్‌లు ఎవరికీ చెప్పను.సైబర్ మోసాలకు దూరంగా ఉంటూ, ఇతరులను కూడా అప్రమత్తం చేస్తాను.సురక్షిత డిజిటల్ భారత నిర్మాణానికి నా వంతు కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ, గిరిబాబు, వనపర్తి సీఐ, సుగంధరత్నం, సైబర్ క్రైమ్ సీఐ, శ్రీను నాయక్, సైబర్ క్రైమ్ ఎస్సై, ఏహెచ్ టి యు ఎస్సై, అంజద్, వనపర్తి పట్టణ ఎస్సై హరిప్రసాద్, మహిళ ఎస్సై, హైమ, స్కాలర్ జూనియర్ కళాశాల యజమాన్యం, జగదీశ్వర్, వరప్రసాద్ రావు,నాగేశ్వర్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్, శ్రీధర్, షి టీం, భరోస, ఏ హెచ్ టియు, సిబ్బంది మరియు అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# వైద్యానికి ఆర్థిక సహాయం

**రాయికల్-మీడియా టుడే-ఆగస్టు 5:**



రాయికల్ మండలం ధర్మాజీపేట గ్రామానికి చెందిన అంగోతు శ్రావణి అమ్మా నాన్నలను కోల్పోయి... ఆనారోగ్యంతో బాదపడుతుంది. అమె ఆర్థిక పరిస్థితి తెలిసిన 2002-03 పదవ తరగతి మిత్రులు స్థాపించిన సహాయ హస్తం ఫౌండేషన్ ద్వారా బుధవారం బాధితురాలికి మిత్రులందరూ పదివేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాల వారోత్సవాలు




**రాయికల్-మీడియా టుడే-ఆగస్టు 5:**

రాయికల్ మండలం ధర్మాజీపేట అంగన్వాడి కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్లు పిల్లలకు తల్లిపాలు ఇవ్వడం రోగ నిరోధక శక్తి పెరుగుతుందని... తల్లిపాల గురించి బాలింతలకు, తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వాకిటి గంగారెడ్డి, ఉపసర్పంచ్ కాయితి సంజీవ్, ప్రధానోపాధ్యాయులు జనార్దన్ రావు, అంగన్వాడీ టీచర్లు కాయితి ప్రమీల, మేకల అనురాధ, ఆశా వర్కర్ మేకల రమ, విఓఏ మేకల సరిత తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ హృదయ కలశ యాత్ర



**రాయికల్-మీడియా టుడే-ఆగస్టు 5:**

రాయికల్ మండలం భూపతిపూర్ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో త్రిదండి చిన్న జీయర్ స్వామి 70వ తిరునక్షత్ర మహోత్సవాల సందర్భంగా వికాస తరంగిణి ఆధ్వర్యంలో శ్రీరామ హృదయ కలశ యాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస తరంగిణి బాధ్యులు వెంకటకృష్ణమాచార్యులు మాట్లాడుతూ అక్టోబర్ 26 వరకు యాత్ర జరుగుతుందని... ప్రతి గ్రామ దేవాలయంలో శ్రీరామ హృదయ కలశానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్ని కలశాలను హైదరాబాద్ ఆశ్రమానికి తీసుకెళ్లి 1008 శ్రీరామ హృదయ కలశాలతో మహాభిషేకం నిర్వహిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుర్రం భావన మహేందర్, ఆలయ చైర్మన్ జక్కుల చంద్రశేఖర్, వేల్పుల స్వామి యాదవ్, మూగల సంజీవచారీ, బొల్లె చిన్నయ్య, నలువాల రాము, కొమ్ము దిలీప్, పీలి నర్సారెడ్డి, రొండ్ల రాజేశం, నెల్లూరి శ్రీనివాస్, జక్కుల విద్యాసాగర్, సంకోజి మహేష్, మారంపెల్లి గంగాజల, కట్ట స్వప్న, గుండోజి రాజమణి, అమరగొండ మాధురి, వాసాల లావణ్య, బండి సునీత, అమరగొండ మాధవి, గుండోజి రాజమణి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన



**రాయికల్-మీడియా టుడే-ఆగస్టు 5:**

రాయికల్ మండలం భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఏఎస్సై సైఫుద్దీన్, విలేజ్ పోలీస్ ఆఫీసర్ సుమన్ లు 6నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గంజాయి, ట్రాఫిక్ నియమాల గురించి వివరించారు. మొబైల్ ఫోన్ లో తెలియని లింకులు క్లిక్ చేయవద్దు. అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దని, బ్యాంకు లేదా ప్రభుత్వ అధికారుల పేరుతో వచ్చే నకిలీ కాల్స్, మెసేజ్‌లను నమ్మవద్దని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యూవి రమణీ, ఉపాధ్యాయులు బొల్లె చిన్నయ్య, శంకరయ్య, సత్యనారాయణ, సహబజ్ హుస్సేన్, సంజయ్ కుమార్, వేణుగోపాల్, కమారుద్దీన్, పుష్పలత, భవాని, శైలజ, సాయబు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బోనాల వేడుకలు



**రాయికల్-మీడియా టుడే-ఆగస్టు 5:**

రాయికల్ మండలం కిష్టంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ విశిష్టతను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి, బోనాలను అలంకరించి అమ్మవారికి సమర్పించారు. తెలంగాణ జానపద పాటలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల అంజయ్య గౌడ్, ఏఏపిసి చైర్మన్, ఉపాధ్యాయినిలు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# క్షయ నిర్ధారణ శిబిరం

**రాయికల్-మీడియా టుడే-ఆగస్టు 5:**

రాయికల్ మండలం అల్లిపూర్ ఆరోగ్య కేంద్రంలో బుధవారం క్షయ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో డిజిటల్ మొబైల్ ఎక్స్ రే మిషన్ తో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ముందస్తు నిర్ధారణ పరీక్షలతోనే క్షయ నివారణ సాధ్యం అవుతుందని అన్నారు. దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే తేమడ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సుమారు 45 మందికి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎంబారీ గౌతమి, వైద్యాధికారి సతీష్ కుమార్, ఎంఎల్‌ఎచ్ పి సుప్రీయ, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మాటలు రాని యువతిపై అత్యాచారయత్నం కేసులో కోర్టు సంచలన తీర్పు

## జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్

**వనపర్తి జిల్లా మీడియా టుడే ప్రతినిధి**
**రమేష్ రెడ్డి ఆగస్టు ఆగస్టు 5**

అత్యాచారయత్నం కేసులో నిందితుడికి 7 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా విధించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహిళలపై నేరాలకు పాల్పడే వారికి కఠిన శిక్షలే హెచ్చరిక ఎస్పీ బాధితులకు న్యాయం చేయడంలో జిల్లా పోలీసు ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తారు ఎస్పీ మాటలు రాని యువతిపై అత్యాచారయత్నానికి పాల్పడిన నిందితుడిపై నేరం రుజువుకావడంతో గౌరవ వనపర్తి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ బాకరాజు శ్రీనివాసరావు నిందితుడికి 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు 61,000 జరిమానా విధిస్తూ ఈ రోజు (05-08-2026) తీర్పు వెలువరించారని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్ తెలిపారు.కేసు యొక్క వివరాలు29-10-2022 తేదీన మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో బాధితురాలు పుట్టుకతో మాటలు సరిగా రాని యువతి రాయిగడ్డ( బ్రాహ్మణ వీధి ) లో తన ఇంటిలో ఉండగా ఇంటి పక్కల వ్యక్తి అయినటువంటి గాడుదుల నాగశేషి అక్రమముగా ఇంటిలోకి ప్రవేశించి 18 సంవత్సరాల తన చెల్లెలిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడని ఈ సంఘటన ఫిర్యాదు దారు తేది: 29-10-2022 తేదీన వనపర్తి టౌన్ పోలీస్టేషన్లో ఫిర్యాదు చేశారు. అప్పటి వనపర్తి టౌన్ ఎస్సై యుగంధర్ రెడ్డి , కేసు నమోదు ఇన్వెస్టిగేషన్ ప్రారంభించారుఫిర్యాదు దారుడు మరియు బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం, నిందితుడు అక్రమంగా బాధితురాలు ఇంటిలోకి ప్రవేశించి ఆమెను కొట్టి బెదిరించి బాధితురాలు పాయింటు విప్పుతుండగా అదే సమయంలో వెళ్ళిన ఫిర్యాదుదారుడు చూసి నేరస్తుడిని ఎందుకు ఇక్కడ ఉన్నావని అడగగా అతడు పొంతన లేని సమాధానాలు చెప్పి అక్కడ నుంచి పారిపోయాడు అని తెలిపారు. సంఘటన జరిగిన ప్రాంతంలో ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు సేకరించి చుట్టూ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఇది గుర్తించిన చుట్టు ప్రక్కన వారు తమ సమీప బంధువులు పోలీసులకు సంఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులకు తెలియజేశారు. దీనిలో భాగంగా సాంకేతికంగా అవసరమైన ఆధారా లను సేకరించి నివేదికను తయారుచేసి. అప్పటి ఇన్వెస్టిగేషన్ అధికారి ఎస్సై, యుగంధర్ రెడ్డి ,కేసు నమోదు చేసి పైన పేర్కొనబడిన నిందితుడిని రిమాండ్కు తరలించి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రస్తుత ఎస్సై, హరి ప్రసాద్ , వనపర్తి కోర్టు లైజనింగ్ అధికారి, కె, సత్యం, కోర్టు కానిస్టేబుల్, రాజశేఖర్ ఆధ్వర్యంలో కోర్టులోసాక్షులను ప్రవేశపెట్టగా , ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి, శ్రీనివాసచారి వాదించారు . కేసు పూర్వాపరాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టులో వాదనలు వినిపించగా నేరస్తునిపై నేరం నిరూపణ అయినందున ఈ రోజు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ బాకరాజు శ్రీనివాసరావు గారు తీర్పు వెలువరించడం జరిగిందని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మహిళలు, బాలికల భద్రతకు వనపర్తి జిల్లా పోలీసులు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. మహిళలపై నేరాలకు పాల్పడే ఎవరినీ ఉపేక్షించము. శాస్త్రీయ దర్యాప్తు, పటిష్టమైన సాక్ష్యాధారాలతో నేరస్తులను చట్టం ముందు నిలబెట్టి కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటాము. ప్రజలు ఎలాంటి సంఘటన జరిగినా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఐపీఎస్., తెలిపారు.ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించిన దర్యాప్తు అధికారులు, సాక్షులను సమర్థంగా కోర్టులో ప్రవేశపెట్టిన పోలీసు అధికారులు, కోర్టు లైజనింగ్ సిబ్బంది, కోర్టు డ్యూటీ అధికారులు మరియు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ను జిల్లా ఎస్పీ అభినందించారు

# విజన్ ఇండియా ఏ2047 జాతీయ సదస్సుకు ఏర్పాట్లు పూర్తి

**ప్రారంభోత్సవానికి రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ**

**- ముగింపు కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథులు**




**మహబూబ్‌నగర్, మీడియా టుడే ప్రతినిధి:**

పాలమూరు యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 7, 8 తేదీలలో "విజన్ ఇండియా ఏ2047 -- ఇంటిగ్రేటింగ్ సైన్స్ , ఇన్నోవేషన్ అండ్ యూత్ ఎంపవర్మెంట్ " అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య పూస రమేష్ బాబు తెలిపారు.??పాలమూరు యూనివర్సిటీ పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆగస్టు 7న కన్హ శాంతి వనంలో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన సుమారు 25 మంది ఉపకులపతులు, రిజిస్ట్రార్లు, ప్రముఖ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, విధాన రూపకర్తలు, పరిశ్రమల ప్రతినిధులు, పరిశోధకులు పాల్గొంటారని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థల నుంచి పెద్ద సంఖ్యలో అధ్యాపకులు, పరిశోధకులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించనున్నారని తెలిపారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో తాజా ఆవిష్కరణలు, కృత్రిమ మేధస్సు, సుస్థిర అభివృద్ధి, యువత సాధికారత, పరిశ్రమ--విద్యాసంస్థల అనుసంధానం, నవకల్పనల ప్రోత్సాహం వంటి అంశాలపై ప్రముఖులు తమ అభిప్రాయాలను పంచుకోనున్నట్లు వెల్లడించారు.??ఆగస్టు 8న పాలమూరు యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ ఆడిటోరియంలో టెక్నికల్ సెషన్లు నిర్వహించ నున్నట్లు తెలిపారు. వివిధ విభాగాలకు చెందిన పరిశోధకులు తమ పరిశోధనా పత్రాలను ప్రదర్శించను న్నారని, నిపుణులతో శాస్త్రీయ చర్చలు జరగనున్నాయని చెప్పారు. అనంతరం జరిగే వాలెడిక్టరీ (ముగింపు) కార్యక్రమానికి కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు.

**సదస్సు ప్రాధాన్యత**

వికసిత భారత్--2047 లక్ష్య సాధనలో ఉన్నత విద్య, శాస్త్రీయ పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలు, యువత భాగస్వామ్యం అత్యంత కీలకమని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. ఈ జాతీయ సదస్సు ద్వారా దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమల నిపుణులు ఒకే వేదికపైకి వచ్చి సమకాలీన సవాళ్లు, వినూత్న పరిష్కారాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారని తెలిపారు. పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులకు పరస్పర అనుభవాల మార్పిడి, సంయుక్త పరిశోధనలకు అవకాశాలు లభించడంతో పాటు, నూతన ఆలోచనలకు ప్రోత్సాహం అందుతుందని వివరించారు.ఈ సదస్సు పాలమూరు యూనివర్సిటీకి జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంతో పాటు, పరిశోధన, ఆవిష్కరణలు, నాణ్యమైన ఉన్నత విద్యకు మరింత ఊతమివ్వనున్నదని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.??ఈ విలేకరుల సమావేశంలో సదస్సు కన్వీనర్లు ప్రొఫెసర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ కె. ప్రవీణ కమిటీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ నూర్జహాన్, పీ ఆర్ ఓ డాక్టర్ ఎం.గాలెన్న, కోఆర్డినేటర్ డాక్టర్ శేకుంటి రవి కుమార్, అధ్యాపకులు మరియు సదస్సు నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# డిగ్రీ ప్రవేశాలకు చివరి అవకాశం

**యాదాద్రి భువనగిరి జిల్లా మీడియా టుడే,ఆగస్టు 5:**
**రామన్నపేట,ప్రతినిధి**

దోస్తు స్పెషల్ డ్రైవ్ ఫేస్ షెడ్యూల్ విడుదలైందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం తెలియజేశారు.షెడ్యూల్ ప్రకారం ఈ నెల 6 నుంచి 11 వరకు ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని,వెబ్ ఆప్షన్ ఈనెల 6 నుంచి 12 వరకు ఆయా కళాశాలలోని ఆయా కోర్సులను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ఆగస్టు 14న సీట్ల కేటాయింపు జరగగా 14 నుండి 18 వరకు ఆన్లైన్లో సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేయాలని సూచించారు.సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేసిన విద్యార్థులు 17,18 తేదీల్లో ఇంటర్మీడియట్ ఒరిజినల్ టి.సి.సర్టిఫికెట్ తో పాటు ఇతర సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులతో కళాశాలకు విచ్చేసి అడ్మిషన్ కు సంబంధించిన కన్ఫర్మేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే కళాశాలలో కన్ఫర్మేషన్ ప్రక్రియ పూర్తి చేసుకున్నవారు ఇంట్రా కాలేజ్ ఫేస్.2 ద్వారా ఆగస్టు 20,21తేదీల్లో విద్యార్థులు తమ దోస్త్ వ్యక్తిగత లాగిన్ ద్వారా కళాశాల స్థాయిలో కోర్సు మార్పు కోసం వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని ఇందుకు సంబంధించిన సీట్ల కేటాయింపు 22న జరుగుతుందని తెలియజేశారు.ఇది అడ్మిషన్లకు సంబంధించి చివరి అవకాశం కాబట్టి ఇప్పటివరకు ఏ కళాశాలలో కూడా ప్రవేశం పొందని ప్రతి విద్యార్థి తప్పకుండా ఆన్లైన్ ద్వారా గాని



కళాశాల కార్యాలయంలో సంప్రదించి గాని దరఖాస్తు చేసుకొని అడ్మిషన్లు పొందాలని తెలియజేశారు. సకల సదుపాయాలు,సుదీర్ఘ అనుభవముగల ప్రతిభావంతులైన అధ్యాపకులు గల స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అత్యధిక సంఖ్యలో విద్యార్థులు అడ్మిషన్లు పొందాలని కోరారు.

# మరికల్ గ్రామానికి చెందిన బంక రామకృష్ణ ప్రతిభకు సన్మానం

**బాపట్ల కృష్ణమోహన్, మీడియా టుడే, ఆగస్టు 05:**

వికారాబాద్ జిల్లా, పరిగి అసెంబ్లీ నియోజకవర్గం, చౌడాపూర్ మండలం, మరికల్ గ్రామానికి చెందిన బంక రామకృష్ణ తండ్రి పేరు అంజయ్య,తెలంగాణ స్టేట్ రోడ్డు ట్రాన్స్పోర్ట్ కార్పొరేషన్ (=ఉజ) విడుదల చేసిన ఫలితాలలో సెలెక్ట్ కావడం జరిగింది.ఈ సందర్భంగా బంక రామకృష్ణ ను సన్మానించిన కుల్కచర్ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్మోహన్ శర్మ,పిఎసిఎస్ డైరెక్టర్ దామోదర్ రెడ్డి,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నడిమింటి శివకుమార్,సీనియర్ నాయకులు నరేందర్ ప్రసాద్, నర్సిములు, కృష్ణ చారి తదితరులు పాల్గొన్నారు.



Printed, Published, Editor and owned by K.Koteshwar Rao, Ph.9052477378,#6-1-106, 1st Floor, shop No. 13&14&, near Post office Khairatabad, Hyderabad-04, T.S. RNI No. APTEL/2013/54465, Volme: 12, Issu:103